www.visalaandhra.com

స్థాపితం : 1952

విశాలాంధ్ర

అక్షరాక్షరం అభ్యుదయం

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

సోమవారం

11-11-2024

హైదరాబాద్ ప్రచురణ

సంపుటి : 09, సంచిక : 50

పేజీలు : 8, వెల: రూ.5.00

Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

హౌతీల ఆయుధాగారంపై అమెరికా వైమానిక దాడి

వాషింగ్టన్: యెమన్‌లోని హౌతీల ఆధునిక ఆయుధాగారంపై అమెరికా యుద్ధ విమానాలు విరుచుకుపడ్డాయి. అనేకమార్లు దాడులు చేశాయి. ఈ మేరకు పెంటాగాన్ ప్రకటించింది. ఎర్ర సముద్రం, గల్ఫ్ ఆఫ్ ఆడెన్ అంతర్జాతీయ జలాల్లో తిరిగే పౌర, సైనిక నౌకలపై దాడులకు వినియోగించే వివిధ ఆయుధాలను నిల్వ చేసిన ప్రాంతాన్ని పసిగట్టి దాడి చేసినట్లు వెల్లడించింది. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నిక, ఇజ్రాయిల్‌కు అగ్రరాజ్యం మద్దతుపై హౌతీ నేత అబ్దుల్ మలిక్ అల్ హౌతీ విమర్శలు చేసిన కొద్ది రోజుల్లోనే ఈ దాడి జరగడం చర్చనీయాంశంగా మారింది. యెమన్ రాజధాని సనాలోని దక్షిణ అల్ సబ్రీన్ జిల్లా లక్ష్యంగా అమెరికా, బ్రిటిష్ దాడులు జరిగినట్లు హౌతీల అల్ మసీరా టీవీ నెట్‌వర్క్ నివేదించింది.

ఏలూరు వైద్య కళాశాలకు డాక్టర్ ఎల్లాప్రగడ పేరు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలకు ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త దివంగత డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు పేరు పెడుతూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇటీవల చేసిన సూచనలకు అనుగుణంగా ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. దీనిపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఎల్లాప్రగడ పేరును తాను ప్రతిపాదించగానే ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించడం

- మిగతా 2 లో

ఖాలిస్థానీ అర్షదుల్లా కెనడాలో అరెస్టు

న్యూఢిల్లీ: ఖాలిస్థానీ అర్ష్‌దీప్ సింగ్ అలియాస్ అర్షదుల్లాను కెనడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గనెలలో జరిగిన కాల్పుల వ్యవహారంలో ఇండియాస్ మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ దల్లా అరెస్టయ్యాడు. ఖాలిస్థానీ హర్దీప్ సింగ్ నిజ్జర్‌కు దల్లా సన్నిహితుడు. పంజాబ్‌లోని మోగా జిల్లాలో కాంగ్రెస్ నేత బల్జిందర్ సింగ్ బల్లి హత్యకు బాధ్యత వహిస్తూ ఈ ఏదాది సెప్టెంబరులో దల్లా ప్రకటన చేశారు. గతనెలలో ఫరీద్‌కోట్ జిల్లాలో సిక్కు కార్యకర్త గుర్‌ప్రీత్ సింగ్ హరి నౌ హత్య కేసులో దల్లా కోసం పనిచేసే

- మిగతా 2 లో

మెక్సికో బార్‌లో కాల్పులు

10 మంది మృతి

మెక్సికో సిటీ: మెక్సికన్‌లో కాల్పులు కలకలం రేపాయి. క్వెరెటారో నగరంలోని బార్‌పై నలుగురు సాయుధులు దాడి చేశారు. విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. దీంతో 10 మంది చనిపోగా, ఏడుగురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. దుండ గులు ఓ పికప్ ట్రక్కులో వచ్చి దాడి చేసినట్లు క్వెరెటారో ప్రజా భద్రతా విభాగాధికారి జువన్ లూయిస్ ఫెరుసా తెలిపారు. అత్య వసర సేవల సిబ్బంది రంగంలోకి దిగి తగు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. దుండగులట్రక్కుకు వదిలి పారిపోయే ముందు దానికి నిప్పు పెట్టి వెళ్లారన్నారు.

క్రోనీ క్యాపిటలిస్ట్‌ల నుంచి జార్ఖండ్‌ను రక్షించండి

దేశ సంపద ప్రజలకు చెందాలన్నదే రాహుల్ సందేశం

ఇండియా కూటమిని గెలిపిస్తేనే మనుగడ: భట్టి

విశాలాంధ్ర-హైదరాబాద్: అదానీ, అంబానీ వంటి కొద్దిమంది క్రోనీ క్యాపిటలిస్ట్‌ల నుంచి జార్ఖండ్ కు విముక్తి కలిగించాలని, ఇండియా కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. జార్ఖండ్‌లోని రాంఘర్‌లో కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ సమావేశం ఆదివారం జరిగింది. నాయకులు, కార్యకర్తలకు ఆయన దిశానిర్దేశం చేశారు. చిత్తార్పూర్ సీ, డీ బ్లాక్ రాజరప్ప బహిరంగ సభలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో రాహుల్ గాంధీ కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు చేసిన జోడో యాత్రతో ప్రజాస్వామిక శక్తులను ఏకం చేశారని అన్నారు. విద్వేషాలను రగిలించే వారి చేతిలో ఈ దేశాన్ని పెట్టేందుకు తాము సిద్ధంగా లేం, విశాల భారతదేశంలో ప్రేమ అనే దుకాణం తెరిచి అన్ని జాతులు, మతాలకు సమాన అవకా శాలు కల్పిస్తామన్న సందేశం రాహుల్ ఇచ్చారని వివరించారు. వనరులు, సంపద, ప్రభుత్వ రంగ సంస్థలు ప్రజలకే చెందాలి తప్ప కొద్ది మంది క్రోనీ క్యాపిటల్ లిస్ట్ ల చేతిలో పెట్టేందుకు సిద్ధంగా లేమని సందేశం ఇచ్చారని పేర్కొన్నారు. ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపిస్తేనే ఝార్ఖండ్ వనరులు రక్షించబడతాయని అన్నారు. సంపద జనాభా నిష్పత్తికి అనుగుణంగా పంపిణీ జరగాలి అంటే ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించడమే మన లక్ష్యం అని తెలిపారు. ఇండియా కూటమి మ్యానిఫెస్టోను ఓటర్లకు వివరిస్తూ విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. రాంఘర్ అభ్యర్థి మమతా దేవిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఏఐసీసీ నాయకులు గులాం అహమద్ మీర్ , ఏఐసీసీ సెక్రటరీ సిరివెళ్ల ప్రసాద్, జార్ఖండ్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కేశవ్ కమలేష్ మహతో, షహ్ నాజ్ అన్వర్, మైనారిటీ సెల్ అధ్యక్షుడు తారీక్ అన్వర్, షకీల్ అహ్మద్ పాల్గొన్నారు.

పాలమూరు అభివృద్ధే నా కాంక్ష

- పదేళ్లు పాలించి జిల్లాకు చేసింది శూన్యం
- ప్రాజెక్టుల అసంపూర్తికి గత పాలకులదే పాపం
- గ్రామగ్రామానికి బీటీ రోడ్లు: రేవంత్

విశాలాంధ్ర-హైదరాబాద్: తాను పదవిలో ఉన్నా లేకున్నా పాలమూరు జిల్లా అభివృద్ధిని కాంక్షించే వాడినే అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ జిల్లా బిడ్డగా జిల్లా అభివృద్ధి తన బాధ్యత అని పేర్కొన్నారు. కురుమూర్తి స్వామి దేవాలయంలో రూ.110కోట్ల అంచనా వ్యయంతో ఘాట్ రోడ్, ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం సభలో ఆయన ప్రసంగిం చారు. పదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ పాలమూరు జిల్లా అభివృద్ధికి చేసిందేమీ లేదని మండిపడ్డారు. పేదల తిరుపతిగా కురుమూర్తిస్వామి ఆలయం ప్రసిద్ధి పొందిందని, తెలంగాణ నుంచే కాకుండా కర్నాటక నుంచి కూడా భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకుంటారని అన్నారు. భక్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని

చెప్పారు. వలసలకు మారుపేరు పాలమూరు జిల్లా అని, దాన్ని రూపుమాపేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పాలమూరు జిల్లాలో ప్రాజెక్టులు పూర్తి కాకపోవడానికి కారణం గత పాలకుల నిర్లక్ష్యమే అంటూ ధ్వజమెత్తారు. ప్రాజెక్టులు పూర్తి చేసి పాడిపంటలతో విలసిల్లేట్లు చేస్తామన్నారు. నారాయణ్ పెట్ , కొడంగల్ ప్రాజెక్టు పూర్తి చేసి త్వరలోనే మక్తల్, నాగర్ కర్నూల్, కొడంగల్ ప్రాంతాలకు కృష్ణా జలాలు పారిస్తాని భరోసా ఇచ్చారు. ఈ జిల్లా బిడ్డగా సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయకపోతే నన్ను చరిత్ర క్షమించదన్నారు. కోపం ఉంటే రాజకీయంగా నాపై కక్ష సాధించండి తప్ప ప్రాజెక్టులను అడ్డుకోవద్దని, జిల్లా అభివృద్ధిని అడ్డుకోవద్దని సూచించారు. అమర్ రాజా బ్యాటరీస్ కంపెనీలో రెండువేల మంది స్థానికులకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇవ్వడానికి అంగీకరించారని చెప్పారు. జిల్లాలో గ్రామ గ్రామానికి, తండాలకు బీటీ రోడ్లు వేస్తామని, ఆ దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించి జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు నడిపించుకుందామని పిలుపునిచ్చారు. సీఎం వెంట మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యేలు, అధికారులు ఉన్నారు.

సీజేఐగా జస్టిస్ ఖన్నా ప్రమాణం నేడు

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ)గా జస్టిస్ సంజీవ్ ఖన్నా సోమవారం ప్రమాణం చేయనున్నారు. రాష్ట్రపతి భవన్‌లో ఆయనతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణం చేయిస్తారు. ప్రస్తుత సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ పదవీ కాలం ఆదివారంతో ముగియనుండడంతో మరుసటి రోజునే జస్టిస్ సంజీవ్ ఖన్నా పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రమాణ స్వీకారం అనంతం ఆయన నేరుగా సుప్రీంకోర్టుకు చేరుకుంటారు. కోర్టు నంబర్-1లో సీజేఐ హోదాలో కేసుల విచారణ ప్రారంభిస్తారు. ఆయన దాదాపు ఆరు నెలల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. వచ్చే ఏడాది మే 13న తన 65వ పుట్టినరోజుకు ఒకరోజు ముందు పదవీ విరమణ చేయనున్నారు. భారత ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించనున్న నేపథ్యంలో జస్టిస్ ఖన్నా తన

- మిగతా 2 లో

కులగణనలో వ్యక్తిగత గోప్యత పాటించాలి

ప్రశ్నావళి నుంచి అనవసర అంశాలు తొలగించాలి: కూనంనేని

విశాలాంధ్ర-హైదరాబాద్: కులగణన ఇంటింటి సర్వేలో వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగే అవకాశం ఉందని వివిధ వర్గాల వారు ఆందోళన చెందుతున్నారని, దీనిపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు అన్నారు. కుల గణన మంచిదే అయినప్పటికీ ... కేవలం అందుకు సంబంధించిన అంశాలకే పరిమితమవ్వాలని సూచించారు. సైబర్ నేరాలు హెచ్చుమీరుతున్న నేపథ్యంలో కులగణనలో సేకరిస్తున్న ఫోన్ నెంబర్లు, బ్యాంక్ ఖాతాలు, ఆధార్ కార్డు తదితర వివరాలు సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కితే ఇబ్బంది అవుతుందన్నారు. అలా జరగకుండా పకడ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని చోట్ల ఏ పార్టీ అని కూడా అడుగుతున్నారనే విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. వ్యక్తిగత గోప్యత పాటించాలని, వాటిని బహిర్గత పర్చాల్సిన అవసరం లేదని కోర్టులు చెప్పిన విషయాన్ని కూనంనేని గుర్తు చేశారు. సిబ్బంది వేసే కొన్ని ప్రశ్నలు ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నదని, వాటిని ఉపసంహరించుకోవాలని సూచించారు. తక్షణమే ఈ అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించి స్పష్టతనివ్వాలని విజ్ఞప్తి చేశారు.

మతోన్మాదశక్తులతో రాజ్యాంగానికి ముప్పు

- ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లోనే బీజేపీ పాలన
- నూతన జాతీయ విద్యా విధానంతో అట్టడుగు వర్గాలకు నష్టం
- ఏఐడీఆర్‌ఎం జాతీయ మహాసభల పోస్టర్ ఆవిష్కరణలో సీపీఐ ప్రముఖులు

విశాలాంధ్ర- హైదరాబాద్: భారత రాజ్యాంగానికి మతోన్మాద శక్తుల నుంచి ప్రమాదం పొంచి ఉందని సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం. బాల నరసింహులు ఆందోళన వ్యక్తం చేశారు. అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం (ఏఐడీఆర్‌ఎం) రెండో జాతీయ మహాసభల పోస్టర్‌ను ఆదివారం హిమాయత్ నగర్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... భారత రాజ్యాంగం దేశ సమైక్యత, సమగ్రతలను నిలబెడుతుందని, రాజ్యాంగ రక్షణకు సామాజిక శక్తులు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. వెంకట రెడ్డి మాట్లాడుతూ మత రాజ్యాలన్నీ చీకటి రాజ్యాలు అయితే భారత రాజ్యాంగం సర్వసత్తాక గణతంత్ర సామ్యవాద సోషలిస్టు భావాలను సంతరించుకుందని చెప్పారు. నూతన జాతీయ విద్యా విధానంతో అట్టడుగు వర్గాల హక్కులను బీజేపీ కాల రాస్తుందన్నారు. రాజ్యాంగం పునాదులుగా ఉన్న ప్రజాస్వామ్యం, ఫెడరలిజం, సామాజిక న్యాయం, లౌకికత్వం... నాలుగు మూలస్తంభాలను కాపాడుకోవాలని అన్నారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేసి తద్వారా సామాజిక న్యాయానికి బాట వేయాలని కోరారు. కూనంనేని మాట్లాడుతూ దేశ ప్రజలందరినీ ఒకే తాటిపై నిలబెట్టడానికి కులం, మతం, భాష, ప్రాంతాలకు

- మిగతా 2 లో

సత్యన్ మొకేరి విస్తృత ప్రచారం

వయనాడ్: కేరళలోని వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గంలో ఎన్నికల బరి సిద్ధమవుతోంది. పోలింగ్‌కు రెండు రోజులే ఉన్నాయి. ఈనెల 13న ఓటింగ్ జరగనుంది. దీంతో ప్రచారం చివరి దశకు చేరుకుతంది. ఎల్‌డీఎఫ్ తరపున సీపీఐ సీనియర్ నేత సత్యన్ మొకేరి తన ప్రచారాన్ని జోరుగా సాగిస్తున్నారు. అటు యూడీఎఫ్ అభ్యర్థి ప్రియాంక గాంధీ, ఎన్‌డీఏ అభ్యర్థి నవ్య హరిదాస్ కూడా ప్రచారం చేస్తున్నారు. వామపక్ష నేతకు వయనాడ్ ప్రజల ఆదరణ లభిస్తోంది. ఎక్కడ ప్రచారానికి వెళ్లిన ఆయనకు జనం బ్రహ్మరథం పడుతున్నారు. జననీరాజాలతో తుది దశ ప్రచారాన్ని మొకేరి వేడెక్కిస్తున్నారు. ఎల్‌డీఎఫ్ ప్రచార ఫలితంగా యూడీఎఫ్ అభ్యర్థి దివి నుంచి భువికి దిగి వచ్చారంటూ మొకేరి వ్యాఖ్యానించారు. తన రాజకీయ అనుభవం, ప్రజాభిమానమే తనను విజేతగా నిలబెడతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. విస్తృతంగా ప్రచారాన్ని సాగిస్తున్న మొకేరి ఆదివారం మనంతవాడీ ప్రజల మధ్యకు వెళ్లారు. తనను గెలిపించాలని కోరారు. ప్రజలు ఆదరిస్తుండటంతో మొకేరి రెట్టింపు ఉత్సాహంతో... గెలుపు దీమాతో ముందుకెళుతున్నారు. కాల్పెట్టాలోని కొటికలాసాలో ఆయన సోమవారం ప్రచారం నిర్వహించనున్నారు. మరోవైపు తిరునెల్లి కంపలక్కాడ్‌లో ప్రియాంక, తిరువంబాడిలో నవ్య హరిదాస్ ప్రచార సభలు జరిగాయి.

ఇదీ లోకం!

నాన్న చెడ్డీతో పాటు నా చెడ్డీ కూడా బాగా ఉతికినపుడే నీకు మహిళగా పరిపూర్ణత వస్తుంది మాతాశ్రీ!

అమరావతి అభివృద్ధికి ముందడుగు

- మౌలిక వసతులు, హరిత నిర్మాణాలు
- రూ.15 వేల కోట్ల రుణ ప్రతిపాదనలకు ఆమోదం
- ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అమరావతి రాజధాని నిర్మాణం, సమగ్రాభివృద్ధికి ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు ఇచ్చే రుణవినియోగంపై ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఆయా బ్యాంకులు కలిపి రూ.15 వేల కోట్ల రుణం అందించనున్నట్లు వెల్లడించింది. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి జి.అనంతరాము ఆదివారం ఉత్తర్వులు జారీజేశారు. అమరావతి రాజధాని అభివృద్ధి ప్రణాళికలు అమలు చేయాలని సీఆర్డీఏను ఆదేశిం చారు. ఈ నిధులతో రాజధానిలో మెరుగైన ప్రమాణాలు, మౌలిక వసతులు, హరిత నిర్మాణాలు, ఉపాధి అవకాశాలు ఉండేలా

- మిగతా 2 లో

పోలీసులను బెదిరిస్తే కేసులు

ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్: విధి నిర్వహణలో ఉన్న పోలీసు అధికారులను బెదిరిస్తే కూటమి ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని, అధికారులకు ఇంకోసారి హెచ్చరికలు చేస్తే సుమోటోగా చర్యలు తీసుకుంటామని, కేసులు పెడతా మని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ హెచ్చరించారు. గుంటూరు అరణ్య భవన్‌లో ఆదివారం జరిగిన రాష్ట్ర అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. స్మారక స్థూపం వద్ద అమరవీరులకు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం అమరవీరుల కుటుంబాలను సన్మానించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ అధికారులపై ఈగ వాలినా, చిన్న గీతపడినా బెదిరింపులకు దిగినవారే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం

- మిగతా 2 లో

శవాల దిబ్బగా 'జబాలియా'

హెచ్చరిక లేకుండానే ఇజ్రాయిల్ దాడి - 33 మంది మృతి

జెరూసలేం: గాజాలో ఇజ్రాయిల్ కిరాతకంగా వ్యవహరిస్తోంది. రక్షిత ప్రాంతాలు, నివాస స్థలాలపైనా బాంబుల వర్షం కురిపిస్తోంది. నిరాయుధ, అమాయక ప్రజల ప్రాణాలు హరిస్తోంది. పిల్లలనూ చంపేస్తోంది. ఎలాంటి హెచ్చరిక లేకుండా శరణార్థి శిబిరమైన జబాలియాపై ఇజ్రాయిల్ దళాలు విరుచుకుపడటంతో అక్కడున్న వారిలో ఏ ఒక్కరూ ప్రాణాలతో మిగలలేదు. ఆదివారం ఉదయం 6 గంటలకు జబాలియాలోని ఇంటిపై ఇజ్రాయిల్ దాడి చేసింది. ఇంట్లోని 33 మంది చనిపోయారు. ఆ ప్రాంతం ప్రమాదకరంగా మారడంతో సహాయక చర్యలు సైతం నిలిచిపోయాయి. శిథిలా కింద చిక్కుకున్న వారెవరూ ప్రాణాలతో లేరని తేలింది. సహాయక చర్యల్లో పాల్గొనేందుకు స్థానికులు, వలంటీర్లు భయపడుతున్నారు. నిరంతర నిఘా డ్రోన్ల పర్యవేక్షణతో చుట్టుపక్కల వారు, బంధుమిత్రులకు ఆదుకునేందుకు బెంబేలెత్తిపోతున్నారు. ఇజ్రాయిల్ దాడుల్లో ఇప్పటివరకు 43,604 మంది పలస్తీనియన్లు చనిపోగా, మరో 1,02,929 మందికి గాయాలయ్యాయని గాజా ఆరోగ్యశాఖ తెలిపింది.

బీరుట్‌లోనూ భీకర దాడులు: లెబనాన్ రాజధాని బీరుట్‌లోనూ ఇజ్రాయిల్ దళాలు రెచ్చిపోయాయి. ఉత్తర గ్రామమైన అల్మాత్‌లో జరిపిన దాడుల్లో ముగ్గురు పిల్లలతో సహా 12 మంది చనిపోయారు. జెబైల్ జిల్లాలోని అల్మత్‌పై ఇజ్రాయిల్ దాడుల్లో ముగ్గురు పిల్లలు సహా 12 మంది చనిపోయారని లెబనాన్ ఆరోగ్యశాఖ ప్రకటన తెలిపింది. గత 24 గంటల్లో ఇజ్రాయిల్ వైమానిక దాడుల్లో 40 మంది చనిపోగా, ఇందులో పిల్లలు ఎక్కువగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. శనివారం అర్ధరాత్రి నుంచి దక్షిణ బీరుట్ శివార్లలో ఇజ్రాయిల్ బాంబుల వర్షం కురిపించింది. ఈ దాడుల్లో చుట్టుపక్కల పట్టణాల్లో 13 మంది చనిపోగా, వారిలో ఏడుగురు వైద్య సిబ్బంది ఉన్నారు.

తూర్పులోని బాల్‌బేక్ చారిత్రక నగరంలో జరిపిన దాడుల్లో మరో 20 మంది మృతి చెందారు. టైర్, బాల్‌బేక్ ప్రాంతాల్లోని హెజ్బుల్లా కేంద్రాలపై దాడి చేసినట్లు ఇజ్రాయిల్ సైన్యం ప్రకటించింది. హెజ్బుల్లా సాయుధులను మట్టుపెట్టడమే కాకుండా దాని అపార్ట్‌మెంట్లు, ఆయుధాగారాలను ధ్వంసం చేసినట్లు వెల్లడించింది.

లెబనాన్‌లో పరిమిత కాల్పుల విరమణకు ఇజ్రాయిల్ సానుకూలం

జెరూసలేం: భీకర వైమానిక, భూతల దాడులతో లెబనాన్‌పై విరుచుకుపడుతున్న ఇజ్రాయిల్ కాస్త నెమ్మదించింది. పరిమిత కాల్పుల విమరణకు సానుకూలత వ్యక్తం చేసింది. దీనికి సంబంధించి లెబనాన్‌తో ఇజ్రాయిల్ ఒప్పందం వివరాలు తెలియలేదు. గాజాపై దాడులను ఇజ్రాయిల్ ఆపని పక్షంలో యూద దేశంపై ఆంక్షలు విధించే యోచనలో ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు లెబనాన్‌లో 3,136 మంది మృతి చెందగా, 13,978 మంది గాయపడ్డారు.

కాల్పుల విరమణ చర్చలకు ఖతార్ బ్రేక్

గాజాలో పోరు క్రమంలో ఇజ్రాయిల్, హమాస్ మధ్య రాజీకి జరుగుతున్న ప్రయత్నాల్లో భాగంగా కాల్పుల విరమణ కోసం చేపట్టిన చర్చలను తాత్కాలికంగా ఆపేస్తూ ఖాతార్ ఒక ప్రకటన చేసింది. ఈ మేరకు ఆ దేశ విదేశీ వ్యవహారాల శాఖ ఖండించింది. ఖతార్‌లోని హమాస్ రాజకీయ కార్యాలయాన్ని మూసివేస్తున్నట్లు వచ్చిన వార్తలను తోసిపుచ్చింది. మారణహోమాన్ని ఆపడం కోసం సిద్ధమయ్యేంత వరకు తమ మధ్యవర్తిత్వాన్ని ఆపేస్తున్నట్లు ఖతార్ వెల్లడించింది. రాజీ చేసుకోవాలని పది రోజుల ముందే రెండు వర్గాలకు ఖతార్ సూచించినట్లు అధికార ప్రతినిధి మహమ్మద్ అల్ అన్సారీ తెలిపారు. లేని పక్షంలో తమ కసరత్తును ఆపేస్తామని హెచ్చరించినట్లు చెప్పారు. ఇదే క్రమంలో కిరాతక యుద్ధాన్ని ఆపే అంశాన్ని తీవ్రంగా పరిగణనలోకి తీసుకోవడం, అందుకోసం సిద్ధమయ్యేంత వరకు ఇజ్రాయిల్, హమాస్ మధ్య మధ్యవర్తిత్వ కసరత్తును ఖతార్ నిలిపివేస్తోందని అన్సారీ వెల్లడించారు.

స్వింగ్ రాష్ట్రాల్లో ట్రంప్ స్వీప్

312 ఎలక్టోరల్ ఓట్లతో ఘన విజయం

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడిగా డొనాల్ట్ ట్రంప్ చారిత్రక విజయాన్ని అందుకున్నారు. అరిజోనా ఫలితాలు కూడా రావడంతో ఏడు స్వింగ్ రాష్ట్రాలను ఆయన స్వీప్ చేశారు. మొత్తం 312 ఎలక్టోరల్ ఓట్లతో గెలిచారు. డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్ 226 ఓట్లు సాధించారు.

ట్రంప్ యంత్రాంగంలో నిక్కీహేలే, మైక్ పాంపియోకు దక్కని స్థానం

కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే క్రమంలో ఐరాస మాజీ రాయబారి నిక్కీ హేలేని, తన మాజీ కార్యదర్శి మైక్ పాంపియోను ఆహ్వానించనని డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. గతంలో వాళ్లతో కలిసి పనిచేయడం మంచి అనుభవాన్ని ఇచ్చింది, దేశానికి వారు చేసిన సేవలకు కృతజ్ఞతలు చెబుతున్నానని నిక్కీ, మైక్‌నుద్దేశించి ట్రంప్ అన్నారు. 'ట్రూత్' మాధ్యమంగా అమెరికాను మరోమారు గొప్పదేశంగా నిలుపుదామని పిలుపునిచ్చారు.

13న బైడెన్, ట్రంప్ భేటీ

అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టబోయే డొనాల్డ్ ట్రంప్‌తో ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ బుధవారం శ్వేతసౌధంలో భేటీ కానున్నారు. పదవి నుంచి తప్పుకోబోయే... బాధ్యతల్లోకి వచ్చే వారు మర్యాదపూర్వకంగా భేటీ కావడం ఆనవాయితీ. అధికార బాధ్యతల అప్పగింత ప్రశాంతంగా జరిగేందుకు ఈ సమావేశం నాంది పలుకుతుంది. ఈనెల 13వ తేదీ ఉదయం 11 గంటలకు ఓవల్ కార్యాలయంలో బైడెన్, ట్రంప్ సమావేశమవుతారని శ్వేతసౌధం వెల్లడించింది. ట్రంప్‌కు బైడెన్ ఆతిథ్యమిస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. కాగా 2020 ఎన్నికల్లో బైడెన్ గెలిచినప్పుడు ఆయనకు ట్రంప్ ఆతిథ్యమివ్వలేదు.

మతోన్మాదశక్తులతో రాజ్యాంగానికి ముప్ప

(మొదటిపేజీ తరువాయి)

అతీతంగా ప్రజలందరికీ సమాన హక్కులు ఉండే విధంగా అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారని చెప్పారు. ప్రాచీన మనువాద సంస్కృతి సైద్ధాంతిక భావన కలిగి ఉన్న ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లోని బీజేపీ... ఆ రాజ్యాంగాన్ని రద్దు చేయడానికి అంబేద్కర్ ఆలోచనలను తుద ముట్టించటానికి కుట్రలు, కుతంత్రాలు చేస్తుందని ఆరోపించారు. సామాజిక శక్తులు దీనిని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కే యేసురత్నం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, రాష్ట్ర సహాయ కార్యదర్శి జే కుమార్, రాష్ట్ర కోశాధికారి ఏ రాజ్ కుమార్, రాష్ట్ర సమితి సభ్యుడు సీహెచ్ శ్రీనివాస్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఉమామహేష్, వెంకస్వామి పాల్గొన్నారు.

సీజేఐగా జస్టిస్ ఖన్నా ప్రమాణం నేడు

(మొదటిపేజీ తరువాయి)

అలవాట్లను మార్చుకోనున్నారు. తనకెంతో ఇష్టమైన మార్నింగ్ వాక్‌కు విరామం ఇవ్వనున్నారు. ఇప్పటి వరకు ఆయన ప్రతి రోజూ లోధి గార్డెన్ వద్ద ఒంటరిగా మార్నింగ్ వాక్ చేసేవారు. ఇప్పుడు తనను అందరూ గుర్తుపట్టే అవకాశం ఉండడం, భద్రత కారణాలతో ఉదయపు నడకకు విరామం ప్రకటించినట్లు తెలుస్తోంది. జస్టిస్ సంజీవ్ ఖన్నా న్యాయమూర్తుల కుటుంబం నుంచి వచ్చారు. ఆయన తండ్రి జస్టిస్ దేవరాజ్ ఖన్నా ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేశారు. చిన్నాన్న జస్టిస్ హన్సరాజ్ ఖన్నా సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా వ్యవహరించారు. ఢిల్లీలోని బరాఖంబా రోడ్‌లోని మోడరన్ స్కూల్‌లో పాఠశాల విద్య పూర్తిచేసిన జస్టిస్ సంజీవ్ ఖన్నా... 1980లో ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి గ్రాడ్యుయేషన్ పట్టా తీసుకున్నారు. అదే యూనివర్సిటీలో న్యాయవిద్య అభ్యసించారు. 1983లో ఢిల్లీ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకున్నారు. తీస్ హజారీ కాంప్లెక్స్‌లోని జిల్లా న్యాయస్థానంలో తొలుత ప్రాక్టీస్ చేశారు. 2004లో ఢిల్లీ ప్రభుత్వం తరపున నేషనల్ క్యాపిటల్ టెరిటరీకి స్టాండింగ్ కౌన్సెల్‌గా నియమితులయ్యారు. 2005లో ఢిల్లీ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా, 2006లో శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2019 జనవరి 18న సుప్రీంకోర్టు జడ్జిగా పదోన్నతి పొందారు. సుప్రీంకోర్టులో న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత... తన చిన్నాన్న జస్టిస్ హెచ్‌ఆర్ ఖన్నా కూర్చొన్న కోర్టు గది నుంచి తన మొదటి రోజు ప్రారంభించారు. ప్రస్తుతం నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా సేవలు అందిస్తున్నారు.

అమరావతి అభివృద్ధికి ముందడుగు

(మొదటిపేజీ తరువాయి)

కార్యాచరణ చేపట్టాలని ప్రభుత్వం స్పష్టంచేసింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమరావతి, పోలవరం ప్రాజెక్టులపై ప్రధానంగా దృష్టి పెట్టారు. సీఎం చంద్రబాబు, రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు దఫాలుగా ఢిల్లీకి వెళ్లి... ప్రధాని మోదీతోను, హోంమంత్రి అమిత్‌షాతో చర్చలు జరిపారు. మిగిలిన కేంద్ర కేబినెట్ మంత్రులను రాష్ట్రానికి నిధులు ఇవ్వాలని కోరారు. ప్రధానంగా రాజధానికి నిధులు కేటాయించాలని కోరగా... గత కేంద్ర బడ్జెట్‌లో రూ.15 వేల కోట్ల రుణ సహాయాన్ని ప్రకటించింది. ఈ మొత్తాన్ని ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు ద్వారా ఇవ్వాలని నిర్ణయించింది. రాజధాని నిర్మాణ ప్రణాళిక కోసం బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపులతోపాటు ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఏపీ సీఆర్డీఏ కమిషనర్ ఆధీనంలోనే ఈ అభివృద్ధి, నిర్మాణ ప్రణాళికలు అమలు చేయనున్నట్లు ఉత్తర్వుల్లో వెల్లడించింది. ప్రధాన రహ దారులు, డ్రెయిన్లు, వరద నీటి ప్రవాహానికి అనుగుణంగా కాలువలు, నీటి రిజర్వాయర్లు, సురక్షిత నీరు వంటి సదుపాయాలకు సంబంధిత ప్రాజెక్టులు చేపట్టాలని ఆదేశించారు. అభివృద్ధి, నిర్మాణ ప్రణాళికల ఆధారంగా దశల వారీగా బ్యాంకుల నుంచి నిధులు పొందేందుకు ప్రత్యేక ఖాతా ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 11, 12 తేదీల్లో ఢిల్లీలో జరగనున్న ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకుల నుంచి రుణంపై సీఆర్డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్ ఒప్పందం కుదుర్చుకోనున్నారు. అమరావతి రాజధాని సుస్థిరాభివృద్ధికి సీఆర్డీఏ ప్రతిపాదనలు సమర్పించగా... కేంద్ర ఆర్థిక వ్యవహారాలశాఖ ఆమోదించిందని ఆ ఉత్తర్వుల్లో వెల్లడించారు. ఈ ప్రతిపాదనలకు ఆయా బ్యాంకులు ఆమోదం తెలిపి...అమరావతి నిర్మాణం, అభివృద్ధికి చెరో 800 మిలియన్ డాలర్ల ఆర్థిక సాయం అందించేందుకు ముందుకు వచ్చినట్లు వివరించింది. మిగతా నిధులను కేంద్రం సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చుకుంటుందని స్పష్టంచేసింది. ఈ మేరకు బ్యాంకుల నుంచి ఆర్థిక సాయం పొందేందుకు సీఆర్డీఏ కమిషనర్‌కు అధికారం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటికే రాజధాని ప్రాంతంలో అభివృద్ధి పనులకు అనువుగా ఏర్పాట్లు చేపడుతున్నారు. సీఎం చంద్ర బాబు ఆదేశాలతో మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ అభివృద్ధి పనులకు కార్యాచరణ రూపొందించారు. డిసెంబరు, జనవరి నుంచి విడతల వారీగా పనులు చేపడతా మని ప్రకటించారు. రుణం అందిన వెంటనే పనులు వేగవంతం అవుతాయి.

బడ్జెట్‌పై గంపెడాశలు

- సూపర్-6కు కేటాయింపులుండేనా?
- అమరావతి, పోలవరానికి ప్రాధాన్యం?
- నేటి నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తన తొలి బడ్జెట్‌ను ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టబోతుంది. ఈ బడ్జెట్‌లో రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ఎంత?...మేనిఫెస్టోలో ఇచ్చిన సంక్షేమ పథకాలకు కేటాయింపులు ఎంత అనేది స్పష్టంకానుంది. ప్రధానంగా సూపర్-6లోని పథకాలకు కేటాయింపులు ఎంతెంత చేస్తారని ప్రజలు ఎదురుచూస్తున్నారు. అసెంబ్లీ సమావేశాలు ఈనెల 11వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయి. ఈ నెలాఖరుతో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ గడువు ముగియనున్న నేపథ్యంలో సమావేశాలకు అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. నాలుగు నెలలకే ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. సమావేశాల మొదటి రోజు ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్... 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడతారు. బడ్జెట్‌లో ప్రధానంగా అమరావతి రాజధాని అభివృద్ధికి, పోలవరం పనులకు పెద్దపీట వేసే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. అమరావతి రాజధానికి రూ.15 వేల కోట్లను ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు రుణం తీసుకోవడానికి చర్యలు ప్రారంభమయ్యాయి. చంద్రబాబు ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టినప్పటి నుంచి ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌తోనే కొనసాగుతోంది. దీంతో సూపర్-6తోపాటు సంక్షేమ పథకాలు పూర్తిగా అమలు కావడం లేదు. అసెంబ్లీ సమావేశాల ప్రారంభానికి ముందు సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరుగుతుంది. బడ్జెట్‌కు మంత్రివర్గం ఆమోదం తెలపనుంది. అనేక కీలక అంశాలపై మంత్రిమండలిలో చర్చిస్తారని తెలిసింది. సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించాలన్న అంశంపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన జరిగే సభా వ్యవహారాల సలహా మండలి(బీఏసీ)లో నిర్ణయం తీసుకుంటారు. పది రోజులకుపైగా సమావేశాలు జరిగే అవకాశముంటుందని సమాచారం. బీఏసీలో అసెంబ్లీ నిర్వహణ, మినిట్లపై నిర్ణయం తీసుకుంటారు.

వైసీపీ బహిష్కరణపై విమర్శలు

బడ్జెట్ సమావేశాలకు కూటమి పార్టీల్లోని టీడీపీ, జనసేన, బీజేపీ సభ్యులు హాజరుకానున్నారు. తమకు ప్రతిపక్ష హోదా ఇవ్వనందుకు నిరసనగా సమావేశాలకు వెళ్లడం లేదని మాజీ సీఎం జగన్ ఇప్పటికే ప్రకటించిన విషయం విదితమే. దీంతో వైసీపీకి చెందిన 11 మంది సభ్యులు సమావేశాలకు గైర్హాజరవుతున్నారు. జగన్ నిర్ణయాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తప్పుపట్టారు. ప్రజా సమస్యలను ప్రస్తావించే అవకాశం వచ్చినా... వైసీపీ వెళ్లకపోవడం తగదన్నారు. కూటమి పార్టీల నేతలు కూడా జగన్ సమావేశాలకు రావాలంటూ డిమాండ్ చేశారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ పరిసర ప్రాంతాల్లో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అసెంబ్లీకి ప్రజాప్రతినిధులు వచ్చే మార్గంలోను భద్రత పెంచారు. డీజీపీ ద్వారకా తిరుమలరావు పోలీసు ఉన్నతాధికారులతో సమీక్షలు నిర్వహించారు. ప్రత్యేక అసెంబ్లీ పాస్‌లు ఉన్న వారినే లోపలికి అనుమతిస్తారు. అసెంబ్లీ సమావేశాలను ప్రత్యక్షంగా ప్రసారం చేసేందుకుగాను సమాచార, పౌర సంబంధాల శాఖ ఏర్పాట్లు చేసింది. బడ్జెట్ సమావేశాల్లో అనేక కీలక బిల్లులను, శ్వేతపత్రాలను ప్రభుత్వం ప్రవేశపెట్టే అవకాశముంది. సూపర్ సిక్స్‌లోని పథకాల అమలు, నూతన మద్యం పాలసీ, ఉచిత ఇసుక విధానంపైనా సమావేశాల్లో చర్చించనున్నట్లు తెలుస్తోంది.

ఇళ్ల స్థలాల కోసం ముందుకు రండి

లబ్ధిదారులకు రామకృష్ణ పిలుపు

పేదలకు అండగా ఉండాలని సీపీఐ శ్రేణులకు సూచన

విశాలాంధ్ర-విజయవాడ: ఇళ్ల స్థలాల సాధన కోసం తమ పార్టీ చేపట్టిన కార్యక్రమానికి లబ్ధిదారులు కలిసి రావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపు ఇచ్చారు. సీపీఐ పట్టణ, నగర కార్యదర్శులతో రామకృష్ణ ఆదివారం వర్చువల్‌గా సమావేశమయ్యారు. సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షతన ఈ సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు నివేశన స్థలాలు కేటాయించాలని కోరారు. ఇళ్ల స్థలాల లబ్ధిదారుల్లో 90 శాతం దళితులు, గిరిజనులు, మైనార్టీలు, వెనుకబడిన తరగతుల వారే ఉన్నారని చెప్పారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి ఒక్క సెంటు స్థలం కేటాయించి, ఇంటి నిర్మాణానికి లక్షా ఎనభైవేల రూపాయలు మాత్రమే ఇచ్చిందని, చాలాచోట్ల ఇళ్ల స్థలాల లే అవుట్లు అసంపూర్తిగా ఉన్నాయని, కొన్ని ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం మధ్యలోనే ఆగిపోయిందన్నారు. ఇళ్లు లేక పేదలు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇసుక, ఇటుక, ఇనుము, కంకర ధరలు పెరిగిన కారణంగా ప్రతి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేదలకు ఇళ్ల స్థలాల సాధన కోసం సీపీఐ బృహత్తర కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ నెల 18న ఇళ్ల లబ్ధిదారులతో సచివాలయాల్లో అర్జీలు సమర్పించేలా సీపీఐ శ్రేణులు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఇంటింటి సర్వే నిర్వహించి అర్హులైన పేదల జాబితా రూపొందించాలని సూచించారు. లబ్ధిదారులను భారీగా సమీకరించి... సచివాలయాల్లో అర్జీలు సమర్పించేలా సీపీఐ నాయకత్వ బాధ్యత తీసుకోవాలన్నారు. అర్జీలు రాయటం, వాటిని సచివాలయాల్లో సమర్పించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించే బాధ్యత పార్టీ పట్టణ, నగర నాయకత్వాలు తీసుకోవాలన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లకు సంబంధించి వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లించని కారణంగా ఆ ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించలేదన్నారు. బ్యాంకు రుణాలు తీసుకున్న కారణంగా ఇంటిలోకి వెళ్లకుండానే బ్యాంకు యాజమాన్యం నుంచి రుణాలు చెల్లించాలంటూ లబ్ధిదారులకు డిమాండ్ నోటీసులు వస్తున్నాయని చెప్పారు. గ్రామాల్లో కంటే పట్టణాల్లో ఇళ్లు లేని పేదలు అధిక సంఖ్యలో ఉన్నారని చెప్పారు. లబ్ధిదారుల సమీకరణలో రాజకీయాల జోలికి వెళ్లవద్దని సూచించారు.

విద్యుత్ చార్జీల పెంపుపై నిరసనలు

ఎన్నికల హామీలు విస్మరించి కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు భారీగా పెంచిన నేపథ్యంలో అన్ని పట్టణాలు, నగరాల్లో నిరసనలు తెలియజేయాలని రామకృష్ణ పిలుపునిచ్చారు. ఈ నెల 19న విజయవాడలో వామపక్షాలు నిరసన కార్యక్రమం చేపట్టాయని,20 నుంచి 30వ తేదీ వరకు అన్ని పట్టణాల్లో, నగరాల్లో విద్యుత్ చార్జీలను వ్యతిరేకిస్తూ సభలు, సదస్సులు, రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ఆదేశాల మేరకు ఇప్పటికే ట్రూ అప్ చార్జీల పేరుతో రూ.6,072 కోట్లు భారం వేయగా... డిసెంబరు నుంచి మరో రూ.11,820 కోట్లు వసూలు చేసుకునేందుకు డిస్కమ్‌లు సిద్ధమవుతున్నాయని చెప్పారు.

పార్టీ సభ్యత్వంపై దృష్టి

వచ్చే నెల నుంచి పార్టీ సభ్యత్వ నమోదు పునరుద్ధరణ, కొత్త సభ్యత్వాల చేర్పింపుపై సీపీఐ నాయకత్వం దృష్టి సారించాలని రామకృష్ణ కోరారు. డిసెంబరులో కమ్యూనిస్టు పార్టీ శత వార్షికోత్సవాలు ప్రారంభం కానున్న సందర్భంగా పార్టీ నాయకత్వం దానికి అనుగుణంగా సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ పెంచిన విద్యుత్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విజయవాడలో వారం రోజులు నిరసన కార్యక్రమాలు చేసినట్లు చెప్పారు. చార్జీలు పెంచటంతో కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు. టిడ్కో ఇళ్లకు సంబంధించి నగరంలో 11 వేలమంది దరఖాస్తు చేసుకుంటే 6,556 మంది లబ్ధిదారులను ప్రభుత్వం గుర్తించిందన్నారు. అనంతరం 26 జిల్లాల్లోని పట్టణ, నగర కార్యదర్శులు తమ తమ అభిప్రాయాలు తెలియజేశారు.

ఏలూరు వైద్య కళాశాలకు డాక్టర్ ఎల్లాప్రగడ పేరు

(మొదటిపేజీ తరువాయి)

అభినందనీయమని పవన్ అన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఆ శాఖ ఉన్నతాధికారులు ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలకు శాస్త్రవేత్త ఎల్లాప్రగడ పేరు పెట్టడం హర్షణీయమని పవన్ అన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు, మంత్రి సత్యకుమార్, ఆ శాఖ ఉన్నతాధికారులకు పవన్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రపంచానికి ఎల్లాప్రగడ చేసిన సేవలు, మేలునీ కూటమి ప్రభుత్వం చిరస్మరణీయం చేసిందని ఉప ముఖ్యమంత్రి అన్నారు.

ఖాలిస్థానీ అర్షదుల్లా కెనడాలో అరెస్టు

(మొదటిపేజీ తరువాయి)

ఇద్దరిని పంజాబ్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. మొహాలీలో రాష్ట్ర ప్రత్యేక ఆపరేషన్ సెల్, యాంటీ గుండా టాస్క్‌ఫోర్స్, ఫరీద్‌కోట్ పోలీసుల సంయుక్త ఆపరేషన్ క్రమంలో వీరు పట్టుబడ్డారు. 2016లో జరిగిన హత్య కేసులో దోషి జస్వంత్ సింగ్ గిల్ హత్యలోనూ ఈ ఇద్దరికి పాత్ర ఉన్నట్లు విచారణలో తేలింది. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ జిల్లాలో ఈనెల 7న గిల్‌ను కాల్చి చంపారు. అర్షదుల్లా సూచనలతోనే ఈ హత్య జరిగింది. కాగా, నిజ్జర్‌కు మరొక సన్నిహితుడు బ్రాంప్టన్ వాసి ఇందర్‌జీత్ గోసల్ (35)ను కెనడా పోలీసులు ఈనెల 8న అదుపులోకి తీసుకున్నారు. నగరంలోని హిందూ ఆలయం వద్ద హింసాత్మక ప్రదర్శనలో మారణాయుధంతో దాడి చేసినట్లు అతనిపై ఆరోపణలు ఉన్నాయి.

అసెంబ్లీకి వెళ్లండి

వైసీపీకి రామకృష్ణ సూచన

విశాలాంధ్ర- విజయవాడ: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు ప్రతిపక్ష వైసీపీ శాసనసభ్యులు హాజరు కావాలని, అసెంబ్లీలో ప్రజా సమస్యలు లేవనెత్తాలని ఆ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఏపీలో నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటి బడ్జెట్ సమావేశాలు జరగబోతున్నాయన్నారు. శాసనసభలో కమ్యూనిస్టులకు, కాంగ్రెస్‌కు ప్రాతినిధ్యం లేకపోవడం దురదృష్టకరం. అసెంబ్లీలో ప్రాతినిధ్యం ఉన్న నాలుగు ప్రధాన పార్టీలలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడి అధికారపక్షంగా ఉన్నాయి. ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ ఎమ్మెల్యేలు, జగన్‌మోహన్ రెడ్డి అసెంబ్లీ సమావేశాలు బహిష్కరిస్తే ప్రజలకు నష్టం జరుగుతుంది. ప్రజల తరపున వివిధ సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తడానికి ప్రతిపక్షానికి అవకాశం ఉంది. అసెంబ్లీ సమావేశాలలో వైసీపీ పాల్గొనకుంటే ప్రశ్నించే వారే ఉండరు. ఇది అధికార పక్షానికి సంతోషం కలిగిస్తుంది. అధికార పక్షం నిర్ణయాలకు అడ్డు లేకుండా పోతుంది. ఏకపక్షంగా పరిపాలన సాగించే అవకాశం ఉంది. జగన్‌మోహన్ రెడ్డి తన నిర్ణయంపై పునరాలోచన చేయాలి. ప్రతిపక్షంగా అసెంబ్లీ సమావేశాలకు హాజరై ప్రజల పక్షాన పోరాటం చేయాలి. దురదృష్టవశాత్తు మన రాష్ట్ర రాజకీయాల్లో వ్యక్తిగత విమర్శలు, కుటుంబ విమర్శలు, ముఖ్యంగా స్త్రీల పట్ల దిగజారి వ్యవహరించటం ఆవేదన కలిగిస్తోంది. అటువంటి విమర్శలకు అందరూ స్వస్తి పలకాలని రామకృష్ణ హితవు పలికారు.

పోలీసులను బెదిరిస్తే కేసులు

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. సప్త సముద్రాలు దాటినా, రిటైర్ అయినా వదిలిపెట్టమని ఐపీఎస్ అధికారులు లక్ష్యంగా గత ముఖ్యమంత్రి చేస్తున్న వ్యాఖ్యలను సుమోటోగా స్వీకరిస్తామని తెలిపారు. తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడును సప్తసముద్రాల ఆవల ఉన్నా వదలమని, అలాగే డీజీపీ రిటైర్ అయినా వదలమని గత ముఖ్యమంత్రి అంటున్నారని అన్నారు. విధి నిర్వహణలో ఉన్న అధికారులను బెదిరిస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో పోలీసులతో ఘోర తప్పిదాలు చేయించారని, కూటమి ప్రభుత్వం అలాంటి ప్రభుత్వం కాదని తెలిపారు. ఆడబిడ్డలపై అఘాయిత్యాలు ఆగాలంటే మొదట మనందరికీ సామాజిక స్పృహ ఉండాలని, అన్యాయం జరిగితే ఆపాలన్న ఆలోచన సమాజానికి ఉండాలని ఉప ముఖ్యమంత్రి అన్నారు. పోలీసులు కూడా... ఫిర్యాదు చేసిన వారిని క్రిమినల్స్‌గా పరిగణించవద్దని, ఇటీవల కాకినాడ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదం కేసు పెట్టడానికి వెళితే అధికారులు సరిగా స్పందించలేదన్నారు. చట్టాల అమలుకు ప్రజల నుంచి కూడా సహకారం అవసరమన్నారు. సింగపూర్ తరహా శిక్షలు అమలు చేయాలన్నారు. ప్రాంతాల వారీగా యువత, పెద్దల కలయికతో రక్షణ కమిటీలు రావాలని చెప్పారు. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి పర్యటనల పేరిట ఇష్టానుసారం రోడ్ల పక్కన ఉన్న చెట్లు నరికేయడంతో పర్యావరణ సమతుల్యత దెబ్బతిన్నదన్నారు. దీనికి బాధ్యులపై వాల్టా చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. సరస్వతి పవర్ భూముల్లో 76 ఎకరాలు అసైన్డ్ భూములు, చుక్కల భూములు ఆక్రమించేశారని అన్నారు. ఉల్లంఘనలన్నింటినీ పరిశీలించి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. భవిష్యత్‌లో గంజాయి సాగు, డ్రగ్స్ నిర్మూలనకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తామని వెల్లడించారు. అటవీ సంపద దోచుకునే స్మగ్లర్లు, అరాచక మూకలకు ఎదురొడ్డి ప్రాణాలర్పించి వీర మరణం పొందిన అటవీ సిబ్బంది త్యాగాలను భవిష్యత్ తరాలు గుర్తించుకునేలా విగ్రహాల ఏర్పాటు, నగర వనాలు, అటవీ శాఖ భవనాలకు వారి పేర్లు పెడతామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. అమరవీరుల కుటుంబాలను ఆదుకోవడానికి తీసుకొచ్చిన సంజీవని పథకానికి రూ.5 కోట్ల నిధులు సమీకరిస్తామని, అమరవీరుల స్థూపాలను ఏర్పాటు చేస్తామన్నారు. స్మగ్లర్ల నుంచి స్వాధీనం చేసుకున్న ఎర్రచందనాన్ని త్వరలో అంతర్జాతీయ బిడ్డింగ్ ద్వారా వేలం వేయబోతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో శాసన సభ్యులు మహ్మద్ నసీర్, గల్లా మాధవి, బి.రామాంజనేయులు, గుంటూరు జెడ్పీ చైర్మన్ కత్తెర హెన్రీ క్రిస్టినా, గుంటూరు నగర డిప్యూటీ మేయర్ షేక్ సజిల, అటవీ శాఖ చీఫ్ కన్జర్వేటర్ చిరంజీవి చౌదరి, అటవీ శాఖ ఉన్నతాధికారులు కజూరియా, ఎస్.ఎస్.శ్రీధర్, రాహుల్ పాండే తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో ఐదుగురు ఐఏఎస్‌ల బదిలీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో ఐదుగురు ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న డి రోనాల్డ్ రోస్ ప్రభుత్వ కార్యదర్శిగా (ఆర్థిక శాఖ), సాంఘిక సంక్షేమ శాఖ ప్రభుత్వ కార్యదర్శి కె.కన్నబాబుకు జి.అనంత రాము స్థానంలో మున్సిపల్, పట్టణాభివృద్ధి ప్రభుత్వ కార్యదర్శిగా పూర్తి అదనపు బాధ్యతలు, వెయిటింగ్‌లో ఉన్న బి.అనిల్ కుమార్‌ను ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీగా, అక్కడ ఉన్న గంధం చంద్రుడుని లేబర్, ఫ్యాక్టరీస్, బాయిలర్స్, ఇన్సూరెన్స్ మెడికల్స్ సర్వీసెస్ అదనపు ప్రభుత్వ కార్యదర్శిగా, వెయిటింగ్‌లో ఉన్న డి.హరితను డిప్యూటీ సెక్రటరీ (వ్యవసాయ, సహకార శాఖ) గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రతి ఒక్కరి వివరాలు సమగ్ర సర్వేలో నమోదు చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : ఏ కుటుంబాన్ని కానీ లేదా వ్యక్తిని గాని మినహాయించకుండా ప్రతి ఒక్కరిని సమగ్ర సర్వేలో అన్ని వివరాలు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఎన్యూమరేటర్లను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్వే ప్రక్రియను ఆయన క్షేత్రస్థాయి కెళ్ళి పరిశీలించారు. ఆదివారం పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని బొల్లోరిగూడెం 11 వ వార్డులో పర్యటించి సర్వే ను పర్యవేక్షించారు. వివరాల సేకరణలో ఏమైనా ఇబ్బందులు కలుగుతున్నాయా అని ఎన్యూమరేటార్లను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సందేహాలు ఉంటే సూపర్వైజర్లు, ప్రత్యేక అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు ఇంటింటికి స్టిక్కరింగ్ వేయడం పూర్తి చేశామన్నారు. ఇపుడు ప్రభుత్వం నిర్దేశించిన ఫారం లో సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ, కుల వివరాలను ప్రతి కుటుంబం నుంచి సేకరించి నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఎన్యుమరేటర్లు ఎలాంటి పొరపాట్లు చేయకుండా జాగ్రత్తగా వివరాలను పొందుపరచాలన్నారు. ఈ సర్వేలో దాదాపు 57 కు పైగా అంశాలలో వివరాలను నమోదు చేయవలసి ఉన్నందున ఎన్యూమరెటర్లు ఒక సహాయకులను నియమించుకోవాలని కోరారు. ఎలాంటి అనుమానం లేకుండా ప్రజలు ఈ సర్వేకు సహకరించాలని కలెక్టర్ కోరారు.

మైనారిటీ దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర - కొత్తగూడెం : తెలంగాణ రాష్ట్రంలోని మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో సోమవారం మైనారిటీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు. భారత ప్రభుత్వ తొలి కేంద్ర విద్యా శాఖ మంత్రిగా స్ఫూర్తిదాయకమైన పరిపాలనా పాత్ర వహించిన స్వర్గీయ మౌలానా అబుల్ కలాం ఆజాద్ పుట్టినరోజు సందర్భంగా ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆ పాఠశాలల జిల్లా లెవెల్ కోఆర్డినేటర్ అరుణ ఆదివారం ఒక ప్రకటనలో వెల్లి నిచ్చారు. జిల్లాలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. భారత స్వాతంత్ర సంగ్రామంలో మౌలానా ఆజాద్ నిర్వహించిన పాత్రకు, ఆయన చేసిన త్యాగాలనుస్మరిస్తూ మైనార్టీ గురుకులాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సర్వేలో ప్రతి కుటుంబం వివరాలు నమోదు చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కొమరం భీం : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియలో జిల్లాలోని ప్రతి కుటుంబం వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. ఆదివారం జిల్లాలోని మండలం తుంపెల్లి గ్రామంలో కొనసాగుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను తహసిల్దార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సర్వే ప్రక్రియలో కుటుంబ సభ్యుల వివరాలు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా స్పష్టంగా నమోదు చేయాలని ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన బ్లాక్‌లలో పూర్తిస్థాయిలో కుటుంబ సభ్యుల వివరాలు నిర్ణీత నమూనాలు స్పష్టంగా నమోదు చేయాలని నిర్దేశించిన ఫారంలో ప్రతి అంశాన్ని ప్రజల వద్ద నుండి తప్పనిసరిగా సేకరించాలని, అందుబాటులో లేని వారి ఇంటికి మరొకసారి తప్పనిసరిగా వెళ్లాలని, ఒక్క కుటుంబం కూడా మినహాయింపు కాకూడదని తెలిపారు. సర్వే ముందు రోజు ఏ ప్రాంతంలో సర్వే నిర్వహిస్తున్నారో సంబంధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలని, సర్వే లక్ష్యాన్ని సాధించవలసిన బాధ్యత అన్ని ఓటర్లపై ఉందని తెలిపారు.

డోర్నకల్‌ను మేజర్ గ్రామపంచాయతీగా మార్చాలి

సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో- మహబూబాబాద్: జిల్లాలోని డోర్నకల్ పట్టణాన్ని మున్సిపాలిటీగా మార్చడం వల్ల ప్రజలకు సౌకర్యాలు లేక పలు ఇబ్బందులు గురవుతున్నారని, డోర్నకల్ మున్సిపాలిటీని మేజర్ గ్రామపంచాయతీగా మార్చాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం సిపిఐ డోర్నకల్ పట్టణ కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాట్లాడుతూ మున్సిపాలిటీగా మారడం వలన గ్రామీణ ఉపాధి హామీ చట్టం లేకపోగా, పేద మధ్య తరగతి ప్రజలు కూలి పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇంటి పన్నులు పెరిగిపోవడం, నిర్మాణానికి అనుమతులు సంక్లిష్టం కావడం, ఇండ్ల స్థలాల ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్యుడికి సొంతింటి కల కష్టతరం అయిపోయిందని ఆయన వాపోయారు, కుంటలు, చెరువులు, కబ్జాలు అయిపోయి, అభివృద్ధికి ఆమడ దూరంలో పట్టణం నిలిచిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా డోర్నకల్ పట్టణ అభివృద్ధి పై దృష్టి సారించాలని, కబ్జాలకు గురైన కుంటలు, చెరువులను స్వాధీనపరచుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి తుర్క రమేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు కే ప్రబెష్, జన్నే స్వామి, బంగారు మల్లికార్జున్, లావుడ్య రాంజీ, తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపుల ఐక్యత కొనసాగాలి : ఎమ్మెల్సీ

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : ఖానాపూర్ రాష్ట్రంలో మున్నూరు కాపుల ఐక్యత కొనసాగాలని ఎమ్మెల్సీ విఠల్ అన్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలో ఆదివారం జూనియర్ కాలేజీ రహదారిపై (తిమ్మాపూర్) మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు విగ్రహ ఆవిష్కరణకు ముఖ్య అతిథిగా మాజీ మంత్రి జోగు రామన్న, ఎమ్మెల్యే వెడమ బొజ్జు పటేల్ తో కలిసి రైతు విగ్రహాన్ని ఆవిష్కరించారు. ముందు, పట్టణంలోని విశ్రాంతి భవనం నుంచి పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో మున్నూరు కాపు యువత రాణించాలని, కాపు ఐక్యతను బలపర్చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు అధ్యక్షుడు కడుకుంట్ల రవి, సిరిపురం నాగరాజు, దోనికేని దయానంద్, నిర్మల్ మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, ఉమ్మడి జిల్లా మున్నూరు కాపు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలపై నిర్భందాలు, దౌర్జన్యాలకు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వస్తి పలకాలి

సీపీఐ నేతలు సారయ్య, నజీర్ డిమాండ్



విశాలాంధ్ర - ఇల్లందు : ఆధునిక జీవితాలకు, సమాజానికి దూరంగా అడవుల్లో కొండకోనల్లో నివసించే ఆదివాసీలపై దశాబ్దాలుగా కొనసాగుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్బంధాలు, దౌర్జన్యాలను ఇకనైనా ఆపాలని సిపిఐ పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు కె. సారయ్య, ఎఐటీయుసి బ్రాంచ్ కార్యదర్శి యండి. నజీర్ అహ్మద్ డిమాండ్ చేసారు. రాజ్యాంగం, చట్టాలు ప్రసాదించిన అభివృద్ధి ఫలాలు ఇప్పటికైనా ఆదివాసి తెగలకు సమగ్రంగా అందించెందుకు కేంద్ర, రాష్ట్ర పాలకులు దృష్టి సారించాలిని కోరారు. తెలంగాణ గిరిజన సమాఖ్య మహాసభల నేపథ్యంలో వారు ఆదివారం విశాలాంధ్రతో మాట్లాడారు. గిరిజనుల హక్కుల కోసం తెలంగాణ గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధమైనట్లు స్పష్టం చేశారు. ఆదివాసీలను కేవలం ఓటు బ్యాంకుగా చూడకుండా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైనే ఉందన్నారు. మల్టీ కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వాలు వత్తాసు పలుకుతూ అడవులనే నమ్ముకొని జీవిస్తున్న గిరిజనులను అభివృద్ధి పేరుతో కుట్రలు పన్నుతూ తరిమేస్తున్నారని అనేక ఉదంతాలను వారు వివరించారు. హరితహారం పేరుతో దాడులు, నిర్భందాలకు పాల్పడుతూ గిరిజనుల అస్తిత్వాన్ని దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లిస్తు గిరిజన గ్రామాల్లో కనీస మౌలిక వసతులకు నోచుకోకుండా చేస్తున్నారని తీవ్రంగా ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర స్థాయిలో గిరిజనుల సంక్షేమం కోసం రూపొందించిన చట్టాలు అమలుకు నోచుకోవడం లేదని ఆరోపించారు. పాలకుల నిర్లక్ష్యం, వివక్ష దశాబ్దాలుగా కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కొమరంభీం, బిర్సాముండ, సేవాలాల్, మల్లుదొర, సమ్మక్క సారక్క లాంటి ఎందరో మహనీయులు ఆదివాసీల హక్కుల కోసం ప్రాణ త్యాగాలు చేశారని గుర్తు చేశారు. రాజ్యాంగం, చట్టాలు కల్పించిన తమ హక్కుల కోసం ఆదివాసి, గిరిజన యువకులు నడుం బిగించి పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

విద్యారంగంపై సర్కార్ చిన్న చూపు...!

ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ

విశాలాంధ్ర - ఖమ్మం : ఖమ్మం పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్, ఫీజు రియంబర్స్మెంట్‌ను విడుదల చేయకుండా విద్యా రంగంపై రాష్ట్ర సర్కార్ చిన్న చూపు చూస్తుందని, కేంద్ర ప్రభుత్వం జాతీయ నూతన విద్యా విధానం రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక గిరి ప్రసాద్ భవన్‌లో జరిగిన ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు రూ. 7650 వేల కోట్ల రూపాయలు విడుదల చేయకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు అనేక ఆర్థికపరమైన అవస్థలు ఎదుర్కొంటూ తీవ్ర మానసిక ఆవేదన చెందుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఫీజు బకాయిల విడుదల చేయడంలో నిర్లక్ష్యం చేస్తుందని ఎన్నికల ముందు పదే పదే మాట్లాడి కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఫీజు బకాయిలు మొత్తం ఒకే సారి విడుదల చేసి ఉండాల్సిందని అన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి 11 నెలలు కావస్తున్నా ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్ షిప్స్ బకాయిల విడుదల చేయకపోవడం సరికాదన్నారు. అదేవిధంగా విద్యారంగంలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం పేద విద్యార్థుల పట్ల సవతి తల్లి ప్రేమను కనబరుస్తుందని, విద్యార్థుల పట్ల వివక్ష చూపిన ప్రభుత్వాలు మనుగడ సాధించలేవని అన్నారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం దేశంలో నూతన విద్యావిధానం పేరుతో యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తి దెబ్బ తీసే ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు. యూనివర్శిటీలను మూడు, నాలుగు. రకాలుగా విభజన చేసి విద్యను కార్పోరేటీకరణ, ప్రైవేటీకరణ, కమర్షలైజేషన్, కాషాయికరణ చేస్తుందని ఆయన ఆరోపించారు. కేంద్రీయ విశ్వవిద్యాలయాలలో ఆరెస్సెస్ ఎజెండా అమలుకు బిజెపి ప్రయత్నం చేస్తుందని, ఆరెస్సెస్ నేపథ్యం ఉన్నవారినే యూనివర్శిటీలలో నియమాకాలు చేస్తుందని అన్నారు. నూతన విద్యావిధానం, విశ్వవిద్యాలయాల ఫండ్ కట్స్, ఫెలోషిప్స్ ఇవ్వకపోవడం, ఖాళీలు భర్తీ చేయకుండా ఉండడం, యూనివర్శిటీలలో ప్రజాస్వామ్య వాతావరణం లేకుండా చేయడంపై ఉద్యమించాలని ఆయన కోరారు. నూతన జాతీయ విద్యా విధానంలో ఎక్కడ కూడా ఉచిత విద్య అనే పదాన్ని కూడా పొందుపరచకుండా నూతన జాతీయ విద్యా విధానంలో పేదవారికి ఉచిత విద్యా లేనట్టేనని అయన పేర్కొన్నారు. విభిన్న జాతులు కలిగిన వారు భారతదేశంలో ఉన్నారని, భిన్నత్వంలో ఏకత్వంగా ఉన్న దేశంలో ఒక కులాన్ని ఒక మతాన్ని ప్రోత్సహించే బిజెపి భారతదేశ చరిత్రను వక్రీకరిస్తున్నది అయన అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను మొత్తం విడుదల చేయడంతో పాటు విద్యారంగంలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలని, జాతీయ నూతన విద్యా విధానాన్ని ఉపసంహరించుకోవాలని లేనియెడల ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున దశల వారీగా ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శివ నాయక్ రాకేష్ జిల్లా నాయకులు ప్రతాప్ సునీల్ గణేష్ ఉమామహేష్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం ప్రకారం రోజువారీ బొగ్గు ఉత్పత్తి, రవాణా జరగాలి

విశాలాంధ్ర - ఇల్లందు : బొగ్గు అవసరాల నేపథ్యంలో సింగరేణి సంస్థ యాజమాన్యం నిర్ధారించిన రోజువారి బొగ్గు ఉత్పత్తి, రవాణా విషయంలో నిర్లక్ష్యం చేయ కుండా అధికారులు, కార్మికులు సమీష్టంగా కృషి చేయాలని డైరెక్టర్ పా (ప్రాజెక్టు అండ్ ప్లానింగ్) జి. వెంకటేశ్వర రెడ్డి ఆదేశించారు. నూతన జెకే ఉపరితల గని పనుల మంజూరి ప్రక్రియ వేగవంతంగా సాగుతుందని ఆయన చెప్పారు. ఆదివారం ఆయన ఇల్లందు ఏరియాలో పర్యటించారు. తొలుత కోయగూడెం ఉపరితల గని, జేకే-5 ఉపరితల గనులను పర్యటించి జరుగు తున్నపనుల వివరాలను ఏరియా జియం జాన్ ఆనంద్ ను అడిగి తెలుసుకున్నారు. రోజు వారి బొగ్గు ఉత్పత్తి తోపాటు రవాణా, ఓవర్ బర్డెన్, బ్లాస్టింగ్, లోడింగ్ పనులను దగ్గరుండి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తి రవాణా రోజు వారి లక్ష్యాలను రక్షణతో కూడిన జాగ్రత్తలు పాటించి అధిగమించాలన్నారు. సంస్థ నిర్దేశించిన వార్షిక లక్ష్యాలను అధిగమించాలని ఆదేశించారు. నూతన జేకే ఉపరితల గని ప్రారంభించబడే స్థలాన్ని పరిశీలించారు. మొదటి దశ అనుమతులు వచ్చాయని తదుపరి అనుమతుల కోసం చేయవలసిన పనుల వివరాలను అధికారులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో జియంలు ఎ.మనోహర్, కే.సాయిబాబు, ఇ.కృష్ణయ్య, బొల్లం వెంకటేశ్వర్లు, ఎజియం గిరిధర్ రావు, ఏరియా ఇంజనీర్ నరసింహ రాజు, ప్రాజెక్ట్ ఆఫీసర్స్ కృష్ణ మోహన్, రామస్వామి, డిజియంలు మధార్, మోహన్ రావు, బాలాజీ నాయుడు, రవికుమార్, మేనేజర్ లు సౌరబ్ సుమన్, పూర్ణ చందర్, ఇతర అధికారులు నాగరాజు నాయక్, దిలీప్ కుమార్, మహేష్, అంజి రెడ్డి, శివకుమార్, యాస శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేద ప్రజలకు అండగా సీపీఐ

విశాలాంధ్ర - హుజూర్ నగర్ : పేదప్రజల సమస్యల పరిష్కారానికై వారి వెంట నిలిచిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా హుజూర్నగర్ సిపిఐ 100 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా గాంధీపార్కు సెంటర్ నుండి సిపిఐ కార్యాలయం వరకు నిర్వహించిన భారీ ర్యాలీలో సిపిఐ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో చంద్రశేఖర్ మాట్లాడారు. పేద ప్రజలకు అండగా ఎర్రజెండా నిలిచిందని, అనేక పోరాటాల ద్వారా బడుగు, బలహీనవర్గాల హక్కుల సాధనకై, పేదప్రజల సమస్యల పరిష్కారానికై వారి వెంట నిలిచిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అన్నారు. సిపిఐ వంద సంవత్సరాల ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో సిపిఐ పార్టీ కనబరిచిన తీరు గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ పోరాటంలో అనేక మంది పార్టీ నాయకులు పాల్గొని అమరులైనారన్నారు. అమరవీరుల పోరాట స్ఫూర్తితో పార్టీ నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు..కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యూవుల రాములు, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, కంబాల శ్రీనివాస్, ఎం.వెంకటేశ్వర్లు, ఉత్తేల నారాయణరెడ్డి, దేవరం మల్లీశ్వరీ, ధూళిపాళ ధనుంజనాయుడు, గుండు వెంకటేశ్వర్లు, జడ శ్రీనివాస్, దొంతగాని సత్యనారాయణ, జడ వెంకన్న, సోమగాని కృష్ణ, ఇందిరాల వెంకటేశ్వర్లు, సుందరి పద్మ, జక్కుల రమేష్, ఎల్లావుల రమేష్, మామిడి వెంకయ్య, జక్కుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దోపిడి లేని సమాజం ఎర్రజెండాతోనే సాధ్యం

సీపీఐ(ఎం) రాష్ట్ర నేత సోమయ్య

విశాలాంధ్ర - కారేపల్లి : దోపిడిలేని సమాజం ఎర్రజెండాతోనే సాధ్యమని సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు పీ.సోమయ్య అన్నారు. సీపీఐ(ఎం) సింగరేణి మండల మహాసభ ఆదివారం దమ్మాలపాటి వెంకటేశ్వర్లు భూక్య జగ్యా, రేపాకుల లాలయ్య ప్రాంగణంలో ఉత్సాహభరిత వాతావరణం లో జరిగాయి. ఈ మహాసభకు తలారి దేవప్రకాశ్, దాసరి మల్లయ్య, సూరబాక ధనమ్మ అధ్యక్షత వహించిన ఈ సభలో పీ.సోమయ్య మాట్లాడుతూ పెట్టుబడిదారి, రాచరిక రాజ్యాంగాలు కల దేశాల ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలి పోతున్నాయని ప్రత్యామ్నాయంగా సోషలిజం, కమ్యూనిజం వ్యవస్థలు ఏర్పాడుతున్నాయన్నారు. శ్రీలంక, నేపాల్, లాటిన్ అమెరికా దేశాలలో సోషలిజం ప్రజా సమస్యలను పరిష్కరిస్తుందన్నారు. సోషలిస్టు చైనా ప్రపంచ ఆర్థిక వ్యవస్థను శాసించే స్థాయికి ఎదిగిందన్నారు. పెట్టుబడిదారి విధానంలో ప్రజా ప్రయోజనాలకన్న పెట్టుబడిదారుల ప్రయోజనాలకు పాలకులు పరితపిస్తారన్నారు. భారతదేశాన్ని ఆ దిశగా ప్రధాని మోడీ నడిపిస్తున్నారన్నారు. మోడీ విదేశీ పర్యటనలు కేవలం ఆదాని, అంబానీల ఆర్థిక ప్రయోజనాలను కాపాడటానికి చేసుకుంటు న్న ఒప్పందాలని విమర్శించారు. బూర్జువా పార్టీలు తమ అధికారం కోసం హామీలతో ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. కేంద్రంలోని బీజేపీ అవినీతి రూపుమాఫీ రూ.75 లక్షల కోట్లు నల్లడబ్బును తెచ్చి ప్రజలను పంచుతానని వంచిం చిందన్నారు. దానికోసం ప్రజలను జన్‌ధన్ ఖాతాల పేరుతో ఖాతాలు తెరిపించి ప్రజల చేత బ్యాంకుల కు రూ.లక్ష కోట్లు ఆదాయం వచ్చేలా చేసింద న్నారు. ప్రజల డబ్బును ఎస్‌బీఐ ద్వారా ఆదానికి రూ.12 లక్షల కోట్లు అప్పులిప్పించారన్నారు. రాష్ట్రంలో నీళ్లు, నిధులు, నియామకాలతో పేరుతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబపాలన, కాళేశ్వరం అవినీతి, బిడ్డ మద్యం కుంభకోణం, ప్రజలకు ఇచ్చిన హామీల నెరవేర్చక పోవటంతో ప్రజలలో పలు చన్కెనారన్నారు. దేశంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో బలమైన ఉద్యమాలు నిర్మించటానికి అవకాశాలు ఉన్నాయన్నారు. క్షేత్రస్థాయిలో బలమైన ఉద్యమాలను నిర్మించి ప్రజలను భాగస్వామ్యం చేయాలని పార్టీ సభ్యులను కోరారు. అనంతరం మండల కార్యదర్శి కే.నరేంద్ర కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, మూడ్ శోభన్, జిల్లా కమిటీ సభ్యులు మెరుగు సత్యనారాయణ, కొండబోయిన నాగేశ్వరరావు, దుగ్గి కృష్ణ, తాళ్లపల్లి కృష్ణ, రేపాల శ్రీనివాస్, మెరుగు రమణ, చింతల రమేష్, వజ్జా రామారావు, వడ్డె అజయ్‌బాబు, బానోత్ భారతి, అంబటి శ్రీనివాసరెడ్డి, బాదావత్ శ్రీను, ముక్కా సీతారాములు, సదానందం, లక్ష్మినర్సయ్య, బానోత్ బన్సీలాల్, మోత్కూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఊబకాయంతో అధికంగా మధుమేహం

హైదరాబాద్: భారతదేశంలో ఊబకాయం, మధుమేహం ఎక్కువగా జంట అంటువ్యాధులుగా సూచించబడుతున్నాయని ప్రముఖ వైద్యులు, ఎండో క్రినాలజిస్ట్ డాక్టర్ బీట్రైస్ అన్నే తెలిపారు. ఆదివారం జరిగిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ హైదరాబాద్ వంటి పట్టణ కేంద్రాలలో పెరుగుతున్న ఊబకాయం రేటుతో, టైప్ 2 డయాబెటిస్ కేసులలో సంబంధిత పెరుగుదల ఉందన్నారు. ఇది ఆరోగ్య సంరక్షణ ప్రదాతలకు ప్రత్యేకమైన సవాళ్లను సృష్టించిందన్నారు. "స్థూలకాయం మధుమేహం, ముఖ్యంగా టైప్ 2 మధుమేహం వచ్చే ప్రమాదాన్ని గణనీయంగా పెంచుతుంది" అని డాక్టర్ అన్నే వివరించారు. "అదనపు శరీర కొవ్వు, ముఖ్యంగా పొత్తికడుపు చుట్టూ, ఇన్సులిన్ నిరోధకతకు దారి తీస్తుందని, ఇది శరీర కణాలు ఇన్సులిన్‌కు తక్కువ ప్రతిస్పందనగా మారినప్పుడు. ఈ ప్రతిఘటన రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతుంది, మధుమేహానికి వేదికను ఏర్పరుస్తుందన్నారు." రివర్స్ కూడా నిజం అని, మధుమేహం అది కలిగించే జీవక్రియ మార్పుల కారణంగా బరువు నిర్వహణను క్లిష్టతరం చేస్తుంది, ఇది విచ్ఛిన్నం చేయడం ప్రత్యేకించి సవాలుగా మారుతుంది. ఊబకాయం, మధుమేహం మధ్య లింక్‌ను అర్థం చేసుకోవడం హైదరాబాద్‌లో, పట్టణీకరణ ఆధునిక ఆహార విధానాల వల్ల నడిచే జీవనశైలి మార్పులు ఈ సమస్యలను మరింత తీవ్రతరం చేస్తున్నాయి. "అధిక కేలరీల ఆహారాలు, ప్రాసెస్ చేయబడిన ఫాస్ట్ ఫుడ్స్ పెరుగుదల, చక్కెర పానీయాలు నిశ్చల జీవనశైలి ప్రధాన సహాయకులు" అని డాక్టర్ అన్ని వివరించారు.

కుటుంబ సర్వేకు ఎవరూ ఓటీపీలు చెప్పాల్సిన అవసరం లేదు : కలెక్టర్

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కు సంబంధించి ఎవరు ఓటీపీ లేదా లింకులు అడగరని,అలాగే ప్రజలు లింకులు, ఓటీపీలు చెప్పాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా ఆదివారం ఆమె నల్గొండ జిల్లా దామరచర్ల మండలం వాడపల్లి లోని లక్ష్మీపురం, గాంధీనగర్ వీధులలో సమగ్ర కుటుంబ సర్వేను తనిఖీ చేశారు. ఎన్యుమరేటర్లు సర్వే ఎలా చేస్తున్నారో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ఎన్యుమరేటర్లకు పలు అంశాలపై సూచనలు ఇచ్చారు. అనంతరం ప్రజలతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించి ఎవరు ఎలాంటి ఓటీపీలు గాని, లింకులు కానీ అడగరని, అందువల్ల ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, ఎవరికి ఓటిపి లేదా లింకులు చెప్పాల్సిన అవసరం లేదని అన్నారు. ప్రభుత్వము నియమించిన ఉపాధ్యాయులు మాత్రమే గుర్తింపు కార్డులు ధరించి సమాచారం కోసం ఇండ్లకు వస్తారని, సరైన సమాచారాన్ని ఇచ్చి సహకరించాలని ఆమె కోరారు. సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని, రోజుకు కొన్ని ఇళ్ల చొప్పున కేటాయించుకొని వాటిని పూర్తి చేసేందుకు ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు లక్ష్యం నిర్దేశించుకోవాలని, అలాగే సర్వే పని నాణ్యతగా ఉండాలని అన్నారు. ఎక్కడ పొరపాట్లు లేకుండా పూర్తి వివరాలతో సర్వే ఫారాలను నింపాలని చెప్పారు. ప్రజలు ఎన్యుమరేటర్లు ఇండ్లకు వచ్చే ముందు ప్రజలు ఆధార్, రేషన్ కార్డు, ధరణి వంటివి ముందే సిద్ధంగా ఉంచుకొని వివరాలు అందించాలని కోరారు.దామరచర్ల తహసిల్దార్ జవహర్ లాల్, ఎంపీడీవో మూర్తి, వాడపల్లి స్పెషల్ ఆఫీసర్ నాగరాజు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ దినేష్, ఆర్ ఐ సురేందర్, పంచాయతీ కార్యదర్శి శేఖర్ తదితరులు ఉన్నారు.

డబుల్ ఓట్లు ఉంటే తొలగించాలి

విశాలాంధ్ర - వనపర్తి : ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం-2025 లో భాగంగా ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో డబల్ ఓట్లు ఉంటే తనిఖీ చేసి తొలగించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలోని పోలింగ్ బూత్‌ను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ జాబితాలో డబల్ ఓట్లు ఉంటే వాటిని ఫారం - 7 ద్వారా తొలగించాలని, మార్పులు ఏమైనా ఉంటే ఫారం - 8 ద్వారా చేయాలని సూచించారు. అన్ని పోలింగ్ బూత్ లలో ఓటర్ జాబితాలను తప్పక ప్రదర్శించాలని బీఎల్ఓలను ఆదేశించారు. 1-1-2025 నాటికి 18 ఏళ్ళు నిండిన యువత ఎవరైనా కొత్తగా ఓటర్ గా నమోదు చేసుకోవలనుకుంటే ఫారం 6 ద్వారా దరఖాస్తు చేసుకోవచని, ఇందుకోసం బీఎల్ఓ లు ఇపుడు అందుబాటులో ఉంటారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎవరైనా ఓటర్లు మరణించిన పక్షంలో వారిని జాబితా నుంచి తొలగించాలని సూచించారు. సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా మున్సిపాలిటీ లోని బందారు నగర్ లో ఎన్యుమరేటర్లు సర్వే చేస్తున్న తీరును కలెక్టర్ పరిశీలించారు. సూపర్ వైజర్లు ఎన్యుమరేటర్లకు పర్యవేక్షణ చేయాలన్నారు. కుటుంబ వివరాల జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా ఎన్యూమరేటర్లు వివరాలు నమోదు చేయాలన్నారు. ప్రజలు కూడా సర్వే సిబ్బందికి కావాల్సిన సమాచారాన్ని అందించడంలో సహకరించాలన్నారు. ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ రమేష్ రెడ్డి, మునిసిపల్ కమిషనర్ పూర్ణ చందర్, బీఎల్ఓ లు, ఎన్యుమరేటర్లు ఉన్నారు.

ప్రభుత్వ సూచనల ప్రకారం సమాచారాన్ని సేకరించాలి

జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు

విశాలాంధ్ర - నేరేడు చర్ల : నేరేడు చర్ల పట్టణంలోని మున్సిపల్ పరిధిలో ప్రైమరీ స్కూల్ నందు జరుగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే స్పెషల్ సమ్మరీ రివిజన్ కార్యక్రమాన్ని సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు ఆదివారం క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ ఇంటిని సర్వేలో తమ వివరాలను నమోదు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. సర్వే చేసే ప్రభుత్వం సూచించిన నమూనా ప్రకారం బిఎల్ ఓలు ఖచ్చితమైన సమాచారం సేకరించాలని విధులలో ఎలాంటి అలసత్వం వహించకుండా సర్వే నిర్వహించాల న్నారు. ప్రభుత్వ సూచనల ప్రకారం ప్రత్యేక ప్రణాళికను రూపొందించి సర్వే నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రతిరోజు సర్వే పూర్తి చేసిన అనంతరం రికార్డులను అత్యంత జాగ్రత్తగా భద్రత భద్రపరచడం జరుగుతుందని తెలిపారు. అనంతరం పోలింగ్ కేంద్రాల వద్ద రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు జిల్లాలో స్పెషల్ సమ్మరీ రివిజన్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అశోక్ రెడ్డి, తహశీల్దార్ సైదులు, డిప్యూటీ తహసీల్దార్ మౌనిక, రెవిన్యూ ఇన్స్పెక్టర్ నరసయ్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

చీకటిశక్తులను ఓడించే మార్గాల అన్వేషణ దిశగా...

పెనుగొండ లక్ష్మీనారాయణ, 9440248778
అధ్యక్షులు, అరసం జాతీయసమితి.

మన అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం 18 వ జాతీయ మహాసభలు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని జబల్పూర్‌లో 2023 ఆగస్ట్ 20-23 తేదీలలో జరిగిన అనంతరం ఇప్పుడు మనం చండీఘడ్‌లో కలుసు కుంటున్నాం. ఈ సందర్భంలో మనం సమయానుకులమైన భారతీయ ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, సాహిత్యం అంశాలుగా ఒక సదస్సును, కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించుకుంటున్నాం.

కరోనా మహమ్మారి సమయంలో మనం అంతర్జాల సమావేశాల్లో కలుసుకున్నాం. ఆ పనిని కొనసాగించాం. మా ఆంధ్రప్రదేశ్‌లో కరోనా కాలం నుంచి సాహిత్యంలోని అన్ని ప్రక్రియల గురించీ ప్రముఖ సాహితీవేత్తల ప్రసంగాలను ఏర్పాటు చేసి కొనసాగిస్తూనే ఉన్నాం. ఇప్పటికే 175 అంతర్జాల ప్రసంగాలను నిర్వహించి అభ్యుదయ సాహిత్యాన్ని, అరసాన్ని సాహిత్యలోకంలోకి తీసుకెళ్లామని ఈ సందర్భంలో గుర్తు చేస్తున్నాను. ఇప్పుడు మనం భౌతికంగా, వ్యక్తిగతంగా కలుసుకుంటున్నాం. ఈ కలయిక నాకే కాదు మీకూ మనందరికీ ఎంతో సంతోషాన్ని కలిగిస్తుందనటంలో సందేహంలేదు. మనం ఒక సామూహిక ఆనందాన్ని ఈ సదస్సు, సమావేశం ద్వారా పొందుతున్నాం. అయితే మన దేశంలోనే కాక, ప్రపంచ వ్యాప్తంగా భావోద్వేగాలు ప్రమాదంలో ఉన్న ఒక ఆందోళనకర సందర్భంలో మనం నేడిక్కడ సమావేశమయ్యాం.

1936లో ఆవిర్భవించి నేటికీ యువ్వనోత్సాహంతో పని చేస్తున్న మన అరసం వందేళ్ల సంస్థగా ఉత్సవాలు జరుపుకోవటానికి మరో 12 సంవత్సరాలు మాత్రమే ఉంది. అప్పుడు మనమందరమూ మన తరువాతి తరంతో కలిసి శత జయంతి ఉత్సవాలను అన్ని రాష్ట్రాలు, ప్రాంతాలలో అన్ని భాషలలో నిర్వహించుకుందాం.

అయితే మనం ఈ సందర్భంలో అనేకానేక విషయాలను పరిశీలించాలి, గ్రహించాలి. ఎన్నో సవాళ్లు మన ముందున్నాయి. దేశంలో, వివిధ రాష్ట్రాల లోని పరిస్థితులు మనకుతెలుసు. జాతీయఆస్తులను పాలకపక్షాలు ఉదారంగా కార్పొరేట్లకు తక్కువధరలకే అమ్మేస్తున్నాయి. గిరిజనులను కొండల నుంచి, నదీతీరాలనుంచి, అడవులనుంచి ఖనిజాలను కొలగొట్టేందుకు తరిమేసే ప్రయత్నాలను తీవ్రం చేస్తున్నాయి. మైనారిటీలలో అభద్రతాభావం నెలకొంది. వారిలో ఒక భయానక మానసిక స్థితి ఏర్పడింది. మణిపూర్ గురించి మనందరికీ స్పష్టంగా తెలుసు. ప్రధానితో సహా అందరి మౌనాన్ని ఆ రాష్ట్రం భరించింది. స్త్రీల మాన ప్రాణాలకు, ప్రజల ఆస్తులకు కనీస రక్షణ సైతం కరువైంది. లడాఖ్ ప్రజల విషయంలో కూడా నేడు అదే జరుగుతోంది. శాంతి కోరుతున్న లడఖ్ ప్రజలను శాంతికి విఘాతం కలిగించేవారిగా పరిగణిస్తూ వారిని రాజ్య వ్యవస్థ జైళ్లలో కుక్కింది, జైళ్లలోకి నెడుతోంది. అన్ని రాష్ట్రాలలోనే ఏదో ఒకరకమైన అశాంతి, ఆందోళనలు కలిగి ఉండటాన్ని మనం నిత్యం చూస్తూనే ఉన్నాం.

కార్పొరేట్ సంస్థలకు లాభాలను చేకూర్చేందుకు లాభాల్ని చేకూర్చడం కోసం ప్రకృతి, పర్యావరణాలను విచక్షణారహితంగా నాశనం చేస్తున్నారు. నిరుద్యోగం, పేదరికం, ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం మనం వ్యవస్థ ఎదుర్కొంటున్న వాస్తవిక సమస్యలు. అయితే ఈ సమస్యలు ధనికులు, నయా సంపన్నులను ఇబ్బంది పెట్టేవి కావు.

దురదృష్టవశాత్తూ మన రచయితలలో ఎక్కువమంది ఈ తరగతికి చెందినవారే. ప్రభుత్వాలు అమలుపరిచే వేతన కమీషన్ల వలన వృద్ధి చెందే వేతనాలు రచయితలను మాత్రమేకాదు మధ్యతరగతి ప్రజలనూ సాంస్కృతికంగా, సామాజికంగా సామాన్య ప్రజలకు దూరం చేస్తున్నాయి. (అయితే అరసం వేతన కమీషన్లకు వ్యతిరేకం కాదు.) పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం కూడా ప్రజలను ఒకరి నుంచి ఒకరిని దూరంగా ఉంచుతోంది. ఈ ఆన్‌లైన్ వ్యాపారాల వలన మనం కిరాణాకొట్లకు, మార్కెట్లకు, పాలవాడికి, కూరగాయలవాడికి దూరమవుతున్నాం. అలా వీరందరినీ కలవలేకపోవటం వలన మనం సంతోషాలను, ఎవరితోనూ పంచుకోలేకపోతున్నాం. అలాగే సమస్యలనూ తెలుసుకోలేకపోతున్నాం. ఆన్‌లైన్ షాపింగ్ వలన మనలో ఉదాశీనత ఏర్పడిందనేది వాస్తవ విషయం. ముఖ్యంగా మనలాంటి తృతీయ ప్రపంచ దేశాలలో ప్రజలు తమ స్వంత సమస్యలలో కూరుకుపోయారు, కూరుకుపోతున్నారు. ఎవరికి వారు స్వీయ గృహ నిర్బంధాలకు గురి అవుతున్నారు. వీటి వలన మనకు 80 నుంచి 90 శాతం మన తోటి పౌరులు పడుతున్న బాధలను తెలుసుకోలేకపోతున్నాం. ఈ పరిస్థితులలో మన రచయితలు పీడిత ప్రజల కథలు ఎలా రాయగలుగుతారు? ఇందుకు మనవైపు కృషి నేడు మరింత అవసరం.

అందుకే ప్రజల కోసం పోరాడేవారు, భయం లేకుండా శక్తిమంతంగా రాజ్యాన్ని ప్రశ్నిస్తున్నవారూ రాజ్యవ్యవస్థకూ, కార్పొరేట్లకు, స్వార్థపర వర్గాలకూ శత్రువులవుతున్నారు. బలైపోతున్నారు. మనం డాక్టర్ నరేంద్ర దభోల్కర్, కామ్రేడ్ గోవింద్‌పాన్సారే, ప్రొఫెసర్ ఎం.ఎం.కల్బుర్గి, రోహిత్ వేముల, గౌరీలంకేశ్‌లను కోల్పోయాం. ఫాదర్ స్టాన్‌స్వామి మృతినీ చూశాం. కొద్దిరోజుల క్రితమే ప్రొఫెర్ జి.ఎస్.సాయిబాబాను సంస్థాగతంగా హత్య చేయడాన్నీ చూశాం. 'అసౌకర్యమైన' ప్రశ్నలను లేవనెత్తినందుకు లెక్కలేనంత మంది ఖైదు చేయబడ్డారు, చేయబడుతున్నారు. మెయిన్ స్ట్రీమ్ మీడియాగా మన కలాలు ఈ కథలను పూర్తి శక్తితో రాయాలి, ఆ అవసరమెంతో ఉంది. నిజానికి ప్రధాన స్రవంతి రచయితలు 'క్రమానికి' భంగం కలిగించని సాహిత్యాన్ని మాత్రమే రాస్తున్నారు. ఈ అవాంఛనీయ పరిస్థితిని మనం గమనించాలి, విమర్శించాలి.

ప్రపంచ వ్యాప్తంగా అణు యుద్ధ ముప్పు రోజురోజుకూ తీవ్రతరమౌతుంది. అమెరికా సామ్రాజ్యవాదం తన మిత్రదేశంలో కలిసి యుద్ధాలు చేసింది, చేస్తోంది. పలస్తీనాలో మారణహోమం జరుగుతోంది, దానిపట్ల ప్రపంచం ప్రేక్షక పాత్రను వహిస్తోంది. ఉక్రెయిన్ మరో ఉదాహరణ. భూమిపై నరకాన్ని అగ్రరాజ్యాలు, వాటి మిత్రులు సృష్టించటాన్ని చూస్తున్నాం. అమెరికా, బ్రిటన్ దేశంలోని ప్రజలు పలస్తీనాలో ప్రజలపై ఇజ్రాయిల్ అన్యాయ ఆక్రమణలకు వ్యతిరేకంగా మరికొన్ని దేశాలలోనూ వ్యతిరేకంగా గళం విప్పుతున్నారు. వీధుల్లోకి వస్తున్నారు. కానీ అది అంతర్జాతీయంగా పెద్ద ఎత్తున జరగటంలేదు. అంతర్జాతీయ శాంతి ఉద్యమం బలహీనపడింది. తన ప్రభావాన్ని కోల్పోయింది.

ఇలాంటి విపత్కర పరిస్థితులలో మనం కలుస్తున్నాం. మన సీనియర్ రచయితలు, అభ్యుదయ రచయితల సంఘాన్ని స్థాపించి సౌందర్యం యొక్క సౌందర్యాన్ని అంటే అసలు సిసలైన జీవన, సామాజిక, మానవాళి వాస్తవ సౌందర్యాన్ని సృష్టించాలని పిలుపిచ్చారు. మానవాళి అంతరించిపోయే అంచుకు తీసుకెళ్లటానికి ఫాసిస్టు శక్తులు ప్రయత్నిస్తున్నాయి. స్వాతంత్ర్యం కోసం పోరాటం జరిగింది. మన అరసం అందులో అంతర్భాగమైంది. 88 సంవత్సరాల నాటి దృశ్యం మనం ప్రస్తుత వాస్తవికతకు చాలావరకు పోలి ఉంది. సాంకేతిక పురోగతి ప్రమాదాలను పెంచుతోంది.

ఈ రాక్షస కాలం నుంచి మానవాళిని, యువత విలువలను, మనుషులను కాపాడాలని చరిత్ర మనకు బోధిస్తుంది. ఈ చీకటి కాలంలో మన సీనియర్ రచయితల, సాంస్కృతిక కార్యకర్తలు, సిద్ధాంతకర్తల బోధనలు ఒక వెలుగుదీపంలా పనిచేస్తాయని నేనే ఖచ్చితంగా అనుకుంటున్నాను. ఆ మహనీయులందరినీ గుర్తు చేసుకుంటూ శ్రద్ధాంజలి ఘటిస్తున్నాను. ఈనాటి మన కలయిక ఖచ్చితంగా కొత్త ఆలోచనలను మరియు చీకటి శక్తులను ఓడించే మార్గాలను అన్వేషిస్తుందనే ఆశ నాకుంది. ఈ మాటలతో మరోసారి మీ అందరికీ శుభాకాంక్షలు తెలుపుతున్నాను. ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్న అభ్యుదయ రచయితల సంఘం పంజాబ్ విభాగానికి కృతజ్ఞతలు.

(అరసం జాతీయ సదస్సుకు అధ్యక్షత వహిస్తూ పెనుగొండ లక్ష్మీనారాయణ చేసిన స్వాగతోపన్యాసం)

సాహితి

అభ్యుదయం!- ఆవంత్సపథం!!

ప్రపంచ సాహిత్యోపాసనుడు-
మార్క్సిజాన్ని సోషలిజం
పరిశుద్ధాంతరంగంతో
రంగరించుకున్న మేధోజ్ఞాని!
కవి- పవి- రవి-
అతడే సో॥సు॥ కావ్యనాముడు!!
అదే ఆవంత్సపథం- అభ్యుదయం చిరునామా
భావాభివ్యక్తిలో దేశభక్తిలో సంకల్పాల వీలునామా
కాలం వెంబడి పోరాటాలు- పోరు బావుటాలు/ ఎగరేసిన 'సైకత తీరంలో సాగర ఫేనం'
దేశ- ప్రాంత సాహిత్యాలకు విశ్వజీవన నిర్దేశనం
లోక సత్యావిష్కరణకు సామాజిక చేతనం
ఆలంబనవ్వాలన్న ధీమంతుడు- శ్రీమంతుడు
సారమతీంద్రుల వెన్నుదన్నుగా వెలార్చిన/ గ్రంథరాజాల- గంధమానదుడు
కవనం కదనం కల్లోలాల పద ఘట్టనల్లో /కావ్య కాహళూదిన వైజయంతుడు
స్వాప్నికత్వం పేరులోనే సోమసుందరుడు/జగత్‌క్రాంతి- జ్వలిస్తుందన్న భాస్వంతుడు
ప్రపంచ విప్లవకావ్యాలే కాదు- విప్లవాల్నించి / 'సీకింగ్ ఆఫ్ బ్రోకెన్ వింగ్స్' సృష్టికర్తయైనాడు
ఆధునికోత్తర సాహిత్యోపసనాఐంద్రజాలికుడు
విష్ణుధనువు శిష్టా పూర్వగాథా సమన్వయం- చలం 'పురూరవ'
గోపురదీపం- మెత్తని కత్తుల కొ॥కు॥ రచనలన్నారు
శ్రీకంఠ గరళాన్ని గళబద్ధం చేసిన శ్రీశ్రీ శతాబ్దికవనీ
వచనా అక్షరసత్యదీప్తి- కుందుర్తినీ, వైరాగ్యంలో
ఏక్‌తార మీటిన ఆలూరి బైరాగిని, శేషేంద్ర, సినారె
ఆరుద్ర, పురిపండా, రతనాల వీణను మీటించిన దాశరథిని, గురజాడల సందేశాల స్ఫూర్తి మీరు
దుస్సహ జీవితాలకైపడిన తపనలు మించిన
నిలువెత్తు జ్ఞానసిక్తాలు- మీ శాబ్దిక సింహపు గురుతులు
నిజాయితీ కావ్యకాహళులు- కాలయిత్రులు- భావయిత్రులు
కాలం వెంబడి- జయంతులు- వర్ధంతులు /నమోదు అవుతూనే ఉంటున్నాయి.

-వి.యస్.ఆర్.సోమయాజులు, 9441148158

అక్బర్, కృష్ణదేవరాయల యుగాన్ని నూతన చారిత్రకదృష్టితో ఆవిష్కరణ

డాక్టర్ కత్తి పద్మారావు భారతదేశచరిత్రను 5భాగాలుగా రాయాలని తలపెట్టిన కృషిలో భాగంగా మూడవభాగంగా ఈ గ్రంథం వెలువడింది. డాక్టర్ కత్తి పద్మారావు భారతదేశ చరిత్రను అంబేద్కర్ ఫూలే ఆలోచన విధానంలో రాయాలని తలపెట్టారు. అది సబాల్టన్ స్టడీస్‌లో నూతన దృక్పథంగా ముందుకువచ్చింది. మొదటి రెండుభాగాల్లో అనేకమైన నూతన విషయాలను చర్చించారు. ప్రసిద్ధ చరిత్రకారులైన డి.డి. కౌశాంబి, రొమిల్లా థాపర్, ఆర్.ఎస్. శర్మ, బిపిన్ చంద్ర, ఎ.ఎల్. ఛా, బి.ఎస్.ఎల్.హనుమంతరావు వంటి వారిచరిత్రలను అధ్యయనం చేసి ఫూలే, అంబేద్కర్ భావజాలంతో ఈ భాగాలన్నీ రాస్తున్నారు. ఈ గ్రంథంలో మొత్తం 25అధ్యాయాలుగా మనకు అందించడం జరిగింది. భారతదేశ చారిత్రక గమనం, భారతదేశ చారిత్రక మూలాలు, అనేక సంస్కృతుల్లో భారతం, అస్పృశ్యులను నిర్లక్ష్యం చేసిన చరిత్ర, రాజపుత్రుల హిందూ వాదం, అక్బర్‌కు ముందు వంశాలు, తుగ్లక్ రాజ్యాధికారం, హిందూముస్లిం మతో ద్యమాలు, విజయనగర సామ్రాజ్యం, విజయనగర సాంస్కృతిక వైభవం, విజయనగర స్వర్ణయుగం, మొఘల్ సామ్రాజ్య వైభవం, అక్బర్ పరిపాలన వైభవం, కబీర్ మానవతావాదం, మొఘల్ సామ్రాజ్య ప్రభావం, చరిత్రనిర్మాణంలో అణగారిన వారి గొంతు, భారతదేశ నిర్మాతలు మూలవాసులు, అక్బర్ నూతన స్ఫూర్తి, జహంగీర్ పాలన చిత్రం, షాజహాన్ కళావైభవం, బౌద్ధ ఉద్యమాన్ని దెబ్బ తీసిన ఇస్లాం రాజ్య వ్యవస్థ, భారతీయ తాత్విక ఉద్యమాలు, మొఘలుల భారతదేశ పునరుత్తేజం వంటి అనేక చారిత్రాత్మక విషయాలని కూలం కషంగా పరిశోధించి, చర్చించి మనకు అందించారు.

ఇందులో కత్తి పద్మారావు అనేక నూతన ప్రతిపాదనలు చేశారు. ఆయన అక్బర్ గురించి చెబుతూ...'అక్బర్ ఒక మహా చక్రవర్తి. ఆయన కాలంలో భారత దేశంలో అనేకమైన మార్పులు జరిగాయి. అక్బర్ సుదీర్ఘకాలం పాలించడం వల్ల ప్రతి పది సంవత్సరా లకు ఆయన మారుతూ వచ్చాడు. మొదట హిందూ రాజ్యాలపై కత్తి దూసిన అక్బర్ ఆ తర్వాత హిందూ రాజ్యాలతో సమన్వయానికి ఎక్కువ పనిచేశారు. అక్బరు అంతరంగం ఎవరికి తెలియనిచ్చేవాడు కాదు. అక్బర్ రాజకీయ చతురతను కృష్ణదేవరాయలు అనుకరించాడు అనవచ్చు. నిజానికి అక్బర్ ప్రపంచంలోనే ఒక గొప్ప చక్రవర్తిగా ప్రసిద్ధి చెందాడు. అయితే ముస్లింల పాలనలో ఇస్లాం వ్యాప్తియే కాదు కులవ్యవస్థయే కాదు, హిందూమత ప్రభావం కూడా ముస్లింలపై పడింది' అని నేను నా గ్రంథంలో నిరూపించాను. ఇకపోతే ఈ గ్రంథాన్ని ఆయన బౌద్ధ దృక్పథంలో నుంచి రాశారు. ముస్లిం రాజుల గురించి అత్యున్నతంగా విశ్లేషించిన ఆయన ముస్లింలు బౌద్ధాన్ని అవగాహన చేసుకోలేకపోవడాన్నీ గురించి కూడా ఇలా చెప్పారు. 'ముస్లింలు బౌద్ధమతాన్ని అర్థం చేసుకోలేక పోవడానికి కారణం పాళీ భాషలో బౌద్ధ తత్వశాస్త్రం రాయటమే. బౌద్ధ మహాయాణంలో వచ్చిన బుద్ధుని విగ్రహారాధన కూడా వీళ్ళకి అర్థం కాలేదు.

చరిత్రలో సత్యాలు ఎంత బలంగా రాస్తామో వక్రీకరణలు కూడా అంతే బలంగా ముందుకు తీసుకు వెళ్ళగలగాలి. నిజానికి బౌద్ధాన్ని నాశనం చేయటం వల్లే హిందూ రాజ్యాలు గానీ ముస్లిం రాజ్యాలు గాని బలహీనపడ్డాయి. అందుకే ఇతర దేశాలు మనపై దాడులు చేయగలిగారు. ఈ గ్రంథ రచనకు లుంబినీ వనంలోని అంబేద్కర్ రీసెర్చ్ సెంటర్లోని 55 వేల పుస్తకాల సారం దీనిలో తీసుకురావడానికి ప్రయత్నించారు. ఈ గ్రంథం లోని 22 అధ్యాయాలలోనూ భారతదేశ చారిత్రక సంపద, చరిత్ర లోతుల్లోకి, మార్గం సామాజిక శాస్త్రీయం, చరిత్ర-సత్యం, చరిత్ర ఉత్పత్తి శక్తి, పురావస్తు శాస్త్రం, మొదలుకొని హిందూ రాజులు, ముస్లిం రాజులు, బౌద్ధం మాటలు, అన్ని మతాల మీద బౌద్ధ ప్రభావం అలాగే గియాసుద్దీన్ సింహాసనం, విజయనగర సామ్రాజ్య స్థాపన, బహమనీ సామ్రాజ్యం తో వైరం భూమిశిస్తూ, ఆస్తి పన్ను... ఇలా అనేక ఉప శీర్షికలతో అటు కబీర్ సామ్రాజ్య పరిపాలనా స్థితిని, శ్రీకృష్ణదేవరాయల పరిపాలన స్థితిని సమగ్రంగా అందించగలిగారు.

చరిత్రను వక్రీకరించిన నిజాలను కూడా మనం ముందుకు తీసుకెళ్లాలి. నిజానికి బౌద్ధాన్ని నాశనం చేయటం వల్లే హిందూ రాజ్యాలు గాని ముస్లిం రాజ్యాలు గాని బలహీనపడ్డాయి.

భారతదేశం నుంచి బౌద్ధ తత్వాన్ని వెళ్లగొట్టిన వారిలో హిందూ ముస్లిం రాజులు బలంగా ఉన్నారు. భారతదేశంలో బౌద్ధం ఉంటే ఇంత రక్తపాతం జరిగి ఉండేది కాదని చరిత్రకారుడు కత్తి పద్మారావు ఈ 3వభాగంలో బలంగా చెప్పారు. ఇకపోతే ఆయన కృష్ణదేవరాయల గురించి చెబుతూ 'నేను సాహిత్యవేత్తగా శ్రీకృష్ణదేవరాయలను' ఇష్టపడతాను. ఆయన జీవితం నుంచి నేను సాహిత్యాన్ని, వీరత్వాన్ని సమఉజ్జీలుగా నడపడం నేర్చు కున్నాను. నేను అనేక యుద్ధాల్లో ఉన్నప్పుడు శ్రీకృష్ణదేవ రాయల్ని గుర్తు చేసుకుంటాను. అందుకే నేను విశాఖపట్నం జైల్లో 'జైలు గంటలు' రాయగలిగాను. శ్రీకృష్ణదేవరాయలు వీరుడు, మహాకవి, సాహితీవేత్త, పరిపాలనాదక్షుడు కూడా. ఆయన కాలంలో విజయనగర సామ్రాజ్యం అఖండంగా వెలిగిపోయింది.

కృష్ణదేవరాయలు యుద్ధ కాలంలో కావ్యాలు రాశాడు. కత్తి పద్మారావు కారంచేడు ఉద్యమంలో 'జైలుగంటలు' రాశారు. చుండూరు ఉద్యమంలో 'రక్తక్షేత్రం' రాశారు. యుద్ధ కాలంలో రాసిన రెండు కావ్యాలు చారిత్రక దళిత పోరాట దర్శనాలుగా నిలిచాయి. ముఖ్యంగా' జైలు గంటల్లో' ఆయన రాయడానికి



కాగితాలు దొరకకపోతే బొగ్గుతో గోడలమీద రాశారు. యుద్ధాల్లో రాసేవి నెత్తుటి గాథలు. వాటికి జవజీవాలుంటాయి. చాలా మంది దళిత కవులు యుద్ధాల్లో పాల్గొనకుండా సానుభూతి కవిత్వం రాశారు. దానిలో జీవం తక్కువ. డాక్టర్ కత్తి పద్మారావు చరిత్రను విస్మరిస్తున్న దశలో చాలా నూతనమైన అంశాలు తీసుకువచ్చారు. చరిత్రకు, మానవ పరిణామ శాస్త్రానికి, చరిత్రకు, పురావస్తు శాస్త్రానికి, చరిత్రకు, ఆర్థిక సిద్ధాంతాలకు, చరిత్రకు భౌగోళిక శాస్త్రానికి ఉన్న అంతః సంబంధాలతో రాశారు. అందుకే ఈ చరిత్రలో ఒక ప్రత్యేకత ఉంది. ఈ సందర్భంగా ఆయన చెబుతూ కొన్ని సూత్రాలను ముందుకు తెచ్చారు. చరిత్ర నిర్మాణంలో అనేక సామాజిక, సాంస్కృతి,విప్లవాలను పేర్కొనవలసి ఉంటుంది.

ప్రతి విప్లవంలో ఒక మార్పు కనిపిస్తుంది. ఆ మార్పు, మార్పును సాధించకపోతే చరిత్ర అసంపూర్ణం అవుతుంది. చరిత్ర అంటే సామాజిక, సాంస్కృతిక, జీవన విధానాల పరిణామం. ఏ మనిషి అయితే చరిత్రను అర్థం చేసుకోలేడో, ఆ మనిషి అంధుడుగానే జీవిస్తాడు అనే సూత్రీకరించారు. నిజానికి ఈ సూత్రాలు సబాల్టన్ స్టడీస్‌కి ఆయువు లాంటివి. ముస్లిం రాజుల కాలంలో వచ్చిన భక్తి ఉద్యమాన్ని, నగర నిర్మాణాన్ని పద్మారావు అద్భుతంగా వర్ణించారు. ఇందుకోసం ఎన్నో గ్రంథాలు పరిశీలించారు. నిజానికి చరిత్రకారుడు సాహితీవేత్త అయిన వాడే ఇటువంటి రచనలు చేయగలిగే సామర్థ్యం కలిగి ఉంటాడు. ఈ గ్రంథంలో చరిత్ర నిర్మాణానికి సంబంధించిన అనేక సూత్రాలను తీసుకువచ్చారు. ముఖ్యంగా అన్ని మతాల్లోనూ స్త్రీ అణచివేత ఎలా జరిగిందో సోదాహరణంగా నిరూపించారు. ఈ గ్రంథంలో అనేక కొత్త విషయాలు చెప్పే క్రమంలో ఈ కాలాల్లో ఉన్న కుల వ్యవస్థను గురించి ఆయన అనేక ఉదాహరణలు మన ముందుకు తీసుకు వచ్చారు. హిందూ, ముస్లిం సమాజం కుల వ్యవస్థ ఆధారంగా వ్యవస్థీకరించారు. హిందువుల విషయానికొస్తే మొగల్ కాలంలో కూడా కులవ్యవస్థ సమాజానికి ప్రాతిపదికగా ఉంది. దాని కఠినత గొప్పగా ఉన్నప్పటికీని గోవధ, బ్రదర్ హుడ్ సూత్రాలను విశ్వసించే ముస్లింలతో పరిచయం తగ్గింది. సుల్తానేట్ కాలంలో హిందువులలో వ్యాపించిన ప్రత్యేకతల వైఖరి వారికి మెరుగైన చికిత్స, మరింత ఆర్థిక సౌకర్యాలు అందించినందున గతించి పోయింది. మొఘల్ నియమాలు ఈ సమయానికి హిందువులు కూడా తాము మ్లేచ్ఛులుగా పేర్కొన్న ముస్లిముల నుంచి దూరంగా ఉండాలని తమ పూర్వవైఖరిని విడిచిపెట్టారు. మారిన పరిస్థితులకు అనుగుణంగా వారు ముస్లింలను ముస్లింల వారసులను భారతీయులుగా పరిగణించటం ప్రారంభించారు. ముస్లింలు కూడా కొత్తదేశం పట్ల గొప్ప అనుబంధాన్ని అనుభవించటం ప్రారంభించారు. బ్రాహ్మణులు ప్రభుత్వంలో ఉన్నత స్థానాలను పొందేందుకు పర్షియన్ భాష అధ్యయనాన్ని మాత్రమే కాకుండా వారి సాంప్రదాయ విధులు కాకుండా ఇతర వృత్తులను కూడా చేపట్టారు. హిందువుల కుల వ్యవస్థ కూడా మొఘలుల కాలంలో ముస్లింలపై తమ ప్రభావాన్ని చూపింది వారు నాలుగు తరగతులుగా విభజించారు. షేక్ మొగల్, పఠాన్ ప్రవక్త యొక్క ఫాతిమా కుమార్తె నుంచి వచ్చినట్లు పేర్కొన్నారు. షేక్‌లు స్వచ్ఛమైన అరబ్ సంతతికి చెందినవారు. మొఘలులు మంగోలియా జాతిని వచ్చిన వారిని పర్షియన్, ఛుగ్తాయిలుగా విభజించారు. ప్రాచీన హిందూ సమాజంలో స్త్రీలు గర్వించదగిన స్థానాన్ని ఆక్రమించినట్లుగా కాకుండా మొఘల్ కాలంలో స్త్రీల స్థానం చాలా దిగజారింది. నిజానికి భారతదేశంలోని ముస్లింల రాకతో స్త్రీల స్థితి క్షీణించడం ప్రారంభమైంది. ఇది మొఘల్ కాలంలో కొంత మెరుగుదల చూపించినప్పటికీ భారతదేశంలో ముస్లింల పాలన యొక్క తక్షణ ప్రభావంలో పర్దా వ్యవస్థను ప్రవేశపెట్టడం డాక్టర్ ఆర్ సి ముజుందార్ హిందువులు తమ మహిళా జానపదుల గౌరవాన్ని కాపాడటానికి, వారి సామాజిక క్రమంలో స్వచ్ఛతను కాపాడు కోవడానికి పర్దాను ఒక రక్షణ చర్యగా స్వీకరించారు. పాలక వర్గాన్ని అనుకరించడం కూడా హిందూ కుటుంబాలు పర్దాను స్వీకరించడానికి దోహదపడే అంశం. దిగువతరగతి కుటుంబాల్లో కంటే రెండువర్గాలలోని ఉన్నతతరగతి కుటుంబాల్లో పర్దావ్యవస్థ ఎక్కువగా ఉందని గమనించవచ్చు.

ఈ భారతదేశ చరిత్ర మూడవ భాగాన్ని రచించడానికి కత్తి పద్మారావు జోసెఫ్ జాగరెంట్ రాసిన Early Indians, Morgan రాసిన Ancient society , రొమిల్లా థాపర్ రాసిన భారతదేశ చరిత్ర, A.L. బాషమ్ రాసిన A cultural history of India సతీష్‌చంద్ర రాసిన "మధ్యయుగాల భారతదేశం", సురవరం ప్రతాపరెడ్డి రాసిన "ఆంధ్రుల సాంఘిక చరిత్ర", A.K. నీలకంఠ శాస్త్రి రాసిన A History of South India, S.C.రే చౌదరి రాసిన History of Mughal, ఎన్.జి సర్దేశాయి రాసిన "ప్రాచీన భారతదేశంలో ప్రగతి సాంప్రదాయవాదం", తారాచంద్ రాసిన "భారతదేశ స్వాతంత్రోద్యమ చరిత్ర" ప్రథమ భాగం, బిపిన్ చంద్ర రాసిన "ఆధునిక భారతదేశ చరిత్ర" వంటి 101 గ్రంథాలను సాకల్యంగా చదివి 470 పేజీల పుస్తకాన్ని మనకు అందించారు. ఇందులో ప్రసిద్ధమైన 50 చిత్రాలను సందర్భోచితంగా ఇన్‌క్లూడ్ చేశారు. ఈ గ్రంథం అన్ని భాషల్లోకి అనువాదం అవుతుంది. ఈ గ్రంథాన్ని ప్రతి ఒక్క భారతీయుడు చదవాల్సిన అవసరంగా లోకాయతా పబ్లికేషన్స్ 87వ గ్రంథంగా మీ ముందుకు వచ్చింది. భారతదేశచరిత్ర 4వభాగం ముద్రణలో ఉంది. నిరంతర అధ్యయనంతో చరిత్ర సంస్కృతి అర్థశాస్త్రం మానవ పరిణామ శాస్త్రంలను సమన్వయిస్తూ ఒక ఉద్యమకారునిగా జాతి వైతాళికునిగా మన ముందుకు తెస్తున్న ఈ చారిత్రక గ్రంధాన్ని కరదీపికగా చేసుకుని మనం మరింత చారిత్రక సంపదను కలిగి ముందుకెళ్లగలమని ఆశిస్తున్నాను.

- బండి రుక్మిణి ప్రసన్న, 8985358149

వృద్ధ ఆకాశం

భూమి రూమీ కవిత్వంలా
కొత్త వెలుగులోకి మేల్కొంటున్నది

మొగ్గ తొడుగు చెక్కిలిగింతల
ఒంటరి తుంటరి మనస్సు
ఒకానొక రంధి సంధి కాలం

తూర్పు గుట్టల మధ్య నుంచి
అంబాడుతూ వచ్చే
భానుని అరుణిమలో ప్రకృతి స్నానించి
గుండెల నిండా ఊపిరి నింపుకుంటోంది

విచ్చిన పువ్వు పుప్పొడి జీవవాక్యంలా
అపురూప సౌఖ్య అనుభవ మంటపంలోకి
స్వచ్ఛందంగా లొంగిపోతుంది

మధ్యాహ్నం భగభగ ఎండలకు
సముద్ర జల సంయోగ రసక్రియకు
నీళ్లు పోసుకున్న మేఘం

ఉరుములు మెరుపుల రాగం తీస్తూ
ఆకాశంలో ఈదులాడుతోంది
కురిసిన సుధా ధారల్ని వసుధ తాగి
మాయా మోహిని సేల్స్ వుమెనై
ఫలాల్ని మోసంతో మార్కెటింగ్ చేస్తోంది

కుంకుమ భరణి ఒలికినట్టు
ధరణి దరహాసం చిందిస్తోంది

యేరు ఒడ్డున సేద తీరుతున్న
పార గుణపాతాల ముచ్చట్ల సంచారం
తుమ్మ తుప్పల్లో చిక్కుకు
దేవులాడుతున్న మనస్సు

పడమర సూర్యున్ని
ప్రయాసతో మోస్తున్న
వృద్ధ ఆకాశానికి అడ్డంగా
పక్షుల గుంపు ఒకటి ఎగురుతూ
రుద్ధ గీతం ఆలపిస్తుంది

-జూకంటి జగన్నాథం, 9441078095

గ్రంథ సమీక్ష

ప్రజాపక్షం వహిస్తున్న 'ప్రశ్న'

కవిత్వానికి అర్హమైనది ఏది? అంటే 'కాదేదీ కవితకనర్హం' అనే జవాబు కవితాత్మకంగా ప్రతిధ్వనించింది, శ్రీశ్రీకి. ప్రశ్న కవితారూపు సంతరించుకుంటే ఏమవుతుంది? నిలదీతకు స్వరం అవుతుంది. ఆ స్వరం అస్తవ్యస్తవ్యవస్థపై సమర శంఖారావం అవుతుంది. నిజమా? కవితకు అంతశక్తి ఉందా!?ఉంది. అనే చెపుతోంది ఆధునిక కవితాచరిత. 'ఏ దేశ చరిత్ర చూచినా ఏమున్నది గర్వకారణం?' అంటూ సంధించిన ప్రశ్నకు 'నరజాతిచరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం' అనే మహత్తర జవాబు తారసపడింది నాడు మహాకవికి. ఆ పీడనపై తిరుగులేని పోరు సాగించమనేదే అభ్యుదయ కవిత్వం. సమస్త అవస్థల చీకట్లు కమ్ముకొన్న మానవసమాజంలో క్రాంతిదారులు పరిచేందుకు పరిప్లవిస్తున్న అభ్యుదయ సాహిత్య ఉద్యమంలో ఓ సనసన్నని కాంతికిరణం బంగారు వి.బి. ఆచార్యులు. వారు 'ప్రశ్న' నే పతాకశీర్షికగా చేసి తాజాగా మరో కవితాసంపుటి తీసుకొచ్చారు.'నేనో ప్రశ్నను సమాధానం సాధించేదాకా వదలను' అని తన కవితా లక్ష్యాన్ని తొలి కవితలోనే చాటారు. మొత్తం 84 కవితల్లోని అంతస్సూత్రం ప్రశ్నే. వ్యక్తులపైనా, వ్యవస్థలపైనా, వ్యవస్థల్ని మార్చగలిగిన శక్తులపైనా ప్రత్యక్షంగా పరోక్షంగా కవితారూపంగా ఎక్కుపెట్టిన ప్రశ్నలపరంపరే ఈ కవితలు.



'దేశం వెలిగిపోతుంది' అని ఊదరగొట్టేవాళ్ళను నిలదీస్తూ ఆ వెలుగు ఎలాంటిదో 'కాటిలో శవంలా/ కొడిగట్టిన కొవ్వొత్తిలా/ కొండెక్కే దీపంలా/ ఏదైతేనేం వెలుగేమరి' అంటారు ఆచార్యులు. మరి గోదారోరి యటకారమా మజాకానా! 'నీరు, గాలి, బట్టా, కొంప/ పుట్టినప్పటినుంచీ/ పిడకల్లో పెట్టేదాకా/ టాక్సులు కట్టడమే మన పని/ తెచ్చిన అప్పంతా / ఎటు పోతుందో మరి?"/ ..../ 'ప్రశ్నిస్తే/ జవాబొస్తుందా?/ పిడీయాక్టు రెడీ వుతుందా?' అని ప్రశ్నిస్తున్నారు కవి, 'ఏమౌతుందీదేశం?' కవితలో.

'ఇప్పుడుకూడా ప్రశ్నించకపోతే/ నీ దేశానికి, నీ జాతికి, నీ సమాజానికి/ నిక్కచ్చిగా ద్రోహంచేసినట్టే' ఈ స్పృహే ఆచార్యులు ప్రశ్ననే కవితా వస్తువుగా ఎంచుకొనేందుకు కారణమయింది. అదే అభ్యుదయ కవి లక్షణం.

కార్ల్ మార్క్సుకు 'లాల్ సలామ్' చెపుతూ... 'దోపిడీ సమాజంలో/ ఎవరు ఎవరిని ఎలా/ దోపిడీ చేస్తున్నారో/ మూలాలను తవ్వి/ బయటపెట్టిన/ 'పెట్టుబడి'ని/ ఆవాహనచేసిన ధీశాలి/........./ శ్రమచేసుకు బతికే/ బడుగుజీవుల/ ఆశాకిరణం/ ప్రపంచ ప్రచండ/ కార్మికనేత/ ఒక ఆరనిజ్వాల' అంటారు ఈ కవి.

ఇప్పుడు చాలామంది గోలంతా ఆ జ్వాల ఇక ఆరిపోయిందనే. (అదో భ్రమ.) నిజానికది ఆరిపోదు. అది ఆధునిక మానవవిజ్ఞానం ఆవిష్కరించిన కొడిగట్టని అఖండజ్వాల అని గుర్తించలేని అజ్ఞానుల కొలాహలం మాత్రమే అని ఆచార్యుల ప్రగాఢవిశ్వాసం. సంపుటిలోని కవితల్లో సగం లఘువులు అనే లఘు కవితలు. అవి 'ఎవరి అమ్మ వారికే సొంతం/ ఎవరిభాష వారికే మధురం/ అమ్మ భాషకు మించిన/ కమ్మదనం మరేభాషలోనూ దొరకదు' అని మాతృభాషా మాధుర్యంతో ప్రారంభమయ్యాయి. 'నేలను తాకని చినుకు/ జనానికి చేరని కవిత నిరర్థకం' అంటారు.

'తెల్లకాగితంపై/ అక్షరాలు చల్లితే/ కవిత/ వీడు కవి/ ధరణీ తలంపై/ విత్తులు జల్లితే పంట/ వీడు రైతు - వాడి తండ్రి' అంటూ కవి కర్షక సేద్యపు సారూప్యతను చెపుతూనే వారి అనుబంధాన్నీ వ్యక్తీకరించారు. అరసం ఏలూరు జిల్లా శాఖ ప్రచురించిన ఈ సంపుటికి అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, రాష్ట్ర అధ్యక్షులు డా. రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, సాహితీ విమర్శకులు ఏనుగు నరసింహారెడ్డి బంగారు వి.బి. ఆచార్యులును, ఆయన కవితల్ని పరిచయం చేస్తూ, విశ్లేషిస్తూ ముందు మాటలు రాశారు. 'ఈ కవి ఈ కవితల ద్వారా ప్రజాపక్షం వహిస్తున్నాడు. ప్రతిపక్షపాత్రను పోషిస్తున్నాడు' అంటారు పెనుగొండ. 'ఆచార్యులు మొహమాటమే లేని కవి. దాపరికం లేనికవి. ఆయన కవిత్వంలో వస్తుబలం ఎక్కువ. అది చాలా తాజాగా ఉంటుంది' అంటారు రాచపాళెం.'ఈ సంపుటి నిండా కేవలం మానవత్వం నిండా పులుముకొని భావాలే గోచరిస్తాయి. అందులో శ్రమజీవుల పక్షాన నిలబడి ప్రగతిశీల భావాలను పెంపొందింపజేయడం అడుగడుగునా కానవస్తుంది' అంటారు తెలంగాణ అరసం అధ్యక్షులు డా. పల్లేరు వీరాస్వామి. సీనియర్ కవి బంగారు బి.వి.ఆచార్యులు 'ప్రశ్న' సధైర్యంగా రాసిన కవిత్వం' అన్నారు మరో సాహితీవేత్త, డిప్యూటీ కలెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి. ఇంకా అనేకమంది సాహిత్రీ మిత్రులు పంపిన అభినందన సందేశాలు ఇందులో కనిపిస్తాయి.

కె. శరచ్చంద్ర జ్యోతిశ్రీ

కేంద్రం నాయకత్వంలోనే మైనారిటీలపై దాడులు

పినరయి విజయన్ విమర్శ

త్రిసూర్: కేంద్ర ప్రభుత్వం నేతృత్వంలోనే మైనార్టీలపై దాడులు జరుగుతున్నాయని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆరోపించారు. చెలక్కరలో ఉపఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలను ఎలా విభజించాలని కేంద్ర పాలకులు ఆలోచిస్తున్నారని మండిపడ్డారు. ప్రధాని, హోంమంత్రి వర్గీయులు ప్రచారం చేస్తూ ప్రజలను రెండుగా విభజించేందుకు ప్రయత్నిస్తున్నారని ముఖ్యమంత్రి అన్నారు. మన సమాజంలో మైనారిటీలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ప్రపంచంలోని అన్ని దేశాలు మైనారిటీలను రక్షించే వైఖరి అవలంబిస్తున్నాయని తెలిపారు. కానీ కేంద్ర ప్రభుత్వం మాత్రం మైనారిటీ వ్యతిరేక ధోరణి అవలంబిస్తోందన్నారు. ఎప్పటి నుంచో బీజేపీ దీనినే కొనసాగిస్తుందని తెలిపారు. ఇది నాగరిక ప్రపంచానికి తగినది కాదని వివిధ దేశాలు అభిప్రాయపడ్డాయని పేర్కొన్నారు. దేశంలోని ఓ వర్గానికి వ్యతిరేకంగా హోంమంత్రి స్వయంగా మాట్లాడారని అన్నారు. ఒక వర్గంపై మరో వర్గాన్ని రెచ్చగొట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ముఖ్యమంత్రి అన్నారు.

కెనడాలో యథావిధిగా ఎస్‌బీఐ సేవలు

ముంబై: కెనడాలో హిందూ దేవాలయాలే లక్ష్యంగా దాడులు, రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు క్షీణిస్తున్న తరుణంలో భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) తాజాగా ఓ ప్రకటన చేసింది. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ అక్కడ ఎస్‌బీఐ సేవలపై ఎటువంటి ప్రభావం చూపించలేదని, కార్యకలాపాలు యథావిధిగా కొనసాగుతున్నాయని తెలిపింది. 'వినియోగదారులు, నియంత్రణ సంస్థల విధానంలో ఎటువంటి మార్పు కనపించలేదు. కార్యకలాపాలు యథావిధిగా కొనసాగుతున్నాయి. మేం అక్కడ స్థానిక బ్యాంకులలో ఒకటిగా పరిగణించబడుతున్నామని భావిస్తున్నా. మా వాణిజ్య కార్యకలాపాలు స్థానిక వాతావరణంలోనే ఉంటాయి' అని ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి పేర్కొన్నారు. కెనడాలో 1982 నుంచి ఎస్‌బీఐ సేవలు అందిస్తోందని, అందుకే స్థానిక బ్యాంక్‌గా పరిగణిస్తున్నారని చెప్పారు. కీలక సేవల ద్వారా ఆదాయ వనరులు పెంచుకోవడానికి అన్ని మార్గాల్లో ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. టొరంటో, బ్రాంప్టన్, వాంకోవర్‌తో పాటు మొత్తంగా కెనడాలో ఎనిమిది బ్రాంచ్‌ల ద్వారా ఎస్‌బీఐ సేవలందిస్తోంది.

ఇంట్లోనే 'ఎర్ర బంగారం' సాగు

కిలో ధర రూ.5 లక్షలు

ఇండోర్: ఎర్ర బంగారంగా ఖ్యాతి చెందిన కుంకుమ పువ్వు మనదేశంలో ఎక్కువగా కశ్మీర్‌లో పండుతోంది. వంటలు మొదలు ఔషధాలు, సౌందర్య ఉత్పత్తుల వరకు దీని వినియోగం అధికం. కశ్మీర్ ప్రకృతి అందాలను వీక్షించేందుకు వెళ్లిన ఓ రైతు... అక్కడ కుంకుమ పువ్వు సాగును చూసి ప్రేరణ పొందాడు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించి తన ఇంటివద్దే పంట సాగు మొదలుపెట్టాడు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన అనిల్ జైస్వాల్ కొన్నేళ్ల క్రితం కుటుంబంతో కలిసి కశ్మీర్ వెళ్లాడు. అక్కడి పంపోర్‌లో కుంకుమ పువ్వు సాగును చూసి స్ఫూర్తి పొందాడు. స్వస్థలంలోనూ అదే పంట పండించాలనుకున్నాడు. దానికోసం మట్టి అవసరం లేని అధునాతన 'ఏరోపోనిక్స్' విధానాన్ని అవలంబించాడు. కశ్మీర్ మాదిరి ఉష్ణోగ్రత, తేమ, కాంతి, కార్బన్ డయాక్సైడ్‌తో కూడిన నియంత్రిత వాతావరణాన్ని సైతం సృష్టించాడు. ఆ రైతు ఓ వార్తాసంస్థతో మాట్లాడుతూ పంట సాగు విషయాలు పంచుకున్నాడు. 'ఇంటి రెండో అంతస్తులో 320 చదరపు అడుగుల గదిలో కుంకుమ పువ్వు సాగు చేపట్టాను. మౌలిక సదుపాయాల కల్పనకు రూ.6.50 లక్షల ఖర్చయింది. ఒక టన్ను కుంకుమ పువ్వు మొక్కల్ని పంపోర్ నుంచి తెప్పించా. ఈ సీజన్ ముగిసేలోపు 1.5 కిలోల నుంచి 2 కిలోల వరకు కుంకుమ పువ్వు చేతికొస్తుందని భావిస్తున్నా. దేశీయ మార్కెట్లో కిలో కుంకుమ పువ్వు ధర రూ.5 లక్షలు ఉంది. అంతర్జాతీయ మార్కెట్లో కిలో రూ.8.50 లక్షల వరకు పలికే అవకాశం ఉంది' అని తెలిపారు. పంట సాగు చేస్తున్న గదిలో మొక్కల కోసం పాటలు పెడతానని చెప్పాడు.

అర్బన్ నక్సలిజంతో రాజ్యాంగానికి పోలికా?

బీజేపీ, మోదీపై ఖర్గే అసహనం

న్యూఢిల్లీ: 'రెడ్ బుక్' వివాదం చిలికిచిలికి గాలివానగా మారుతోంది. అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధానికి దారితీస్తుంది. రాజ్యాంగాన్ని రెడ్ బుక్ అనడం, అర్బన్ నక్సలిజంతో ముడిపెట్టడంపై విపక్ష కాంగ్రెస్ మండిపడుతోంది. ఇదే అంశమై బీజేపీ నేతలు, ప్రధాని మోదీపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆగ్రహం వ్యక్తంచేశారు. 2017లో అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు ఇదే రెడ్ బుక్ (రాజ్యాంగం) ప్రతిని ప్రధాని మోదీ అందజేయలేదా అని ప్రశ్నించారు. ఖర్గే ఆదివారం మహారాష్ట్రలో మహావికాస్ అగాడీ (ఎంవీయే) మేనిఫెస్టో విడుదల అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీజేపీ వైఖరిని దుయ్యబట్టారు. ఎంవీయే మేనిఫెస్టోను సమ్మిళితమైనదిగా వర్ణించారు. అందరి భాగస్వామ్యానికి అవకాశమిచ్చే విధంగా రూపొందించినట్లు తెలిపారు. కుల గణన కోసం తమ పార్టీ చేస్తున్న డిమాండ్ ప్రజలను విభజించేందుకు కాదంటూ బీజేపీ నేతల విమర్శలను తిప్పికొట్టారు. వివిధ వర్గాల ప్రస్తుత స్థితిగతులను తెలుసుకొని, తగు విధంగా సంక్షేమ చర్యలు తీసుకునేందుకు కుల గణనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఖర్గే తెలిపారు. బీజేపీ, మోదీ చెబుతున్నట్లుగా 'రెడ్ బుక్' ఖాళీ పుస్తకం కాదంటూ రాజ్యాంగ ప్రతిని ప్రదర్శించారు. ఆయనను ప్రాథమిక పాఠశాలలో చేర్చడం అవసరమని ప్రధానిని ఎద్దేవా చేశారు. అదే సమయంలో అధికార మహాయుతిని ఓడించి... సుస్థిర, సుపరిపాలన కోసం ఎంవీయేను గద్దెనెక్కించడం మహారాష్ట్రకు అత్యవసరమని మల్లికార్జున ఖర్గే ఆ రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు.

'కులం, మతం పేరిట ప్రజలను విభజిస్తున్నది మీరు మేము కాదు... మేము ప్రజలను ఒక్కటి చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇందుకోసమే ఇందిరాగాంధీ (మాజీ ప్రధాని) తన ప్రాణాలు లర్పించారు' అని బీజేపీని విమర్శించారు. మోదీ-అమిత్ షాతో దేశానికి ముప్పు అని అన్నారు. ఓ వైపు కాషాయం ధరిస్తారు... మరోవైపు 'బటోగే టో కటోగే' (విడిపోతే చస్తారు) అంటారని దుయ్యబట్టారు. 'కటేంగే', 'బటేంగే', 'ఛాటేంగే' వంటి పదాలతో 'విభజన' భాషను మాట్లాడేది నరేంద్ర మోదీ, అమిత్‌షా, బీజేపీ నేతలని ఖర్గే విమర్శించారు. విద్వేషాన్ని రెచ్చగొడుతూ ప్రజలను విభజించేందుకు యత్నిస్తున్నారన్నారు.

అధికారంలోకి వచ్చిన వెంటనే కులగణన

మహారాష్ట్ర ఎన్నికల వేళ రాష్ట్ర ప్రజలపై ప్రధాన పార్టీలు హామీల వర్షం కురిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) మ్యానిఫెస్టోను ఆదివారం విడుదల చేసింది. ప్రధానంగా కులగణన, రిజర్వేషన్లు, వ్యవసాయం, పట్టణ, గ్రామీణాభివృద్ధి, ఆరోగ్యంపై దృష్టి సారించింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడారు. 'ఎంవీఏ అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో కులగణన నిర్వహిస్తాం. ప్రస్తుతం ఉన్న 50 శాతం రిజర్వేషన్లను మరింత పెంచుతాం. అందుకు కూటమిలో చర్చలు జరుగుతున్నాయి. కులగణన అంటే సమాజాన్ని విభజించడం కాదు. వివిధ వర్గాల వారు మరింత ప్రయోజనం పొందేందుకు ఇది ఉపయోగపడుతుంది. కులగణన, రిజర్వేషన్లు, వ్యవసాయం, పట్టణ, గ్రామీణాభివృద్ధి, ఆరోగ్య హామీలతో కూడిన మ్యానిఫెస్టోను మీ ముందు ఉంచాం. ఈ హామీలు కుటుంబాల అభ్యున్నతికి దోహదపడతాయి. ఏడాదికి సుమారు రూ. 3.5 లక్షల నుంచి సామాన్యులకు ఉపశమనం లభిస్తుంది' అని ఖర్గే హామీ ఇచ్చారు. రాజస్థాన్‌లో అమలవుతున్న రూ.25 లక్షల ఆరోగ్య బీమాను మహారాష్ట్రలోనూ అమలు చేస్తామని, రూ.3 లక్షల వ్యవసాయ రుణమాఫీకి కట్టుబడి ఉన్నామని, రుణాలు తిరిగి చెల్లించే రైతులకు రూ.50 వేల సహాయం అందజేస్తామని, గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన నిరుద్యోగులకు నెలకు రూ. 4 వేల భృతి అందజేస్తామని హామీ ఇచ్చారు.

సరైన సమయంలో సీఎం పేరు వెల్లడి

- ఎంవీఏలో అతిపెద్ద పార్టీనే ఖరారు చేస్తుంది
- కాంగ్రెస్ నేత పృథ్వీరాజ్ చవాన్

ముంబై : మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) మెజార్టీ సాధిస్తుందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి పృథ్వీరాజ్ చవాన్ ఆదివారం విశ్వాసం వ్యక్తం చేశారు. కూటమిలో అతిపెద్ద పార్టీగా అవతరించిన పార్టీ సీఎం పేరును ఖరారు చేస్తుందని, ఇది 'సమయానుగుణంగా గౌరవప్రదమైన పద్ధతి' అని ఆయన నొక్కి చెప్పారు. పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో 78 ఏళ్ల చవాన్ మాట్లాడుతూ కాంగ్రెస్ హర్యానా ఓటమి మహారాష్ట్రలో ప్రతిపక్ష కూటమి అవకాశాలను దెబ్బతీసిందని, 'బీజేపీ ప్రచారం' ఊపందుకునేలా చేసిందన్న వాదనలను తోసిపుచ్చారు. 'హర్యానా, మహారాష్ట్రలను పోల్చలేం. మీరు లోక్‌సభ ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే, హర్యానాలో 5-5 ఫలితాలు వచ్చాయి (కాంగ్రెస్‌కు ఐదు సీట్లు, బీజేపీకి ఐదు సీట్లు), కానీ మహారాష్ట్రలో మాకు (ఎంవీఏ) 65 శాతం 35 శాతం ఫలితాలు వచ్చాయి. ఈ రెండు ఫలితాల మధ్య చాలా వ్యత్యాసం ఉంది' అని నవంబరు 2010 నుంచి సెప్టెంబరు 2014 మధ్య మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా పని చేసిన చవాన్ తెలిపారు. హర్యానా సామాజిక గతిశీలత భిన్నంగా ఉందని, ఏ సందర్భంలోనైనా మహారాష్ట్రలోని ప్రతి బహుళ ప్రాంతానికి దాని స్వంత సామాజిక రంగు ఉందని కూడా ఆయన నొక్కి చెప్పారు. ఎంవీఏ అధికారంలోకి వస్తే ఎవరు ముఖ్యమంత్రి అవుతారనే దానిపై చవాన్ మాట్లాడుతూ 'అతిపెద్ద పార్టీ (ఎన్నికల అనంతరం) సీఎం పేరును నిర్ణయించడం చాలా కాలంగా వస్తున్న ఆచారం. ఈసారి ఎందుకు భిన్నంగా ఉండాలి. కానీ ఈసారి మూడు పార్టీలు కలిసి ఫార్ములా మార్చుకోవాలనుకుంటే వారు కోరుకున్నది చేయగలరు' అని అన్నారు. కూటమిలో భాగస్వామ్య పక్షాల్లో అత్యధిక సీట్లు వచ్చే పార్టీనే సీఎంను నిర్ణయించాలని ఎన్‌సీపీ (ఎస్‌పీ) అధినేత శరద్ పవార్ పేర్కొన్నారని ఈ సందర్భంగా చవాన్ గుర్తు చేశారు. ముఖ్యమంత్రి పదవి కోసం పోటీలో ఉన్నారా అని ప్రశ్నించగా... అది హాస్యాస్పదమైన ప్రశ్న అలా అడగొద్దు... ఎన్నికల్లో గెలవడమే మా ప్రాధాన్యత... నేను చెప్పినట్లుగా అతి పెద్ద పార్టీకే సీఎం పదవి వస్తుందని పవార్ చెప్పారు' అని అన్నారు. కాంగ్రెస్, శివసేన (యూబీటీ), ఎన్‌సీపీ (ఎస్‌పీ) ఎంవీఏ భాగస్వామ్య పక్షాల మధ్య సీట్ల పంపకంపై మాట్లాడుతూ దాదాపు మొత్తం 288 సీట్లపై ఒప్పందం 'అద్భుతమైన విజయం' అని పేర్కొంటూ, ఎంవీఏలో సీట్ల పంపకంపై గొడవ జరుగుతుందనే చర్చను చవాన్ తోసిపుచ్చారు. 'మేము ప్రాథమికంగా మూడు పార్టీలు, కొన్ని ఇతర పార్టీల మధ్య 288 సీట్ల గురించి మాట్లాడుతున్నాం. 3 నుంచి 4 చోట్ల మాత్రమే రెండు పార్టీలు ఒకదానికొకటి పోటీ చేస్తున్నాయి. కొంతమంది తిరుగుబాటు అభ్యర్థులు సహాయం చేయలేని వారు ఉన్నారు' అని ఆయన పీటీఐకి నొక్కి చెప్పారు. 'తిరుగుబాటు అభ్యర్థులు అక్కడ ఉండటం గొడవ కాదు. ఎంవీఏ విస్తృతంగా ఐక్యంగా ఉంది' అని చెప్పారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ, ఇతర సీనియర్ నేతలు చర్చించి మహారాష్ట్రకు సంబంధించిన హామీలను విడుదల చేశారన్నారు. ఎంవీఏకు ఎన్ని సీట్లు వచ్చే అవకాశం ఉందో తాను సంఖ్యలను అంచనా వేయలేనని, అయితే ఎంవీఏకు మెజారిటీ వస్తుందన్న నమ్మకం ఉందని చవాన్ అన్నారు. మహారాష్ట్ర ఎన్నికల్లో నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, రైతుల కష్టాలు, రాజ్యాంగంపై దాడి, అవినీతి వంటి అంశాలు కీలకమైనవని తెలిపారు. చవాన్ దక్షిణ కరాడ్ నుంచి మహారాష్ట్ర అసెంబ్లీకి మూడోసారి పోటీ చేయనున్నారు. ఆయన లోక్‌సభ, రాజ్యసభ, శాసన మండలి సభ్యునిగా కూడా పని చేశారు.

హిందీ... పార్లమెంటు భాషా?

దీని అధిక వినియోగంతో దక్షిణాది ఎంపీలకు సమస్య: జాన్ బ్రిట్టాస్

న్యూఢిల్లీ: పార్లమెంటులో మంత్రులు హిందీలోనే మాట్లాడటం దక్షిణ రాష్ట్రాల ఎంపీలకు సమస్యగా మారిందని కేరళకు చెందిన సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్ అన్నారు. హిందీయేతర రాష్ట్రాలవారి దృష్ట్యా ఈ పద్ధతిలో మార్పు రావడం అవసరమని సూచించారు. అధికార పక్ష సభ్యులు, మంత్రులు ఆంగ్లంలో కాక హిందీనే వాడుతుండటంతో వారు చెప్పేది అర్థం చేసుకోలేక దక్షిణ రాష్ట్రాలు, హిందీ మాట్లాడని ప్రాంతాలకు చెందిన చట్టసభ్యులు ఇబ్బంది పడాల్సి వస్తోందని జాన్ బ్రిట్టాస్ అన్నారు. ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడగలిగిన మంత్రులు సైతం హిందీలోనే ప్రసంగిస్తున్నారన్నారు. పార్లమెంటులో హిందీని అధికార భాషగా చేసే యత్నమే ఇదని పీటీఐకిచ్చిన ఇంటర్వ్యూలో దుయ్యబట్టారు. ఒక్క పార్లమెంటులోనే కాదు ప్రతిచోట హిందీని ఆపదించే ప్రయత్నం జరుగుతోందని అన్నారు. దక్షిణ ఎంపీలకు ప్రభుత్వ లేఖలు సైతం ఆంగ్లంలో కాక హిందీలో వస్తుండటం కొత్త సమస్య అని చెప్పారు. హిందీలో సమాధానాలు పంపడంతో మలయాళంలో బదులివ్వాలని అనిపించిందన్నారు. ఇది తన విషయంలోనో ఏదో ఒక్క మంత్రి విషయమో కాదని... దాదాపు అందరిదీ ఇదే తంతు అని బ్రిట్టాస్ అన్నారు. కేవలం తమ పార్టీనే హిందీకి కట్టుబడినట్లుగా బీజేపీ తీరు ఉంటోందని విమర్శించారు. 1980 దశకంలో జర్నలిస్టుగా పార్లమెంటు సమావేశాల వార్తాసేకరణకు వెళ్లిన రోజులు గుర్తుచేసుకున్నారు. అప్పట్లో 80-90శాతం ప్రసంగాలు ఆంగ్లంలో జరిగేవని, అదే సరైన పద్ధతని చెప్పనుగానీ అప్పటి స్థితిని వివరిస్తున్నా అని చెప్పారు. బీజేపీ సీనియర్ నేత ఎల్‌కే అద్వాణి, అటల్ బిహారీ వాజ్‌పేయి వంటి వారు సైతం పార్లమెంటులో ఆంగ్ల భాషనే అధికంగా వాడేవారని బ్రిట్టాస్ తెలిపారు.

హిందీని సమర్థిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఎన్నో ప్రకటనలు చేశారు కానీ మిగతా భాషలకు ఆయన అదేస్థాయి గౌరవం ఇవ్వలేదని జాన్ బ్రిట్టాస్ విమర్శించారు. ఈ పద్ధతిలో మార్పు అవసరమని ఆయన సూచించారు.

హనీట్రాప్‌తో వ్యక్తి కిడ్నాప్... రూ.3 లక్షల డిమాండ్

లక్నో: హనీట్రాప్ మోసాలు దేశవ్యాప్తంగా పెరిగిపోతున్నాయి. ప్రతిరోజు ఏదో ఓ రాష్ట్రంలో డేటింగ్‌కు పిలిచి మహిళలతో కూడిన ముఠా కిడ్నాప్‌లు చేస్తూనే ఉన్నాయి. తాజాగా ఉత్తరప్రదేశ్‌లో ఓ వ్యక్తిని డేటింగ్ కోసం పిలిచి అతడిని కిడ్నాప్ చేశారు. కుటుంబం నుంచి డబ్బులు డిమాండ్ చేశారు. అతడి కుమారుడి ఫిర్యాదుతో పోలీసులు రంగప్రవేశం చేసి ఆ వ్యక్తిని కాపాడారు. వివరాల్లోకి వెళితే... లలిత్‌పూర్‌కు చెందిన లల్లూ చౌబే (50)కు ఒక మహిళ ఫోన్ చేసింది. డేటింగ్ పేరుతో అతడిని ఝాన్సీకి రప్పించింది. కొందరు దుండగులు చౌబేను కిడ్నాప్ చేసి ఒక చోట బంధించారు. అతడి కుటుంబానికి ఫోన్ చేసి చౌబేను విడిచిపెట్టాలంటే రూ.మూడు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లక్ష ఇచ్చినప్పటికీ అతడిని విడిచిపెట్టలేదు. దీంతో చౌబే కుమారుడు పోలీసులను ఆశ్రయించాడు. ఒక కానిస్టేబుల్ చౌబే కుమారుడిగా నటిస్తూ డబ్బు ఇచ్చేందుకు వారిని కలిశాడు. లల్లూ చౌబేను నిర్బంధించిన చోటుకు ఆ కానిస్టేబుల్‌ను ఓ వ్యక్తి తీసుకెళ్లాడు. అతడిని అనుసరించిన పోలీస్ బృందాలు అక్కడకు చేరుకున్నాయి. కిడ్నాపైన లల్లూ చౌబేను కాపాడారు.

ఉల్లి మరింత ఘాటు



న్యూఢిల్లీ: దేశంలో ఉల్లి ఘాటు మరింత పెరిగింది. నిన్న మొన్నటి వరకు హోల్‌సేల్ మార్కెట్లలో రూ.40-60 పలికిన కిలో ఉల్లిపాయల ధర... ఇప్పుడు రూ.70-80కి చేరింది. శుక్రవారం కొన్ని ప్రాంతాల్లో రూ.80 కంటే అధిక ధర పలికింది. దీంతో కుటుంబ బడ్జెట్లు తల్లకిందులై వినియోగదారులు అల్లాడుతున్నారు. ద్రవ్యోల్బణంతోపాటు ఉల్లి కొనుగోలు ధరలు పెరగడమే ఇందుకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు. మండీల్లో కిలో ఉల్లి ధర రూ.60 నుంచి రూ.70కి పెరిగిందని, అమ్మకాలపై ప్రభావం చూపుతుండటంతో విక్రయాలు తగ్గాయని, అయినప్పటికీ రోజువారీ ఆహారంలో ఎంతో కీలకపాత్ర పోషిస్తున్న ఉల్లిపాయలను ప్రజలు కొంటూనే ఉన్నారని ఢిల్లీ మార్కెట్‌లోని ఓ వ్యాపారి తెలిపారు. ధరల పెరుగుదలపై వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉల్లితోపాటు వెల్లుల్లి ధర కూడా రెట్టింపు కావడంతో కుటుంబ బడ్జెట్‌ను దెబ్బతీస్తున్నదని కొనుగోలుదారులు వాపోతున్నారు.

ఢిల్లీలో కెనడా ఎంబసీ వద్ద నిరసన

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని కెనడా రాయబార కార్యాలయం వద్ద హిందువులు, సిక్కులు ఆదివారం భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. కెనడాలోని బ్రాంప్టన్‌లో హిందూ దేవాలయంపై ఖలిస్థాన్ అనుకూల మూక దాడిపై నిరసన వ్యక్తం చేశారు. దీంతో చాణక్యపురిలోని కెనడా హైకమిషన్ వద్ద భద్రత పెంచారు. పోలీసులు, భద్రతా సిబ్బందిని పెద్ద సంఖ్యలో మోహరించారు.

కెనడా ఎంబసీ వద్ద అనేక వరుసల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు. కాగా, నిరసనకు పిలుపునిచ్చిన హిందూ, సిక్కు గ్లోబల్ ఫోరమ్ కార్యకర్తలు కొన్ని బారికేడ్లను పడేశారు. మరికొన్నింటిపైకి ఎక్కారు. 'హిందువులు, సిక్కులు ఐక్యంగా ఉన్నారు, కెనడాలోని దేవాలయాలను అవమానిస్తే భారతీయులు సహించరు' అని రాసి ఉన్న ప్లకార్డులు, జాతీయ జెండాలను ప్రదర్శించారు. భారత్‌కు అనుకూలంగా, కెనడాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మరోవైపు నిరసనకారులు మరింత ముందుకు రాకుండా పోలీసులు, భద్రతా సిబ్బంది రక్షణగా నిలిచి అడ్డుకున్నారు.

ఓబీసీల విభజనకు కాంగ్రెస్ కుట్ర

సోరెన్ సర్కారు విచ్చలవిడి అవినీతి: మోదీ

రాంచీ: ఓబీసీలను విభజించడానికి కాంగ్రెస్- జేఎంఎం ప్రయత్నిస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రయత్నాలు ఫలించకూడదంటే ప్రజలు ఐక్యంగా ఉండాలని సూచించారు. ఐక్యతతోనే భద్రత ఉంటుందని పేర్కొన్నారు. గతంలో ఓబీసీలు, గిరిజనులు, దళితుల మధ్య ఐక్యత ఏర్పడనంత వరకు కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏర్పాటు చేస్తూనే ఉందని పేర్కొన్నారు. 'కాంగ్రెస్, జేఎంఎం కుట్రల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. అధికారం చేజిక్కించుకోవడానికి అవి ఎంతకైనా దిగజారుతాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల ఐక్యతకు వ్యతిరేకంగా కాంగ్రెస్ వ్యూహాలు పన్నుతూ దేశాన్ని దోచుకుంది. ఛోటానాగపూర్ ప్రాంతంలో 125 కంటే ఎక్కువ ఉపకులాలు ఓబీసీలుగా పరిగణించబడుతున్నాయి. ఉపకులాలను ఒకదానితో ఒకటి ఇరకాటంలో పెట్టడం ద్వారా కాంగ్రెస్, జేఎంఎంలు ఓబీసీల ఐక్యతను విచ్ఛిన్నం చేయాలనుకుంటున్నాయి. కాబట్టి ప్రజల్లో ఐక్యత ఉంటేనే భద్రత ఉంటుంది' అని ప్రధాని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370ని పునరుద్ధరించాలని కాంగ్రెస్, దాని మిత్ర పక్షాలు కోరుతున్నాయని, అదే జరిగితే మళ్లీ మన సైనికులు ఉగ్రవాద దాడులను ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కశ్మీర్‌లో ఆర్టికల్ 370 తీసుకువచ్చారని, ఏడు దశాబ్దాలుగా అక్కడ రాజ్యాంగం అమలులో లేదని ఆయన అన్నారు. భారత రాజ్యాంగం పేరుతో తొలిసారిగా జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ప్రమాణ స్వీకారం చేశారని, ఇదే అంబేద్కర్‌కు ఆయన అర్పిస్తున్న నివాళి అని మోదీ అన్నారు. చొరబాటుదారులను తరిమికొట్టేందుకు, అవినీతి నిర్మూలనకు జార్ఖండ్‌లో బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం అవసరమని ప్రధాని పేర్కొన్నారు. అధికార జేఎంఎం నేతృత్వంలోని సంకీర్ణం సృష్టించిన రిక్రూట్‌మెంట్ మాఫియా, పేపర్ లీక్ మాఫియాలను జైలుకు పంపుతామని, యువత భవిష్యత్తుతో ఆడుకున్న వారిని వదిలిపెట్టబోమని మోదీ హెచ్చరించారు. హేమంత్ సోరెన్ ప్రభుత్వం విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతోందని ప్రధాని ఆరోపించారు. ఇండియా ఐక్యసంఘటన ప్రజలను దోచుకుందని దుయ్యబట్టారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన అనంతరం అవినీతికి పాల్పడిన వారికి కఠిన శిక్ష విధించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గతంలో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ దశాబ్ద కాలంగా జార్ఖండ్‌కు రూ.80 వేల కోట్లు కేటాయించడానికి ఇబ్బందులు పడ్డారని, తమ ప్రభుత్వం గత పదేళ్లలో రాష్ట్రానికి రూ.3 లక్షల కోట్లకుపైగా నిధులు మంజూరు చేసిందని ప్రధాని వెల్లడించారు.

ఎన్నికల తర్వాతే సీఎంపై నిర్ణయం

అమిత్‌షా



ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి ప్రభుత్వం తిరిగి గెలిస్తే పగ్గాలు చేపట్టే ముఖ్యమంత్రి ఎవరనే దానిపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆదివారం స్పష్టత ఇచ్చారు. మేనిఫెస్టో విడుదల అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మహాయుతి ప్రభుత్వం పూర్తి మెజారిటీతో తిరిగి అధికారంలోకి వస్తుందని, ఎన్నికల అనంతరం భాగస్వామ్య పార్టీలు సమావేశమై తదుపరి ముఖ్యమంత్రిపై నిర్ణయం తీసుకుంటాయని చెప్పారు. భాగస్వామ్య పార్టీలైన బీజేపీ, ఏక్‌నాథ్ షిండే సారథ్యంలోని శివసేన, ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ సారథ్యంలోని ఎన్‌సీపీ తమతమ మేనిఫెస్టోలను విడుదల చేశాయని, ఎన్నికల అనంతరం మూడు పార్టీలకు చెందిన మంత్రులతో కమిటీ ఏర్పాటు చేసి హామీల ప్రాధాన్యతా క్రమాన్ని నిర్ధారిస్తుందని అమిత్‌షా తెలిపారు. ప్రస్తుతానికి ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేనే అని, ఎన్నికల అనంతరం మూడు పార్టీలు సమావేశమై సీఎంను నిర్ణయిస్తారని చెప్పారు. ఉద్ధవ్ ఠాక్రే శివసేన, శరద్ పవార్ ఎన్‌సీపీ చీలిపోవడానికి కారణం వివరిస్తూ... ఏక్‌నాథ్ షిండేకు బదులుగా ఉద్ధవ్ ఠాక్రే తన కుమారుడికి ప్రాధాన్యత నిచ్చారని, అజిత్ పవార్‌కు బదులు తన కుమార్తెకు శరద్ పవార్ ప్రాధాన్యతనిచ్చారని చెప్పారు. కుటుంబాలకు ప్రాధాన్యం ఇవ్వడం వల్లే ఆ పార్టీల్లో చీలిక వచ్చిందని, బీజేపీ కారణం కాదన్నారు. కుటుంబ పాలనకు బీజేపీ వ్యతిరేకమని స్పష్టం చేశారు.

బీజేపీ మేనిఫెస్టో విడుదల

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు మరో 10 రోజులు గడువు మాత్రమే ఉన్న నేపథ్యంలో బీజేపీ తన మ్యానిఫెస్టోను ఆదివారం విడుదల చేసింది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా 'సంకల్ప్ పత్ర-2024' పేరుతో దీనిని విడుదల చేశారు. ప్రధానంగా యువతకు 25 లక్షల ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలను సృష్టించే లక్ష్యంతో ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల డిమాండ్, సరఫరా అంచనాకు సమగ్ర నైపుణ్య గణన, 11 లక్షల మంది మహిళలకు ప్రయోజనం చేకూరుస్తున్న 'లఖపతి దీదీ' పథకాన్ని 50 లక్షల మంది మహిళలకు విస్తరించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడం, రైతులు ఎరువులపై చెల్లించిన జీఎస్టీని తిరిగి చెల్లింపు, వారి ఆర్థిక భారం తగ్గించడం, పారిశ్రామిక అభివృద్ధిని పెంచేందుకు ప్రభుత్వం నుంచి రూ.25 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు, రైతులకు రుణమాఫీ చేసి, వారిపై రుణ భారాన్ని తగ్గించడానికి చర్యలు, వృద్ధులకు నెలవారీ పెన్షన్‌ను రూ.1,500 నుంచి రూ.2,100కు పెంచడం, నిత్యావసర వస్తువుల ధరలను స్థిరంగా ఉంచేందుకు చర్యలు, 'అక్షయ్ అన్న యోజన' పథకం ద్వారా పేద కుటుంబాలకు ప్రతి నెలా ఉచితంగా ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా నిత్యావసరాలు సరఫరా, ప్రతి జిల్లాలో ఛత్రపతి శివాజీ మహరాజ్ ఆకాంక్ష్ కేంద్రాల ద్వారా 10 లక్షల మంది కొత్త పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తామని మ్యానిఫెస్టోలో పొందుపరిచారు.

ప్రముఖ నటుడు ఢిల్లీ గణేశ్ కన్నుమూత



చెన్నై: దేశవ్యాప్తంగా అనేక భాషల్లో నటించిన ప్రముఖ నటుడు ఢిల్లీ గణేశ్ కన్నుమూశారు. కొంతకాలంగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆయన ఆదివారం తెల్లవారు జామున చెన్నైలో తుదిశ్వాస విడిచారు. ఆయన వయసు 80 సంవత్సరాలు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఢిల్లీ గణేశ్ మరణ వార్తతో తమిళ సినీ పరిశ్రమలో విషాదం నెలకొంది. సినీ నటులు తమ సంతాపాలు తెలిపారు. ఆగస్టు 1, 1944న గణేశ్ జన్మించారు.

'ఢిల్లీ గణేశ్'గా ఆయనకు గుర్తింపు వచ్చింది. 1964 నుంచి 1974 వరకు భారత వైమానిక దళంలో పనిచేశారు. ఆ తర్వాత సినీ పరిశ్రమలో అడుగుపెట్టారు. సాయుధ దళాల నుంచి తప్పుకున్న తర్వాత ఢిల్లీ కేంద్రంగా ప్రదర్శనలు చేసే 'దక్షిణ భారత నాటక సభ' బృందంలో చేరారు. దిగ్గజ దర్శకుడు కె.బాలచందర్... గణేశ్‌కు 'ఢిల్లీ గణేశ్' అని రంగస్థలం పేరు పెట్టి తమిళ సినిమాకు పరిచయం చేశారు. గణేశ్ 1976లో సినీ రంగ ప్రవేశం చేశారు. ఆ తర్వాత ఆయన వెనుదిరిగి చూసుకోలేదు. కామెడీ నుంచి ప్రతినాయక పాత్రల వరకు ఎన్నో పాత్రల్లో అలరించారు. ఆయన నటించిన ఎన్నో పాత్రలకు చక్కటి గుర్తింపు వచ్చింది.

1979లో విడుదలైన 'పసి' అనే సినిమాలో ఆయన నటనకు తమిళనాడు రాష్ట్ర చలనచిత్ర అవార్డు ప్రత్యేక బహుమతి దక్కింది. కెరీర్‌లో ఆయన 400లకు పైగా సినిమాల్లో నటించారు. తమిళం, తెలుగు, కన్నడ, హిందీ సినిమాల్లో అల్లరించారు. సింధు భైరవి (1985), నాయకన్ (1987), మైఖేల్ మదన కామరాజన్ (1990), ఆహా..! (1997), తెనాలి (2000) వంటి సినిమాల్లో పాత్రలకుగాను ఆయనకు మంచి గుర్తింపు లభించింది.

విశాలాంధ్ర
హైదరాబాద్

చర్చిల అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - మల్కాజిగిరి : చర్చీల అభివృద్ధికి కృషి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి నియోజకవర్గం పరిధిలోని చర్చిల అభివృద్ధి తన సంపూర్ణ సహకార అందిస్తానని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని హిల్ చర్చిలో ఆదివారం జరిగిన హార్వెస్ట్ ఫెస్టివల్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ దేవుని యందు భక్తితో మెరగాలని కోరారు. తన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అరుంధతి ఆసుపత్రి సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏ సమస్య వచ్చిన తనను సంప్రదించాలని తాను నిత్యం అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధస్సు పరిశోధనా ఫౌండేషన్ ప్రారంభం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : హైదరాబాద్‌లోని టీ-హబ్‌లో సమన్విత కృత్రిమ మేధస్సు పరిశోధనా ప్రయోగశాలల ఫౌండేషన్ ప్రారంభం అయ్యింది. ఈ కార్యక్రమంలో ఇండస్ట్రీ, విద్యా రంగ, ప్రభుత్వ ప్రతినిధులు భారత్లో ఏఐ రంగ పరిసరాలను చర్చించారు. సమాజం కోసం బాధ్యతాయుత ఏఐ అభివృద్ధిని ప్రోత్సహించడానికి, విద్యా రంగం, పరిశ్రమ, ప్రభుత్వ మధ్య సమన్వయాన్ని కుదుర్చుకోవడమే సీఏఐఆర్ఎల్ ఉద్దేశ్యం. ఈ కార్యక్రమం కొలబెర్రీ ప్రైవేట్ మిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ రామమోహన్ మనమసా పరిచయ ప్రసంగంతో ప్రారంభమైంది. ఇందులో సీఏఐఆర్ఎల్ లక్ష్యాలను వివరించారు. తర్వాత, కొలబెర్రీఇంక్, యుఎస్ఏ యొక్క ఫౌండర్, సీఈఓ రామ్ కాటామరాజా ప్రపంచ ఏఐ పరిశోధన పరిసరాలు భారత్లో సీఏఐఆర్ఎల్ అవసరంపై ప్రసంగం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, పరిశ్రమల విభాగం శ్రీ జయేష్ రంజన్ గౌరవ అతిథిగా హాజరయ్యారు. హైదరాబాద్‌ను ఏఐ ప్రతిభ, పరిశ్రమల గ్లోబల్ కేంద్రంగా మార్చడంలో తెలంగాణ ప్రభుత్వ కట్టుబాటుపై ఆయన ప్రసంగించారు.

తాగునీటి సరఫరాలో అంతరాయం

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్ నగరానికి తాగునీరు సరఫరా చేసే మంజీరా ఫేజ్-2లో కలబ్ గూర్ నుంచి పటాన్ చెరు వరకు ఉన్న 1500 ఎంఎం దయా పీఎస్సీ పంపింగ్ మెయిన్‌కు భారీ లీకేజీలు ఏర్పడ్డాయి. ఈ లీకేజీలను అరికట్టేందుకు 11న సోమవారం ఉదయం 6 గంటల నుంచి మరుసటి రోజు అనగా 12న మంగళవారం ఉదయం 6 గంటల వరకు మరమ్మతు పనులు చేపట్టనున్నారు. కావున ఈ 24 గంటలు కింద పేర్కొన్న కొన్ని ప్రాంతాల్లో ప్రెజర్‌తో నీటిసరఫరా, మరికొన్ని ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం కలుగుతుంది.

అంతరాయం ఏర్పడే ప్రాంతాలు...

1. ఓ అండ్ ఎం డివిజన్ 15-ఆర్సీ పురం, అశోక్ నగర్, జ్యోతి నగర్, లింగంపల్లి, చందానగర్, గంగారం, మదీనాగూడ, మియాపూర్. 2. ఓ అండ్ ఎం డివిజన్ 24-బీరంగూడ, అమీన్‌పూర్., 3. ట్రాన్స్ మిషన్ డివిజన్ 2-ఆఫ్ టేక్ పాయింట్స్, బల్క్ కనెక్షన్లు., 4. ఓ అండ్ ఎం డివిజన్ 6-ఎర్రగడ్డ, ఎస్.ఆర్.నగర్, అమీర్ పేట్., 5. ఓ అండ్ ఎం డివిజన్ 9-కేపీహెచ్ బీ కాలనీ, కూకట్ పల్లి, మూసాపేట్, జగద్గిరిగుట్ట, కాబట్టి పైన పేర్కొన్న ప్రాంతాల వినియోగదారులు నీటిని పొదుపుగా వాడుకోగలరని కోరడమైనది.

కుటుంబ సర్వేను పర్యవేక్షించిన మానిటరింగ్ ఆఫీసర్

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో భాగంగా ఆదివారం శేరిలింగంపల్లి జోన్లో వివిధ ప్రాంతాల్లో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో కుటుంబాల వారీగా వివరాల సేకరణకు సుపర్వైసర్లు, ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన ఎన్యూమరేటర్ బ్లాకలలో సర్వే కొనసాగిస్తున్నారు. జోన్ పరిధిలోని నల్లగండ్ల, డోన్స్ కాలనీ, చందానగర్, శాంతినగర్ ప్రాంతాలలో మానిటరింగ్ ఆఫీసర్ మయాంక్ మిట్టల్, సర్కిల్ డిప్యూటీ కమిషనర్ పి. మోహన్ రెడ్డి, ముకుంద రెడ్డి, ఇతర ఆఫీస్ సిబ్బంది పర్యటించారు. అలాగే మానిటరింగ్ ఆఫీసర్ మయాంక్ మిట్టల్, సూపర్వైజర్స్ ఎన్యూమరేటర్ బ్లాకలను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. మయాంక్ మిట్టల్ మాట్లాడుతూ ఈ కుటుంబ సర్వేలో భాగంగా ప్రతి ఎన్యుమరెటర్ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కులం వివరాలు జాగ్రత్తగా మార్గదర్శక పుస్తకంలో సూచించిన ప్రకారం పొరపాట్లు లేకుండా నమోదు చేయాలని ఆదేశించారు. జోనల్ కమీషనర్ ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతిరోజు సంబంధిత నాలుగు వార్డుల ఇంచార్జిలు, సుపర్వైసర్లు పది శాతం ఎన్యూమరేటర్ల నమోదును క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించి ఎన్యుమరేటర్లకు తగు మార్గదర్శకత్వం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు, ముకుంద రెడ్డి, మోహన్ రెడ్డి, ప్రాజెక్ట్ ఆఫీసర్ ఉష మరి ఇతర అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లు, లక్ష్మి విహార్ కాలనీ అధ్యక్షులు రవీంద్రప్రసాద్ దూబె పాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధులు కుటుంబ సర్వేపై అవగాహన కల్పించాలి

మంత్రి పొన్నం

విశాలాంధ్ర - హైదరాబాద్ : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై ఎలాంటి అనుమానాలు అవసరం లేదని రవాణా బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హుస్నాబాద్ పట్టణంలో ఎన్యుమరేటర్స్‌తో కలిసి స్వయంగా సర్వేలో పాల్గొని వివరాలు నమోదు చేశారు. ప్రజా ప్రతినిదులు ఇంటింటి కుటుంబ సర్వేలో భాగస్వామ్యులు కావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. సర్వే ద్వారా మీ కుల బలమెందో తెలిస్తే అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక వేయడానికి అవకాశం ఉంటుందని సర్వేకి సహకరించాలని తెలంగాణ వ్యాప్తంగా కుల సంఘాల నాయకులకు విజ్ఞప్తి చేశారు. ఈ సమగ్ర సర్వే ద్వారా ఎవరెంతో వారికంత ఆలోచనలతో తేడాలు సరి చేయడానికి ఉపయోగపడుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ సర్వే అనారోగ్యంతో ఉన్న మనిషి లోపాలను గుర్తించడానికి ఎక్స్‌రే లాగ సామాజిక రుగ్మతలను రూపుపడానికి ఉపయోగపడుతున్నారు. అన్ని రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు, అధికారులు చారిత్రాత్మక కార్యక్రమంలో భాగస్వామ్యం అయి ప్రజలు వివరాలు ఇచ్చేలా అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం హుస్నాబాద్ ఇండోర్ స్టేడియంలో 68 వ అండర్ - 14 బాయ్స్ అండ్ గర్ల్స్ ఎస్‌జీఎఫ్ స్టేట్ లెవెల్ హ్యాండ్ బాల్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. అండర్-14 బాయ్స్ అండ్ గర్ల్స్ హ్యాండ్ పోటీలో ఫైనల్లో అదిలాబాద్, వరంగల్ బాలికలు, కరీంనగర్, వరంగల్ బాయ్స్‌కి బహుమతుల ప్రధానం చేశారు. హుస్నాబాద్‌లో రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలు మొదటిసారి జరగడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. హుస్నాబాద్ స్టేడియం విస్తీర్ణం పెంచుకొని రాబోయే కాలంలో అన్ని క్రీడలకు వేదిక కావాలనీ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. హుస్నాబాద్ లో క్రీడలకు మరింత ప్రోత్సాహం అందించేలా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అన్ని రకాల కార్యక్రమాలు చేపడతానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వంలో క్రీడలకు ప్రాధాన్యత ఇస్తుందనీ ముఖ్యమంత్రి సియోల్‌లో స్పోర్ట్స్ యూనివర్శిటీ చూసిన తరువాత స్ఫూర్తి పొంది యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారనీ పేర్కొన్నారు. రాబోయే యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో హుస్నాబాద్ నుండి అధిక సంఖ్యలో అడ్మిషన్లు పొందాలనీ ఆకాంక్షించారు. ఇందుకు క్రీడా ఉపాధ్యాయులు మరింత ప్రోత్సాహం విద్యార్థులకు అందించాలనీ సూచించారు. హుస్నాబాద్ లో క్రీడలను పెంచడానికి ప్రత్యేక శిక్షకుడిని నియమించామని అథ్లెటిక్స్, వ్యాయామం, కబడ్డీ తదితర పోటీల్లో శిక్షణ ఇస్తున్నారన్నారు. రాబోయే కాలంలో స్విమ్మింగ్ పుల్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే షటిల్ కోర్టులో సింథటిక్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్టేడియం లో డ్రెస్సింగ్ రూమ్, టాయిలెట్స్ ఏర్పాటు త్వరలోనే పూర్తి అవుతాయనీ తెలిపారు. విద్యార్థులకు మండల స్థాయి క్రీడలు నిర్వహించాలని విద్యాధికారి ఆదేశించారు. క్రీడల్లో రాణించి గ్రామానికి, రాష్ట్రానికి, దేశానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆడిన వారికి ప్రోత్సహిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న, వైస్ చైర్మన్ ఐలేని అనిత సిద్దిపేట గ్రంథాలయ కమిటీ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ శివయ్య, కౌన్సిలర్లు, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికుల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికులకు రావాల్సిన పెండింగ్ బిల్లులు, వేతనాలను తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు పి.ప్రేంపవని, ప్రధానకార్యదర్శి జంపాల రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్ ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయం సత్యనారాయణరెడ్డి భవన్ తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశం పి.ప్రేంపావణి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రేం పవని, జంపాల రవీందర్ మాట్లాడుతూ గత ఏడాది నుంచి కోడి గుడ్లు, అల్పాహారం బిల్లులులతో పాటు వంట కార్మికులకు గడిచిన 6 నెలలుగా వేతనా బిల్లులు కూడ రావడం లేదని, వారు ఎలా జీవిస్తారు, పిల్లలకు వంటలు ఎలా చేసిపెడుతారో ప్రభుత్వం ఆలోచించాలని కోరారు. అలాగే ప్రభుత్వం ఒక్క కోడి గుడ్డుకు రూ.5 లు ఇస్తోందని, బహిరంగ మార్కెట్లో రూ.7లకు లభిస్తోందని మరి రెండు రూపాయలు నష్టంతో ఎలా అందించాలని వారు ప్రశ్నించారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి కోడిగుడ్లు పూర్తిగా ప్రభుత్వమే సరఫరా చేయాలని లేకపోతే వాటిని రాష్ట్ర వ్యాప్తంగా అందించలేమని స్పష్టం చేశారు. అలాగే ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రూ. 10 వేల వేతనం వెంటనే చెల్లించాలని, వంట కార్మికులను రాజకీయ ఇతరత్రా కారణాల తోఎవరిని కూడ తొలగించకుండా జిఓ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఉప ప్రధాన కార్యదర్శి సత్తెనపల్లి విజయలక్ష్మి, ఉపాధ్యక్షులు కుంటాల రాములు, ముంతాజ్, వెంకటేష్, కార్యదర్శులు ప్రసాద్, రామక్రిష్ణ, లక్ష్మణ్, వసంత, కాంతమ్మ పాల్గొన్నారు.

డిసెంబర్ 22న యూనియన్ రాష్ట్ర నిర్మాణ మహాసభలు

సమస్యలు పరిష్కారం కోసం కార్మికులను పోరాటాలకు సన్నద్ధం చేయడానికి గాను తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నిర్మాణ మహాసభలు డిసెంబర్ 22వ తేదీన నిర్వహించనున్నట్లు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.ప్రేం పవని, జంపాల రవీందర్ తెలిపారు. ఈ మహాసభలో మధ్యాహ్న భోజన వంట కార్మికుల సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా కార్యచరణను రూపొందించనున్నట్లు వారు వెల్లడించారు. రాష్ట్ర నిర్మాణ మహాసభల కంటే ముందు అన్ని జిల్లాలలో నిర్మాణ మహాసభలు నిర్వహించుకొని సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ఆర్‌యుబీ పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యేకు వినతి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : నిరంతర ట్రాఫిక్ సమస్యతో ప్రజలకు ఇబ్బందికరంగా మారిన వాజపేయి నగర్ రైల్వే క్రాసింగ్ వద్ద వీలయినంత త్వరగా ఆర్.యు.బి. నిర్మించాలని కోరుతూ వాజపేయి నగర్ యూత్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. డిఫెన్స్, రైల్వే చక్రబందంలో ఇరుక్కుపోయిన మల్కాజిగిరి ప్రజలకు ట్రాఫిక్ సమస్య కొరకరాని కొయ్యగా మారిందని, గత సంవత్సర కాలంగా ఆర్.యు.బి.లు నిర్మించి ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని ఆరాటపడుతున్న స్థానిక మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి చిత్తశుద్ధిని చూసి యువకులు కూడా వారికి తోడుగా నిలుస్తున్నారన్నారు. దశాబ్దాలుగా ప్రజలను ఇబ్బంది పెడుతున్న వాజపేయి నగర్ ట్రాఫిక్ సమస్యతో పాటు ఇతర రైల్వే క్రాసింగ్‌ల వద్ద కూడా ఈ సమస్యను పరిష్కరించాలని యువత ఎమ్మెల్యేను కోరింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ప్రచార సమయంలో తాను తెలుసుకున్న ప్రధాన సమస్య రైల్వే క్రాసింగ్‌ల వద్ద ట్రాఫిక్ సమస్య, నిత్యం ఈ ప్రాంతం నుండి ఉద్యోగాలకు, కళాశాలలకు, ఇతర పనుల కోసం బయటకి వెళ్లే వారికి ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారిందని, వారు సమయానికి చేరుకోలేక ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్నానని, అత్యవసర సమయాల్లో అంబులెన్స్ రావడం కూడా గగనంగా మారిన పరిస్థితిని మార్చాలనుకున్నానని, అందుకే ఆర్.యు.బిలు నిర్మించాలని ప్రయత్నాన్ని కొనసాగిస్తున్నట్లు ఆయన తెలిపారు. త్వరలోనే వాజపేయి నగర్‌తో పాటు గౌతమ్ నగర్ ఆర్.యు.బి. కూడా ప్రారంభం కానున్నాయని, రైల్వే అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లడంలో సఫలీకృతం అయ్యామన్నారు. త్వరలోనే పనులు మొదలు అయ్యే అవకాశాలున్నాయని ఆయన తెలిపారు.

రైతులను దగా చేస్తున్న కాంగ్రెస్

విశాలాంధ్ర - తుర్కయంజాల్ : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను దగా చేస్తుందని రంగారెడ్డి జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి కాంగ్రెస్ వైఖరి పై మండిపడ్డారు. ఆదివారం నియోజకవర్గంలోని శేరిగూడ మల్ శెట్టిగూడ ధాన్యం కల్లాల్లో రైతులను కలిసి సమస్యను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంచిరెడ్డి మాట్లాడుతూ ప్రభత్వం ధాన్యం కొనుగోళ్లు వెంటనే ప్రారంభించి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరోనా కష్టకాలంలో సైతం కేసిఆర్ సర్కార్ ఊరూరా వడ్లు కొని రైతులకు భరోసాని చ్చిందని అన్నారు. రైతుబంధు ఎగగొట్టి సగం మందికి రుణమాఫీ కీ పంగనామాలుపెట్టి రైతుభీమా ఊసుమరిచి, పంటల కొనుగోళ్లు యాళ్లతప్పించి, కరెంటును ఆగమాగంచేసి, ప్రాజెక్టులను పట్టించుకోకుండా కాంగ్రెస్ రాజ్యం రైతుద్రోహానికి పాల్పడుతున్నదని ఆయన ప్రభుత్వంపై తీవ్రంగా ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మెన్ సత్తు వెంకటరమణారెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు అల్వాల వెంకట్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ ఆకుల యాదగిరి, రైతుబంధు అధ్యక్షుడు మొద్దు అంజిరెడ్డి, సొసైటీ మాజీ వైస్ ఛైర్మెన్ క్యామ శంకర్, రైతు నాయకులు తదితరులు ఉన్నారు.

స్టెనో, టైపిస్ట్ ఉద్యోగానికి దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - హైదరాబాద్ : సిటీ సివిల్ కోర్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ హైదరాబాద్ కార్యాలయంలో స్టెనో, టైపిస్ట్ పోస్ట్ ఉద్యోగానికి అర్హులైన వారి నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి, సెక్రటరీ (ఎఫ్ఏసి) కే.కిరణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సిటీ సివిల్ కోర్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ హైదరాబాద్ కార్యాలయంలో జనరల్ కేటగిరీలో ఖాళీగా ఉన్న ఒక స్టెనో, టైపిస్ట్ పోస్ట్ డైరెక్ట్ రిక్రూట్మెంట్ ద్వారా నియమకానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

ఇతర వివరాల కోసం సిటీ సివిల్ కోర్ట్ అధికారిక వెబ్ సైట్ https:// hccc.dcourts.gov.in లో సంప్రదించవచ్చని ఈ సందర్భంగా కే.కిరణ్ కుమార్ తెలిపారు.

కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో కుటుంబ సభ్యులు సర్వే నిర్వహిస్తున్న అధికారులకు సహకరించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పొట్రు కోరారు. ఆదివారం నిజాంపేట్ బాచుపల్లిలో నిర్వహిస్తున్న సర్వేను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్యుమరేటర్లకు నిర్దేశిత ప్రొఫార్మాల నమోదులను కోడింగ్‌ను అత్యంత జాగరూకతతో నింపాలని, ఎన్యుమరేటర్లు పూరించిన ప్రొఫార్మాలలో ప్రత్యేకించి కోడింగ్‌ను సూపర్ వైజర్లు క్షుణ్ణంగా పరిశీలించాలని జిల్లా కలెక్టర్ గౌతం పొట్రు అన్నారు. ఇంటింటి సమగ్ర సర్వేలో ఎన్యుమరేటర్లు నిర్వహిస్తున్న కుటుంబాల వివరాల సేకరణను కలెక్టరు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏ విధంగా ప్రొఫార్మాలను నింపుతున్నారని ఎన్యుమరేటర్లు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎన్యుమరేటర్లు పూరించిన ప్రొఫార్మాలను క్షుణ్ణంగా పరిశీలించి ప్రొఫార్మాలలో నిర్దేశించిన చోట పుస్తకంలో ఇచ్చిన విధంగా కోడింగ్‌లను నింపాలని ఎన్యుమరేటర్లకు సూచించారు. తప్పులు జరుగకుండా జాగ్రత్తగా ప్రొఫార్మాలను పూరించాలని ఎన్యుమరేటర్‌లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట కార్పొరేటర్ విజయలక్ష్మి మున్సిపల్ కమిషనర్ షాబిర్ అలీ ఎమ్మార్వో పూల్ సింగ్ నోడల్ ఆఫీసర్ ఇందిరా సూపర్ వైజర్లు, ఎన్యుమరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ హక్కుల సాధనే ధ్యేయంగా పోరాడుతాం

విశాలాంధ్ర-బషీర్ బాగ్: ఓబీసీ హక్కుల సాధన ధ్యేయంగా పోరాడుతామని ఓబీసీ సెంట్రల్ కమిటీ చైర్ పర్సన్ ఎం. భాగ్యలక్ష్మి అన్నారు. ఆదివారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న మహిళా బిల్లును ప్రవేశపెట్టిన ఘనత ప్రధాని నరేంద్ర మోడీకి దక్కుతుందని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజా పాలనలో మహిళలకు భాగస్వామ్యం కల్పించాలని కోరారు. సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పోశం సునీత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సావిత్రిబాయి పూలేను జయంతిని అధికారికంగా నిర్వహించాలని, అలాగే ఆ మహనీయురాలు విగ్రహాన్ని అసెంబ్లీలో ప్రతిష్టించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సంఘం నూతన కార్యవర్గం ప్రకటించారు. సంఘం ఉద్యోగుల అధ్యక్షులుగా శ్రీనివాస్ గౌడ్, ఓబిసి సెంట్రల్ కమిటీ మహిళా రాష్ట్ర అధ్యక్షురాలుగా పోశం సునీత, ప్రధాన కార్యదర్శిగా కే పరమేష్, షెడ్యూల్ కులాల అధ్యక్షులుగా సాయిలు గా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో దానకర్ణాచారి, మాటూరి అశోక్, అర్చన, శ్రీనిధి, రజిత, రమ్య, మాధవి తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదుపై సమావేశం

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఎన్టీఆర్ భవన్‌లో పార్లమెంట్ పార్టీ అడ్‌హాక్ కమిటీ సభ్యుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎజెండా అంశాలుగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమ కార్యాచరణపై చర్చ, పార్లమెంట్ సమావేశాల తేదీలను ఖరారు చేయడం, క్షేత్రస్థాయిలో సభ్యత్వ నమోదులో వస్తున్న సాంకేతిక సమస్యలను చర్చించి పరిష్కరించే మార్గాలు చర్చించారు. సభ్యత్వ కార్యక్రమంపై సలహాలు, సూచనలను నాయకుల నుంచి తీసుకున్నారు. అంతకు ముందు తెలుగుదేశం పార్టీ నాయకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న పొలిట్‌బ్యూరో సభ్యులు, జాతీయ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు మాట్లాడుతూ సభ్యత్వ నమోదు కార్యక్రమం కొరకు ప్రతి ఒక్కరు ఇంటింటికి వెళ్లి సభ్యత్వ నమోదును చేయించాల్సిన అవసరముందన్నారు. పార్టీలో చాలా మంది కష్టపడి పని చేసేవారు ఉన్నారని, ఓపికగ్గా, అందరినీ కలుపుకుని పోవాల్సిన అవసరముందని, 2014లో టీడీపీ తరపున గెలిచిన 15 ఎమ్మెల్యేలలో 13 మంది పార్టీని వీడి వెళ్లిపోయారని, తరువాత ఎన్నికలలో గెలిచిన ఇద్దరు ఎమ్మెల్యేలు పార్టీని వీడి వెళ్లిపోయారన్నారు. పార్టీని వీడి వెళ్లిపోయిన వారికంటే పార్టీలో ఉన్న వారు వెయ్యి రెట్లు గొప్పవాళ్ళని, పార్టీలోకి వచ్చే వారిని ఆహ్వానిస్తున్నామన్నారు. జాతీయ పార్టీ అధ్యక్షులు చంద్రబాబు ఏ నిర్ణయం తీసుకున్నా దానిని మనమందరం పాటించవల్సిందేనని ఆయన తెలిపారు. నారా లోకేష్ నాయకత్వంలో దేశంలోనే మొట్టమొదటిసారిగా ఇన్సూరెన్స్‌ను ప్రారంభించిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని, కష్టపడి పని చేసివారికే ప్రాధాన్యత ఉంటుందని, సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పార్లమెంట్ పార్టీ కన్వీనర్లకు కార్యకర్తలు సహకరించాలన్నారు. పొలిట్‌బ్యూరో సభ్యులు అరవింద్ కుమార్‌గౌడ్, జాతీయ పార్టీ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త కంభంపాటి రామమోహన్, జాతీయ పార్టీ క్రమ శిక్షణ కమిటీ సభ్యులు, బంటు వెంకటేశ్వర్లు, జాతీయ పార్టీ అధికార ప్రతినిధి, టిటిడి బోర్డు సభ్యులు, నన్నూరి నర్సిరెడ్డిలు మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలని ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని ప్రారంభించారని అన్నారు. ఈ పార్టీలో మాత్రమే బీదవాడు ఎమ్మెల్యే అవుతాడని గ్రామస్థాయి నుంచి మెంబర్‌షిప్‌ను ఏవిధంగా ముందుకు తీసుకెళ్లాలి, సాంకేతికంగా వస్తున్న సమస్యలపై అవగాహన కొరకు టెక్నాలజీతో అనుసంధానం చేసుకుని ముందుకు తీసుకెళ్లడం వంటి వాటిపై అవగాహన కొరకు ఈ వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. ఒక రూపాయితో తెలుగుదేశం పార్టీ సభ్యత్వం ప్రారంభమైందని అన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ, కౌన్సిలర్ వంటి స్థానిక సంస్థలలో గెలవాలంటే మెంబర్‌షిప్ కార్యక్రమం ఒక మంచి తరుణం. పెద్ద ఎత్తున మెంబర్‌షిప్‌ను విజయవంతం చేయాలన్నారు. జాతీయ అధ్యక్షుల వారి ఆదేశాల మేరకు పార్లమెంట్ స్థాయిలో అడ్‌హాక్ కమిటీలను ఏర్పాటు చేసుకుని గ్రామస్థాయి నుంచి సభ్యత్వం చేయాలని సంకల్పించుకున్నామన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అందరూ క్షేత్రస్థాయిలో ఉండాలనేదే చంద్రబాబు ఆలోచన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, కాట్రగడ్డ ప్రసూన, కూరపాటి వెంకటేశ్వర్లు, మీడియా కమిటీ చైర్మన్ ప్రకాష్ రెడ్డి, కనగాల సాంబశివరావు, మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య, డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, అజ్మీరా రాజు నాయక్, జివిజి నాయుడు, షేక్ ఆరిఫ్, పార్లమెంట్ అడ్‌హాక్ కమిటీ కన్వీనర్లు కొండపల్లి రాంచందర్ రావు, కుందారపు కృష్ణాచారి, ఇల్లెందు రమేష్, గుళ్లపల్లి ఆనంద్, సంజయ్, వంచె శ్రీనివాస్ రెడ్డి, కట్టా వెంకటేష్ గౌడ్, అర్షనపల్లి విద్యాసాగర్‌రావు, రాష్ట్ర పార్టీ నాయకులు పోలంపల్లి అశోక్, పర్లపల్లి రవీందర్, హరికృష్ణ, కె.గోపి, పొగాకు జయరాం చందర్, ముంజా వెంకట్రాజం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మాస సమారాధనలో పాల్గొన్న మేయర్

విశాలాంధ్ర - మేడిపల్లి: బోడుప్పల్ నగరపాలక సంస్థ పరిధిలోని 21 డివిజన్ బ్రాహ్మణభవన్ లో అఖిల బ్రాహ్మణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నిర్వహించిన కార్తీక మాస సమారాధన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి, మేయర్ తోటకూర అజయ్ యాదవ్, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, స్థానిక కార్పొరేటర్ భూక్య సుమన్, పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అఖిల బ్రాహ్మణ సమితి అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసరావు, నందకుమార్ జోషి, పూజారి సత్యం పంతులు, బ్రాహ్మణ సంఘ నాయకులు, బ్రాహ్మణ కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యల సాధనకై పోరాటాలకు సిద్ధం కండి

ఏఐటీయూసీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రభుత్వ ఆసుపత్రులలో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషంట్ కేర్ సూపర్వైజర్ కార్మికులు సమస్యల సాధనకై దశలవారీ సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి సురేష్ పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ మాసోత్సవాలలో భాగంగా ఆదివారం ఆత్మకూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషంట్ కేర్ సూపర్వైజర్ కార్మికుల సమస్యలపై మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నేతృత్వంలో కార్మిక సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా పి.సురేష్ మాట్లాడుతూ కనీస వేతన చట్టాలు ఉన్నా పారదర్శకత లేని విధానాలు, అలసత్వ పర్యవేక్షణలతో చట్టాలు దోపిడి వర్గాలకు చుట్టాలుగా మారి నీరుగారిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక సర్వేలో కార్మికుల అనేక సమస్యలు వెలుగులోకి వస్తున్నాయని అన్నారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించడం లేదని, పిఎఫ్ కార్మికుల వాటిలోనే యాజమాన్యం వాట కూడా చెల్లించినట్లు చూపిస్తున్నారని అన్నారు. ఏజెన్సీ నిర్వహణ తీసుకొని రెండు సంవత్సరాల గడుస్తున్న నేటికీ ఈఎస్ఐ కార్డులు కూడ ఇవ్వలేదని దీనితో ఈఎస్ఐ స్కీం కింద కార్మికులకు అందవలసిన ఆరోగ్య భీమతో పాటు ఇతర సదుపాయాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆరు నెలలకు ఒకసారి కార్మికులకు యూనిఫామ్స్, భద్రత సామాగ్రి అందజేయాల్సి ఉన్న అందజేయడం లేదని చిరిగిన యూనిఫామ్ బట్టలతో కార్మికులు అగౌరవ పాలవుతున్నారని అన్నారు.

ఆత్మకూర్ ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్ర శానిటరీ వెంకటయ్య ఏజెన్సీ నెలల తరబడి వేతనాలు చెల్లించకుండా పెండింగ్‌లో ఉంచుతున్నారన్నారు. ఇప్పటికే కార్మికులకు నాలుగు నెలల జీతాలు చెల్లించలేదని అన్నారు. మూడు నెలల వేతనాలు చెల్లించకుండానే ఏజెన్సీ కాంట్రాక్టర్ చెల్లించినట్లు దబాయిస్తూ కార్మికుల కష్టార్జితాన్ని కొల్లగొట్టే కుట్రలు చేస్తున్నారని దీనిపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సమగ్ర విచారణ జరిపి కార్మికులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి కార్మికులు బ్రాంచ్ ఏఐటీయూసీ మెడికల్ యూనియన్ నేతలు, కార్మికులు ఎండి సత్తార్ బాలకృష్ణ అరుణ్, బాలకిష్టమ్మ, పార్వతమ్మ చెన్నమ్మ, బాలకిష్టమ్మ, బాలరాజ్, శ్రీకాంత్, మైనొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌ను తరిమికొడదాం...

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ శేరిలింగంపల్లి నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో డ్రగ్స్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఆదివారం ఉదయం హైటెక్ సిటీ చౌరస్తాలో సీపీఐ శేరిలింగంపల్లి కార్యదర్శి రామకృష్ణ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారిన, వచ్చినా కొత్త ప్రభుత్వాలు మొదలు మన రాష్ట్రంలో డ్రగ్స్‌ను లేకుండా రూపుమాపుతామని గొప్పలు చెప్పుకుంటారన్నారు. రాష్ట్రంలో ఇప్పటికీ డ్రగ్స్ ఏరులై పారుతుందన్నారు. సి.ఆర్ ఫౌండేషన్ డాక్టర్ రజనీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ విదేశాల నుంచి ఇతర రాష్ట్రాల నుంచి హైదరాబాద్ మహానారానికి డ్రగ్స్ సరఫరా విచ్చలవిడిగా సాగుతోందని, నిమ్మకు నీరు వచ్చినట్టు ప్రభుత్వాలు వివరిస్తా ఉన్నాయని, డ్రగ్స్ మహమ్మారికి బలైన కుటుంబాలు రోడ్డునపడి రోదిస్తున్నాయని, తల్లిదండ్రులు పిల్లలపై ఎన్నో ఆశలు పెట్టుకొని డ్రగ్స్‌కు బానిసలైన పిల్లలు చూసి అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కె.చందు యాదవ్, డిహెచ్పిఎస్ రాష్ట్ర సహాయ కే.వెంకటస్వామి, కే.ఖాసీం, సుధాకర్ ప్రజానాట్యమండలి, ఏఐవైఎఫ్. శేర్లింగంపల్లి అధ్యక్షులు జె శ్రీనివాస్, కార్యదర్శి కే శివకుమార్, ఏఐఎస్ఎఫ్ అధ్యక్షులు కార్యదర్శి, జై ధర్మ తేజ, టి.నితీష్. ఎం అశోక్, గణేష్ పాల్గొన్నారు.

అందుబాటు ధరలకే వైద్యం అందించాలి

విశాలాంధ్ర - కూకట్‌పల్లి: బీద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండే ధరలకు వైద్య సేవలు అందించాలని శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని వివేకానంద నగర్ ప్రధాన రహదారిలో నూతనంగా ఏర్పాటు చేసిన బండారు మల్టి స్పెషలిటీ ఆసుపత్రి ప్రారంభానికి

ముఖ్యఅతిధిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న కాలుష్యం, కలుషితంతో కూడిన తిను బండారాల కారణంగా యుక్త వయస్సులోనే గుండె జబ్బులు ఇతర రోగాల బారిన పడుతున్నారని, శరీరానికి కావలసిన వ్యాయమాలు, కొవ్వు పదార్థాలను తగ్గించుకోవాలని సూచించారు. ఆసుపత్రి ఏర్పాటు చేసిన నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలుపుతూ ప్రజలకు అందుబాటు ధరలకు వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి యాజమాన్యం, సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ భద్రతపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - జూబిలీహిల్స్ : ట్రాఫిక్ భద్రతపై అవగాహన కల్పించే దిశగా హెూండా మోటర్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా (హెచ్ఎంఎస్ఐ) ఆదివారం తెలంగాణలోని హైదరాబాద్‌లో కీలకమైన రోడ్ సేఫ్టీ సదస్సును నిర్వహించింది. ఈ కార్యక్రమం, హెచ్ఎంఎస్ఐ కొనసాగుతున్న ప్రాజెక్ట్ - మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ఫర్ అవర్ ఫ్యూచర్ జనరేషన్ కీలక కార్యక్రమం, చిన్న వయస్సు నుండే రహదారి భద్రతా స్పృహను పెంపొందించడంలో సంస్థ అంకితభావాన్ని నొక్కి చెబుతుంది. హైదరాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాలలకు ప్రాతినిధ్యం వహిస్తున్న 100 కి పైగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఈ సదస్సులో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులు రజిత, సెక్టోరల్ ఆఫీసర్, ఎడ్యుకేషన్, హైదరాబాద్ జిల్లా, తెలంగాణ, కధిరవన్ పళని, ఐఏఎస్ అదనపు జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్, హైదరాబాద్ జిల్లా, తెలంగాణ, బానోత్ వెంకటేశ్వర్లు, ఉప విద్యాశాఖాధికారి, నాంపల్లి జోన్, హైదరాబాద్ జిల్లా, తెలంగాణ, హర్‌ప్రీత్ సింగ్, జనరల్ మేనేజర్-సేఫ్టీ రైడింగ్ విభాగం, కార్పొరేట్ వ్యవహారాలు, హెచ్ఎంఎస్ఐ కూడా పాల్గొన్నారు. హెచ్ఎంఎస్ఐ గ్లోబల్ సేఫ్టీ స్లోగన్ 'అందరికీ భద్రత' ద్వారా ఈ ప్రత్యేకంగా తీర్చిదిద్దబడిన వయస్సు-నిర్దిష్ట మాడ్యూల్స్ పాఠశాల పాఠ్యాంశాలలో విలీనం చేయడానికి ఉద్దేశించబడ్డాయి. విద్యార్థులకు అవసరమైన రహదారి భద్రత పరిజ్ఞానం నైపుణ్యాలను అందిస్తాయి. ఎడతెగని ప్రయత్నాలతో, హెచ్ఎంఎస్ఐ ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 9 రోడ్డు భద్రతా సమావేశాలను విజయవంతంగా నిర్వహించింది. అవి ఇప్పటికే 1200 పాఠశాలలకు పైగా చేరాయి. దేశవ్యాప్తంగా 3 లక్షల మందికి పైగా విద్యార్థులకు రోడ్డు భద్రతా అవగాహన విద్యనందించాయి. ఈ విజయాల ఆధారంగా, హెచ్ఎంఎస్ఐ రాబోయే నెలల్లో మరిన్ని నగరాలకు తన రహదారి భద్రతా కార్యక్రమాలను విస్తరించేందుకు సిద్ధంగా ఉంది.

ఘనంగా భారీ హనుమాన్ విగ్రహ శంకుస్థాపన

విశాలాంధ్ర - కాప్రా : హనుమాన్ విగ్రహ నిర్మాణ సమితి, బజరంగ్దళ్ కుషాయిగూడ సంయుక్త ఆధ్వర్యంలో కుషాయిగూడ బస్ స్టాప్ వద్ద నిర్మించ తలపెట్టిన భారీ హనుమాన్ విగ్రహ భూమి పూజ, శంకుస్థాపన కార్యక్రమం ఆదివారం ఉదయం అత్యంత భక్తి శ్రద్ధలతో, ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజ మహెూత్సవాల్లో స్థానిక శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్, స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు. ముందుగా హనుమాన్ విగ్రహ నిర్మాణ సమితి, బజరంగ్దళ్ కార్యకర్తలు కుషాయిగూడ శివాంజనేయ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, శంకుస్థాపన పూజా సామాగ్రిని భాజా భజంత్రీ వాయిద్యాల నడుమ బస్‌స్టాప్‌లోని హనుమాన్ గద్దె వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం గోవు పూజ నిర్వహించి గోమాతకు వస్త్రం సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు భారీ హనుమాన్ విగ్రహ నిర్మాణానికి విరాళాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి ధన్పాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ కాసుల రవీందర్ గౌడ్, గణేష్ ముదిరాజ్, కాసుల సురేందర్ గౌడ్, కంసాని సీతారాం రెడ్డి, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, హనుమాన్ నిర్మాణ సమితి కమిటీ సభ్యులు, కుషాయిగూడ గ్రామస్తులు, హనుమాన్ భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాపోలు రాములు జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - మేడిపల్లి : మేడ్చల్ నియోజకవర్గం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కాలనీ సంక్షేమ సంఘం సమైక్య చైర్మన్ రాపోలు రాములు జన్మదినం సందర్భంగా ఆదివారం మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, మేడ్చల్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి,

రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్‌తో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు పోగుల నర్సింహా రెడ్డి, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మహిళా అధ్యక్షురాలు సంత యాదవ్, కార్పొరేటర్లు సింగిరెడ్డి పద్మారెడ్డి, బొమ్మకు కళ్యాణ్, రసాల వెంకటేష్ యాదవ్, చీరాల నరసింహ, నాయకులు దాన గళ్ళ యాదగిరి, నత్తి మైసయ్య, వివిధ కాలనీల అధ్యక్ష, కార్యదర్శులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం కృషి

విశాలాంధ్ర - కొత్తూరు : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ వారి ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, షాద్ నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్" అన్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా, షాద్‌నగర్ నియోజకవర్గం, కేశంపేట, కొత్తూరు, నందిగామ మండలాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన 100

శాతం ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మత్స్యకారుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేప పిల్లలను కొనుగోలు చేసి 100 శాతం రాయితీపై చేప పిల్లలను చెరువులు, కుంటలలో విడుదల చేస్తుందన్నారు. నియోజకవర్గంలోని ఆయా చెరువుల్లో పోసిన చేప పిల్లల ఎదుగుదలకు మత్స్యకారులు కృషి చేయాలని కోరారు. మత్స్యకారులకు చేపల వేటతో ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా కూడా ప్రతి నియోజకవర్గంలో లక్షలాది చేప పిల్లలను విడుదల చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం పాటుపడుతుందని అన్నారు.

కొత్తూరులో మత్స్యశాఖ జిల్లా అధికారి పూర్ణిమ పాల్గొని చేప పిల్లలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, కొత్తూరులో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు గొంగొళ్ల హరినాథ్ రెడ్డి, నాయకులు విరమోని దేవేందర్ ముదిరాజ్, అంబటి ప్రభాకర్, శేఖర్ రెడ్డి, దయానంద్ గుప్త, దేవేందర్ యాదవ్, జంగయ్య, సురేష్, డోలి రవీందర్, లక్ష్మయ్య, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కుమ్మర కార్తిక వనభోజన కార్యక్రమంలో ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్ : మట్టికి ప్రాణం పోసే గొప్పవారే శాలివాహనులని ఎమ్మెల్యే కేపీ వివేకానంద పేర్కొన్నారు. ఆదివారం నియోజకవర్గం 128 - చింతల్ డివిజన్ హెచ్ఎంటి కాలనీలో నిర్వహించిన కుమ్మర కార్తీక వనభోజన కార్యక్రమానికి ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ మట్టికి ప్రాణం పోస్తూ కుండలను తయారు చేయడమే కాదు, కధన రంగంలో తమ పరాక్రమాన్ని చాటిన వంశం శాలివాహన వంశమని తెలిపారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జగద్గిరిగుట్ట శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, కుమ్మర సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కాజ్గిరి దయానంద్, ఉపాధ్యక్షులు వీరేశం, కుత్బుల్లాపూర్ నియోజక వర్గం కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు రాజవరపు శివన్నారాయణ, అధ్యక్షులు బాపనపల్లి నాగేశ్వరరావు, జనరల్ సెక్రటరీ రాపోలు సత్యనారాయణ, ఉపాధ్యక్షులు రాజవరపు శివప్రసాద్, కాశయ్య, కోశాధికారి రాజు, సంయుక్త కార్యదర్శి రాధాకృష్ణ, శాలివాహన కుల బాంధవులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజావాణి రద్దు : కలెక్టర్ గౌతం

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో జిల్లా యంత్రాంగం, జిల్లా అధికారులు సర్వేలో విధులు నిర్వహిస్తున్న సందర్భంగా సోమవారం కలెక్టరేట్లో నిర్వహించవలసిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం పొట్రు ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్టి విషయాన్ని జిల్లా ప్రజలందరూ గమనించాలని కలెక్టర్ గౌతం పొట్రు ఈ సందర్భంగా కోరారు.

వాష్ అండ్ గో కార్ డిటైలింగ్ స్టూడియో ప్రారంభం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : చందానగర్ డివిజన్ పరిధిలోని కేఎస్ఆర్ ఎన్‌క్లేవ్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన వాష్ అండ్ గో కార్ డిటైలింగ్ స్టూడియోను మియాపూర్ ఏసీపీ

నర్సింహరావు, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డితో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్న పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నిర్వహకులు సౌజన్య, నాయకులు అన్వర్ షరీఫ్, దాత్రి నాథ్ గౌడ్, కనికి రెడ్డి, కాజా, రామారావు, చంద్రశేఖర్, సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తి ఎమ్మెల్యేకు నాయకుల స్వాగతం

విశాలాంధ్ర - ఆమనగల్లు : విదేశీ పర్యటన విజయవంతంగా ముగించుకొని వచ్చిన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి ఆదివారం శంషాబాద్ ఎయిర్ పోర్ట్ కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికారు. 6 రోజులుగా విదేశీ పర్యటన అనంతరం వచ్చిన ఆయనకు నాయకులు పూల మొక్కలు అందించి శాలువాలతో సత్కరించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో కేఎస్ఆర్ యువసేన బాబా, విజయ్ రాథోడ్, జగన్, రమేశ్, శివ పాల్గొన్నారు.

సమగ్ర సర్వేలో ఇళ్ల జాబితా పూర్తి : కలెక్టర్

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా ఇండ్ల జాబితాను పూర్తి చేయడం జరిగిందని, శనివారం నుండి కుటుంబ వివరాల సేకరణను ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. సమగ్ర కుటుంబ సర్వే పై శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా ప్రతినిధులు సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహణకు 3970 ఎన్యుమరేషన్ బ్లాక్ లను ఏర్పాటు చేశామని, ఇందులో గ్రామీణ ప్రాంతంలో 3131, పట్టణ ప్రాంతంలో 839 ఎన్యుమరేషన్ బ్లాక్లు ఉన్నాయని చెప్పారు. 3832 మంది ఎన్యుమరేటర్లు,386 మంది సూపర్వైజర్ లను నియమించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో మొత్తం 5 లక్షల 3411 ఇండ్లను గుర్తించడం జరిగిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే చారిత్రక కార్యక్రమామని, భవిష్యత్తులో సమగ్ర కుటుంబ సర్వే ద్వారా సేకరించిన డేటా వివిధ కార్యక్రమాలను

సవ్యంగా నిర్వహించేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. సర్వే కోసం ఎన్యుమరేటర్లు ఇంటికి వచ్చినప్పుడు ప్రజలు ఆధార్, ధరణి, బ్యాంక్ అకౌంట్ పాస్‌బుక్ వంటివి సిద్ధంగా ఉంచుకోవాలని, దీని వల్ల ఎలాంటి ఇబ్బంది లేదని, సమగ్ర కుటుంబ సర్వే సమాచారం అంతటిని గోప్యంగా ఉంచడం జరుగుతుందని, ఎవరికి ఈ సమాచారాన్ని ఇవ్వడం జరగదని, అలాగే ప్రశ్నల ద్వారా సేకరించిన వివరాలను జాగ్రత్తగా భద్రపరచడం జరుగుతుందని, అన్ని వివరాలు డేటా ఎంట్రీ నమోదు చేసి భద్రపరుస్తామని తెలిపారు. ఇందుకు మండల, మున్సిపల్ స్థాయిలలో అందుబాటులో ఉన్న సుమారు 2,835 డేటా ఎంట్రీ ఆపరేటర్లను గుర్తించామని, అవసరమైతే మరి కొంతమందిని గుర్తిస్తామని చెప్పారు. ఎన్యుమరేటర్లు దగ్గరుండి డేటా ఎంట్రీ చేయిస్తారని చెప్పారు. సమగ్ర కుటుంబ సర్వే వివరాలకు ఇంక్రిప్షన్ కోడ్ ఉంటుందని, అందువల్ల ఈ వివరాలన్నీ ఆటోమేటిగగా గోప్యంగా ఉంటాయన్నారు. సర్వేకు సంబంధించి ప్రజలను ప్రభుత్వం ఇలాంటి ఓటిపి చెప్పమని అడగడం, లేదా లింకు పంపించడం వంటివి ప్రభుత్వం తరఫున చేయదని ,బ్యాంక్ ,ఆధార్ నంబర్ల వల్ల ఎలాంటి దుర్వినియోగం కాదని స్పష్టం చేశారు. సమగ్ర కుటుంబ సర్వే వివరాలు సూక్ష్మస్థాయిలో పనికి వస్తాయని, అన్ని రెసిడెన్షియల్ ఆవాసాలలో వీటిని సేకరించడం జరుగుతుందని, శాస్త్రయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి అందరూ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మీడియా ప్రతినిధుల సమావేశానికి సమాచార శాఖ సహాయ సంచాలకులు యు. వెంకటేశ్వర్లు, ఆర్డిఓ అశోక్ రెడ్డి, సిపిఓ వెంకటేశ్వర్లు ,మున్సిపల్ కమిషనర్ ముసాబ్ అహ్మద్, తదితరులు హాజరయ్యారు.

నిధులు లేక కుంటుపడిన మానుకోట మున్సిపాలిటీ

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్ : మానుకోట మున్సిపాలిటీలో నిధులు లేక అభివృద్ధి పనులు కుంటుపడుతుందని సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్ సారధి రెడ్డి అన్నారు. ఆదివారం భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ

ఆధ్వర్యంలో స్థానిక మున్సిపాలిటీ పరిధిలో తొమ్మిదో వార్డు విలీన గ్రామం శనగపురంలో సిపిఐ నాడు కెసిఆర్ వార్డుకు ఇస్తానన్న 50 లక్షల శాంక్షన్ చేస్తానని చెప్పిన ఇంతవరకు పనులు జరగకపోవడంతో ఆందోళన నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మానుకోట అభివృద్ధి కుంటూ పడడానికి ప్రధాన కారణం నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం మాజీముఖ్యమంత్రి కేసీఆర్, నాటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ లే కారణమని అన్నారు. పదేండ్ల టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మానుకోట అభివృద్ధికి ఒక్క పైసా కూడా రాలేదని అన్నారు. 36 వార్డులు మరియు విలీన గ్రామాలు అంతర్గత రోడ్లు, అంతర్గత సీసీ ,డ్రైనేజీలు లేక ఎక్కడి గొంగడి అక్కడే వేసి ఉన్నదని అన్నారు. సీసీ రోడ్లు సిసి డ్రైనేజీలు, ఇతర అభివృద్ధి లేక ప్రజలు టిఆర్ఎస్ పాలనను అంతమొందించారన్నారు. నూతనంగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా మానుకోట జిల్లాకు నిధులు కేటాయించి, అభివృద్ధి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పెరుగు కుమార్, దేశపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, వెలుగు శ్రావణ్, మేక వీరన్న, కేదాసు రమేష్, మాలోతు రవీందర్, చిధిరాల జ్ఞానేశ్వర్, మంద శంకర్, తండా శ్రీనాథ్, ఆలేటి మహేష్, వీరేందర్, నక్క నాగార్జున, బీదర్, తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ సెంట్రల్ కమిటీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా కడ్లేకర్ పరమేశ్

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : ఓబిసి సెంట్రల్ కమిటీ జాతీయ ప్రధాన కార్యదర్శి కడ్లేకర్ పరమేశ్‌ను నియమిస్తూ ఓబీసీ సెంట్రల్ కమిటీ

చైర్పర్సన్ ఎం.భాగ్యలక్ష్మి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కే పరమేష్ మాట్లాడుతూ వెనుకబడిన కులాలకు అండగా ఉండాలన్నారు. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగంలో ఓబీసీ కోటలో అత్యధిక రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సంఘం బలోపేతం కోసం తన వంతుగా నిరంతరం కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా తనపై నమ్మకంతో జాతీయ ప్రధాన కార్యదర్శి నియమించిన చైర్మన్ భాగ్యలక్ష్మికి కృతజ్ఞతలు తెలిపారు.

పోలవరం నిర్వాసితుల కోసం పోరు

నవంబరులో తహసీల్దారు కార్యాలయాల వద్ద ధర్నాలు

జేవీ సత్యనారాయణమూర్తి

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: పోలవరం ప్రాజెక్టు నిధుల కోసం, నిర్వాసితుల పునరావాసం, ప్యాకేజీ తదితర సమస్యల పరిష్కారం కోసం ఆయా మండలాల తహసీల్దారు కార్యాలయాల ఎదుట నవంబరులో నిరసనలు, ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించి... వినతిపత్రాలు సమర్పించాలని సీపీఐ రాష్ట్ర సహాయకార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి పిలుపునిచ్చారు. డిసెంబరు 10న ఏడు మండలాల నిర్వాసితుల సదస్సు ఏటపాకలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. భద్రాచలంలో పోలవరం ముంపు మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కందుకూరి స్వర్ణలత అధ్యక్షతన ఆదివారం జరిగింది. జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ నిర్వాసితుల సమస్యలపై సీపీఐ పోరాటాల్లో అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి ఆందోళనలు తప్పదని చెప్పారు. తెలుగు ప్రజల జీవనాడి పోలవరం ప్రాజెక్టును కేంద్రమే నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు కోసం కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు నిర్వాసితులకు కొండంత అండగా సీపీఐ ఉంటుందని అన్నారు. డిసెంబరు 10న ఏటపాకలో జరిగే ముంపు మండలాల సదస్సులో కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు పూర్తయితే 7.20 లక్షల ఎకరాలకు సాగునీరు, 960 మెగావాట్ల విద్యుత్ లభ్యమవుతుందన్నారు. 26 జిల్లాలు అభివృద్ధికి పోలవరం ప్రాజెక్టు దోహదపడుతుందన్నారు. ఇలాంటి ప్రాజెక్టు కోసం భూములిచ్చిన రైతుల పట్ల పాలకులకు చిత్తశుద్ధి లేకపోవడం విచారకరమన్నారు. నిర్వాసితులకు న్యాయమైన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్, ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, రాష్ట్ర సమితి సభ్యులు ఎండీ మునీర్, ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కారం దారయ్య, సీపీఐ కుక్కునూరు, వేలేరుపాడు మండలాల కార్యదర్శులు మైసాక్షి వెంకటాచారి, బాడిస రాము, జిల్లా సమితి సభ్యులు కొన్నె లక్ష్మయ్య, అయితా సురేశ్, వరకా శ్యామల, రామవరం సర్పంచ్ పిట్టా ప్రసాద్, మడివి కామయ్య, కురిమెళ్ల వెంకటేశ్వరరావు, కరటం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-2 మెయిన్స్ ఫిబ్రవరికి వాయిదా ?

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) గ్రూప్-2 మెయిన్ పరీక్షకు ఆటంకాలు తప్పడం లేదు. ఈ పరీక్షను ఫిబ్రవరి 23న నిర్వహించాలని ఏపీపీఎస్సీ యోచిస్తున్నట్లు సమాచారం. దీనిపై ప్రభుత్వాన్ని సంప్రదించి అధికారిక ప్రకటన విడుదల చేయనున్నట్లు తెలిసింది. వచ్చే ఏడాది జనవరి 5వ తేదీన గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష నిర్వహణకు సంబంధించిన షెడ్యూలును ఏపీపీఎస్సీ విడుదల చేసింది. దీంతో నిరుద్యోగులంతా పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. డీఎస్సీ-2024 నోటిఫికేషన్, వాటి పరీక్షా కేంద్రాల గుర్తింపు, అభ్యర్థుల సన్నద్ధతను దృష్టిలో పెట్టుకొని ఈ తేదీ నిర్ణయించినట్లు ఏపీపీఎస్సీ గతంలో వెల్లడించింది. డీఎస్సీ నోటిఫికేషన్ వాయిదా పడడంతో పాటు అభ్యర్థుల నుంచి వస్తున్న వినతుల మేరకు గ్రూప్-2 ప్రధాన పరీక్ష తేదీని జనవరి 5వ తేదీ నుంచి ఫిబ్రవరి 23వ తేదీకి మార్చేందుకు ఏపీపీఎస్సీ నిర్ణయించినట్లు తెలుస్తోంది. వరుస వారీగా పోటీ పరీక్షలకు అభ్యర్థులు సన్నద్ధం కావడం కష్టమవుతుండటంతో ఏపీపీఎస్సీ ఈ నిర్ణయం తీసుకునే అవకాశముంది. నిత్యం వాయిదాల పర్వం కొనసాగుతున్న ఏపీపీఎస్సీ పరీక్షలపై అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.

50 నియోజకవర్గాలకు కాంగ్రెస్ సమన్వయకర్తలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని 50 నియోజకవర్గాలకు కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తలను నియమించింది. ఈ మేరకు పార్టీ అధ్యక్షులు షర్మిల ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే జిల్లా, నగర అధ్యక్షులను ప్రకటించిన విషయం విదితమే. పీసీసీ రాష్ట్ర కార్యవర్గంలోను కీలక మార్పులు చేసింది. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు షర్మిల ముందుకు సాగుతున్నారు.

కిడ్నీ వ్యాధితో ఒకరి మృతి

విశాలాంధ్ర-ఏ కొండూరు: ఎన్టీఆర్ జిల్లా ఏ.కొండూరు మండలం చైతన్యనగర్ తండాకు చెందిన బాణావత్ రామ్ జీ(60) కిడ్నీ వ్యాధితో ఆదివారం చనిపోయాడు. కొంతకాలంగా ఆయన కిడ్నీ సమస్యతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విజయవాడలోని ప్రైవేట్ వైద్యశాలలో ఆయనకు వైద్యం చేపిస్తున్నట్లు వెల్లడించారు. రామ్‌జీకి భార్య, కుమారులు ఉన్నారు. తన తండ్రి ఆరోగ్య నిమిత్తం లక్షలాది రూపాయలు ఖర్చు చేసినా ఫలితం దక్కలేదని కుమారులు, భార్య కన్నీరు మున్నీరుగా విలపించారు.

ఎన్‌కౌంటర్‌లో సైనికాధికారి మృతి

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో మరోసారి ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. కిష్త్వార్ జిల్లాలోని మారుమూల అటవీ ప్రాంతంలో ఉగ్రవాదులతో ఆదివారం జరిగిన కాల్పుల్లో సైనికాధికారి ఒకరు ప్రాణాలు కోల్పోగా, ముగ్గురు జవాన్లు గాయపడ్డారని అధికారులు తెలిపారు. ఇటీవల ఇద్దరు విలేజ్ డిఫెన్స్ గార్డ్‌లను (వీడీజీ) హతమార్చిన తర్వాత గాలింపు చర్యలను ముమ్మరం చేశామన్నారు. అధ్వరి నుంచి ఇద్దరు గ్రామ రక్షణ సిబ్బందిని ఉగ్రవాదులు కిడ్నాప్ చేసి గురువారం కాల్చి చంపారు. అదే ఉగ్రవాదులు భద్రతా దళాలకు చిక్కినట్లు కిష్త్వార్ పోలీసులు ధ్రువీకరించారు. వీడీజీలు నజీర్ అహ్మద్, కుల్దీప్ కుమార్ బుల్లెట్‌తో కూడిన మృతదేహాలు కనుగొనబడిన ప్రదేశానికి కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉన్న కేష్వాన్ అడవులలో సైన్యం, పోలీసుల సంయుక్త శోధన పార్టీలు ఉగ్రవాదులను అడ్డగించడంతో ఉదయం 11 గంటలకు ఎన్‌కౌంటర్ జరిగింది. గురువారం సాయంత్రం కుంత్వారా, కేష్వాన్ అడవుల్లో ఉగ్రవాదులు వీడీజీలను అపహరించి హత్య చేసిన తర్వాత భారీ గాలింపు చర్యలు చేపట్టారు. సైన్యానికి చెందిన జమ్మూలోని వైట్ నైట్ కార్ప్స్ ఒక 'ఎక్స్' పోస్ట్‌లో ఇలా పేర్కొంది. 'ఉగ్రవాదుల ఉనికికి సంబంధించి నిర్దిష్ట నిఘా వర్గాల సమాచారం ఆధారంగా కిష్త్వార్‌లోని జనరల్ ఏరియా ఛార్ట్ రిడ్జ్‌లో భద్రతా బలగాలు సంయుక్త ఆపరేషన్ చేపట్టాయి. ఇదే ఉగ్రవాద గ్రూప్ ఇద్దరు అమాయక గ్రామస్తులను (గ్రామ రక్షణ గార్డులు) అపహరించి చంపారు. ఆ ఉగ్రవాదులు ఎదురవడంతో కాల్పులు జరిగాయి' అని తెలిపింది. ఎన్‌కౌంటర్‌లో తొలుత జేసీవో సహా నలుగురు సైనిక సిబ్బంది గాయపడ్డారని, చికిత్స పొందుతూ జేసీవో ప్రాణాలు కోల్పోయారని పేర్కొంది. 'కేష్వాన్ కిష్త్వార్‌లో ఉగ్రవాదులు, భద్రతా బలగాల మధ్య ఎన్‌కౌంటర్ ప్రారంభమైంది. మూడు నుంచి నలుగురు ఉగ్రవాదులు చిక్కుకున్నారని భావిస్తున్నారు' అని తెలిపారు. ఆ జేసీవోను సైనిక ప్రత్యేక దళానికి చెందిన జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్ (జేసీవో) నాయబ్ సుబేదార్ రాకేశ్ కుమార్‌గా గుర్తించారు. విధి నిర్వహణలో అమరుడైన రాకేశ్ త్యాగానికి సెల్యూట్ అని వైట్ నైట్ కోర్ తెలిపింది. కాగా, గడిచిన 24 గంటల్లో జమ్మూకశ్మీర్‌లో ఇది మూడో ఎన్‌కౌంటర్. అంతకుముందు రోజు, శ్రీనగర్‌లోని జబర్వాన్ అడవిలో ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్ సందర్భంగా ఉగ్రవాదులు, భద్రతా దళాల మధ్య ఎదురుకాల్పులు ప్రారంభమయ్యాయి. 'ఉగ్రవాదుల ఉనికి గురించి నిర్దిష్ట నిఘా ఆధారంగా శ్రీనగర్‌లోని జబర్వాన్ అటవీ ప్రాంతంలో ఉమ్మడి పోలీసు, భద్రతా దళాలు ఆపరేషన్ ప్రారంభించాయి. ఈ ఆపరేషన్ సమయంలో కాల్పులు జరిగాయి' అని కశ్మీర్ జోన్ పోలీసులు చెప్పారు. అలాగే శనివారం బారాముల్లా జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక ఉగ్రవాదిని భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. రాజ్‌పురా ప్రాంతంలో అనుమానాస్పద కార్యకలాపాలను గమనించిన తర్వాత భద్రతా దళాలు, రాష్ట్ర పోలీసులు సంయుక్త ఆపరేషన్‌ను ప్రారంభించారు.

'డబుల్ ఇంజిన్' పట్టాలు తప్పింది

మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ విమర్శ

న్యూఢిల్లీ: స్థిరమైన ఆదాయ స్తబ్దత కారణంగా భారతదేశం 'డిమాండ్ సంక్షోభం' ఎదుర్కొంటోందని కాంగ్రెస్ ఆదివారం తెలిపింది. యూపీఏ దశాబ్దపు స్థిరమైన జీడీపీ వృద్ధికి శక్తినిచ్చిన ప్రైవేట్ పెట్టుబడులు, భారీ వినియోగానికి చెందిన 'డబుల్ ఇంజన్' గత పదేళ్ల మోదీ ప్రభుత్వ పాలనలో 'పట్టాలు తప్పింది' అని విమర్శించింది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వేతనాలను రోజుకు కనిష్టంగా రూ.400కు పెంచాలని, పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ), రైతులకు రుణ మాఫీ, మహిళలకు నెలవారీ ఆదాయ మద్దతు పథకానికి సంబంధించి కాంగ్రెస్ ప్రతిపాదిస్తున్న దానిని అంగీకరించాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్ వ్యవహారాల ఇన్‌ఛార్జి) జైరాం రమేశ్ ప్రభుత్వాన్ని కోరారు. రోజులు గడిచేకొద్దీ భారతదేశ వినియోగ కథకు సంబంధించిన విషాదం మరింత స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. గత వారం ఇండియా ఇంక్‌కు చెందిన అనేక మంది సీఈవోలు 'కుంచించుకుపోతున్న' మధ్యతరగతిపై హెచ్చరికను పెంచారు. ఇప్పుడు నాబార్డ్‌కు చెందిన ఆల్ ఇండియా రూరల్ ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ సర్వే (ఎన్ఏఎఫ్ఐఎస్) 2021-22 నుంచి వచ్చిన కొత్త డేటా భారతదేశ డిమాండ్ సంక్షోభం నిరంతర ఆదాయ స్తబ్దత ఫలితంగా ఉందని రుజువు చేస్తోందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. సర్వే డేటా నుంచి కీలకమైన అంశాలను ఉటంకిస్తూ, భారతీయుల సగటు నెలవారీ కుటుంబ ఆదాయం వ్యవసాయ కుటుంబాలకు రూ.12,698 నుంచి రూ.13,661, వ్యవసాయేతర కుటుంబాలలో రూ.11,438 అని జైరాం రమేశ్ వివరించారు. 'సగటు గృహ పరిమాణం 4.4 అని ఊహిస్తే, గ్రామీణ ప్రాంతాల్లో తలసరి ఆదాయం నెలకు రూ.2,886... రోజుకు రూ.100 కంటే తక్కువ. అందువల్ల చాలా మంది భారతీయులు ప్రాథమిక అవసరాలకు మించి విచక్షణతో వినియోగించుకోవడానికి చాలా తక్కువ డబ్బును కలిగి ఉన్నారు' అని ఆయన ఆ డేటాను ఉదహరించారు.

నేడు మైనార్టీ సంక్షేమ దినోత్సవం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137వ జయంతి సందర్భంగా మైనార్టీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవానికి ప్రభుత్వ ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏపీ ప్రభుత్వ మైనారిటీ సంక్షేమ శాఖ అధ్వర్యంలో సోమవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మైనార్టీ సంక్షేమ దినోత్సవం రాష్ట్రస్థాయి కార్యక్రమానికి ఏర్పాట్లు చేపట్టారు. ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు అధ్యక్షతన మైనార్టీ సంక్షేమ దినోత్సవం నిర్వహిస్తున్నారు. కళాక్షేత్రంలో కొనసాగుతున్న వివిధ ఏర్పాట్లను రాష్ట్ర మైనార్టీ సంక్షేమ న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఆదివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సోమవారం ఉదయం 11 గంటలకు జరిగే మైనార్టీ సంక్షేమ దినోత్సవానికి ముఖ్య అతిథులుగా సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హాజరవుతారన్నారు. మంత్రులు సత్యకుమార్, కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి, ఎంపీలు కేశినేని శివనాథ్, వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137వ జయంతి సందర్భంగా మైనార్టీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు ఫరూక్ తెలిపారు. అన్ని జిల్లా కేంద్రాల్లో కలెక్టర్ల అధ్యక్షతన కార్యక్రమాలకు ప్రభుత్వం తరపున అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

సీ-ప్లేన్‌తో రాష్ట్రాభివృద్ధా?

ఆస్తులు అమ్మి సంపద సృష్టిస్తారా

చంద్రబాబుకు జగన్ సవాల్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేశంలో మరెక్కడా లేనట్టుగా సీ-ప్లేన్ నడిపితే చాలు రాష్ట్రాభివృద్ధి జరిగిపోయినట్టుగా సీఎం చంద్రబాబు గొప్పలు పోతున్నారని వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఎద్దేవా చేశారు. 'మాయ చేస్తాడు, మభ్యపెడతాడు, చివరకు ప్రజలను మోసగిస్తాడని, దీని కోసం ఎంతకైనా వెళ్తాడ'ని ఆయన ఆదివారం ఎక్స్‌లో విమర్శించారు. విజయవాడ నుంచి శ్రీశైలం వరకు 'సీ-ప్లేన్' పర్యటనను ఉద్దేశించి జగన్ చురకలు అంటించారు. సెల్‌ఫోన్, కంప్యూటర్లు తానే కనిపెట్టానని రెండు దశాబ్దాలుగా కబుర్లు చెబుతున్న చంద్రబాబు, ఇప్పుడు సీ-ప్లేన్ మీద కహానీలు మొదలు పెట్టారని దుయ్యబట్టారు. ఓవైపు వైసీపీ హయాంలో ప్రజల సంపదగా నిర్మిస్తూ సృష్టించిన వైద్య కళాశాలలు, పోర్టులను ప్రైవేట్‌పరం, స్కాములు చేస్తూ తన మనుషులకు అమ్ముతూ, మరోవైపు దీనిమీద ప్రజల్లో చర్చ జరగరాదనే సీ-ప్లేన్‌తో అభివృద్ధి ఏదో జరిగినట్టుగా ప్రచార ఆర్భాటం చేస్తున్నారని చంద్రబాబును జగన్ ఘాటుగా విమర్శించారు. సీ-ప్లేన్ అన్నది 114 ఏళ్ల క్రితమే 1910లో నడిచిందని, కేరళలో 2013లో మొదలైంది కానీ తర్వాత నిలిపేశారని ఆయన గుర్తుచేశారు. గుజరాత్‌లో 2020లో ఈ సేవలు మొదలుపెట్టినా అవి అనేకమార్లు నిలిచిపోయాయని తెలిపారు. 'ప్రతి రాష్ట్రంలోనూ రిజర్వాయర్లు, డ్యాములు ఉండగా ఇలాంటి ప్రయోగాలు ఎందుకు జరగడంలేదు. సంపద సృష్టించడమంటే ప్రభుత్వ రంగంలో పోర్టులు నిర్మించి తద్వార అభివృద్ధి చేసి ప్రభుత్వానికి ఆదాయం కల్పించడమని... ప్రభుత్వ వైద్య కాలేజీలను అందుబాటులోకి తెచ్చి, ఉచితంగా నాణ్యమైన, అత్యాధునిక వైద్యాన్ని అందించే కార్యక్రమాలు చేపడం' అని జగన్ అన్నారు. సీ-ప్లేన్ మీద ప్రచార ఆర్భాటం అభివృద్ధి కాదని హితవు పలికారు. సుదీర్ఘ తీర ప్రాంతాన్ని వినియోగించుకుని మెరుగైన వాణిజ్యాన్ని, రాష్ట్రానికి అదనపు ఆదాయాన్ని, ప్రజలకు ఉపాధిని, పారిశ్రామిక ప్రగతిని సాధించడానికి ప్రభుత్వ రంగంలో రూ.4,361.91 కోట్లతో మూలపేట, రూ.5,156 కోట్లతో మచిలీపట్నం, రూ.3,736.14 కోట్లతో రామాయపట్నం వద్ద పోర్టులను రూ.13,254.05 కోట్లతో నిర్మిస్తే దాన్ని అభివృద్ధి, సంపద సృష్టి అంటారా లేక సీ-ప్లేన్‌లో తిరిగి ఈ పోర్టు ఆస్తులను, మీ వారికి స్కామ్‌ల ద్వారా తెగనమ్మితే అభివృద్ధి, సంపద సృష్టి అంటారా? అని చంద్రబాబును జగన్ నిలదీశారు. ప్రభుత్వరంగ పోర్టుల వల్ల రాష్ట్రానికి ఆదాయాలు పెరుగుతాయా లేక వనరులను అమ్మితేనా అని ప్రశ్నించారు. సీ-ప్లేన్స్ వల్ల రాష్ట్రానికి సంపద పెరుగుతుందా అంటూ జగన్ మండిపడ్డారు. చంద్రబాబూ...మీరు, మీ పార్టీ నాయకుల అభివృద్ధే రాష్ట్రాభివృద్ధిగా... మీరు, మీ మనుషులు ఆస్తులు కూడబెడితే అది ప్రజల కోసం సృష్టించిన సంపదగా చెప్పుకుంటారా అంటూ జగన్ మోహన్ రెడ్డి విమర్శించారు.

పాత్రికేయులు బాధ్యతతో మెలగాలి

- గ్రామీణ విలేకరులే నా గురువులు
- విభజన సమయంలో కత్తి మీద సాములా పనిచేశా
- ఆత్మీయ సమావేశంలో ఆంధ్రజ్యోతి పూర్వ సంపాదకులు శ్రీనివాస్

విశాలాంధ్ర-విజయవాడ: పత్రికా రంగంలో యాజమాన్య విధానాలు ఎంత ముఖ్యమో, సమాజంపై పాత్రికేయుల బాధ్య త అంతే ముఖ్యమని ఆంధ్రజ్యోతి పూర్వ సంపాదకులు, సాహితీవేత్త కే శ్రీనివాస్ ఉద్ఘాటించారు. గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు అధ్యక్షతన ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీనివాస్ మాట్లాడుతూ తన పాత్రికేయ ప్రస్థానం విజయవాడలోనే మొదలైందని, ఈ ప్రాంతంతో తనకెంతో అనుబంధం, ఎన్నో జ్ఞాపకాలు ఉన్నాయని అన్నారు. వృత్తి పరంగానే కాక, సాహిత్యపరంగా పుస్తక ప్రదర్శన కోసం విజయవాడకు వస్తూ ఎంతోమంది మిత్రులను సంపాదించుకున్నానని వివరించారు. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణ వాసిగా ఆ ప్రాంతానికి అనుకూలంగా వ్యవహరిస్తానని కొందరు అనుమానం వ్యక్తం చేశారని, విభజన తర్వాత రెండు రాష్ట్రాలకు ఒకే సంపాదకుడిగా కొనసాగడంపైనా పలువురు విభిన్న అభిప్రాయాలు వ్యక్తం చేశారని గుర్తు చేసుకున్నారు. పాత్రికేయులు కుల, మత, ప్రాంతాలకు అతీతంగా సమాజం కోసం బాధ్యతతో మెలగాలని, అందుకే తన రాతలపై అనుమానాలు బహిర్గతం చేసినవారు సైతం తర్వాత తనను అభిమానించారని పేర్కొన్నారు. ఇరు ప్రాంతాల ప్రజల మనోభావాలను గౌరవించే విధంగా పని చేయడం కత్తి మీద సాముగా మారిందని అన్నారు. సంపాదకుడుగా ప్రజల జీవన విధానాలను దగ్గరి నుంచి పరిశీలించే అవకాశం తనకు లభించిందని, క్షేత్రస్థాయి పర్యటనల్లో కలిసిన గ్రామీణ ప్రాంత విలేకరుల నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నానని, వారే తన గురువులని పేర్కొన్నారు. పాత్రికేయులు ఏ స్థాయిలో ఉన్నా నిత్య విద్యార్థులేనన్నారు. మహాకవి శ్రీశ్రీ మహాప్రస్థానంలోని కవితలు విశాఖపట్నంలో ఏయే ప్రాంతాల్లో కూర్చుని రాశారనే కథనం ప్రచురించడం తన పాత్రికేయ జీవితంలో ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. పదవీ విరమణ చేసినా పాత్రికేయ రంగంతో అనుసంధానాన్ని కొనసాగిస్తానని శ్రీనివాస్ స్పష్టం చేశారు. శ్రీనివాస్ సతీమణి సుధ మాట్లాడుతూ వ్యక్తిగతంగా సున్నిత మనస్కులైన ఆయన ఒక గొప్ప తండ్రిగా పిల్లలను పెంచారన్నారు. శ్రీనివాస్ ఒక్కరు కాదని, సంఘర్షణ శక్తి అని చెప్పారు. తమ జీవన ప్రయాణం విజయవాడలోనే మొదలైందని గుర్తు చేసుకున్నారు. సభాధ్యక్షుడు ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ శ్రీనివాస్ సంపాదకులుగా, జర్నలిస్టుగా, సాహితీవేత్తగా తెలుగు రాష్ట్రాల ప్రజలకు సుపరిచితులని కొనియాడారు. ఆయన వ్యాసాలు, రచనలు, కథనాలు అందరికీ పరిచయమేనని అన్నారు. తెలంగాణ అక్రిడిటేషన్ల కమిటీ సభ్యుడిగా ఆయన ఇచ్చిన ప్రతిపాదనలను ఆంధ్రాలోనూ అమలు చేయాలని సమాచార శాఖ మంత్రి, డైరెక్టర్లను కోరామని తెలిపారు. ఐజేయు కౌన్సిల్ సభ్యుడు షేక్ బాబు మాట్లాడుతూ శ్రీనివాస్ జ్ఞానం అపారం, వ్యక్తిత్వం నిరాడంబరం, మాట సున్నితం, రాత ఖండితమని కొనియాడారు. విజయవాడ అర్బన్ అధ్యక్షుడు చావా రవి మాట్లాడుతూ సంపాదకుల్లో సి. రాఘవాచారి తర్వాత అంతటి ఆదర్శంగా తీసుకునే వ్యక్తి శ్రీనివాస్ అని కొనియాడారు. నేటి తరం పాత్రికేయులు శ్రీనివాస్ ను ఆదర్శంగా తీసుకుని నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కంచల జయరాజ్ మాట్లాడుతూ శ్రీనివాస్ సంపాదకీయాలు సమకాలీన అంశాలను విశ్లేషిస్తాయని, సామాన్యులకు కూడా అర్థమయ్యేలా, ఆకట్టుకునేలా, ఆలోచింపచేసేలా ఉంటాయని ప్రశంసించారు. చిన్న పత్రికల సంఘం సామ్నా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి మాట్లాడుతూ శ్రీనివాస్ వ్యాసాలు సమాజాన్ని అన్ని కోణాల్లో పరిచయం చేస్తాయని కొనియాడారు. సీనియర్ పాత్రికేయులు చిగురుపాటి సతీశ్, వడ్లమూడి పద్మావతి, వీ కృచ్చేవ్ మాట్లాడుతూ శ్రీనివాస్ రాసే అక్షరాలు సంక్షిప్తంగా, సున్నితంగా, సూటిగా ఉంటాయని కొనియాడారు. యూనియన్ విజయవాడ అర్బన్ కార్యదర్శి దారం వెంకటేశ్వరరావు స్వాగతం పలికారు. అనంతరం శ్రీనివాస్ దంపతులను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. సి.రాఘవాచారి ట్రస్ట్ తరుపున ట్రస్ట్ ప్రతినిధి అక్కినేని చంద్రరావు జ్ఞాపిక అందించారు. ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు ఏచూరి శివ, విశాలాంధ్ర న్యూస్ ఎడిటర్ మోదుమూడి మురళీ కృష్ణ, ప్రెస్ క్లబ్ కార్యదర్శి దాసరి నాగరాజు, కోశాధికారి సయ్యద్ అహ్మద్ హుస్సేన్, గుంటూరు జిల్లా అధ్యక్షుడు షేక్ మీరా, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు వెంకట్రావు, సీనియర్ జర్నలిస్టులు సాంబశివరావు, సుబ్బారావు, పాత్రికేయులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు కరువు భత్యం ఏదీ ?

ఆంధ్రప్రదేశ్ వీఆర్వోల సంఘం డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉద్యోగుల సమస్యల పరిష్కారం... వారికి కరువు భత్యం (డీఏ) ఇచ్చేది ఎప్పుడంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ వీఆర్వోల సంఘం ప్రశ్నించింది. ఉద్యోగుల గురించి ఈ ప్రభుత్వం చర్చించిన దాఖలాలే లేవని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. దసరా, దీపావళి పండుగల వేళ డీఏ ప్రకటిస్తారని ఆశించి ఉద్యోగులు భంగపడ్డారన్నారు. 'ప్రతినెల ఒకటో తేదీన ఇంటింటికీ పింఛన్ల పంపిణీలో ఉద్యోగులు పూర్తిగా సహకరిస్తున్నారు. ప్రతి ప్రభుత్వ పథకం అమలులో కీలక పాత్ర పోషిస్తున్నారు. అధికారంలో ఎవరున్నా... ప్రజలకు అందే పథకాలను ప్రజలకు సక్రమంగా అందించేందుకు కట్టుబడుతున్నారు.పాలకులు మాత్రం వీరి సంక్షేమాన్ని పట్టించుకోవడంలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా ఉద్యోగులకు ఇప్పటివరకు డీఏ కూడా ప్రకటించలేదు' అని భూపతి రాజు వ్యాఖ్యానించారు. బడ్జెట్ సమావేశాలలో ఉద్యోగుల సమస్యలపై చర్చించాలని, వాటి పరిష్కారానికి దశలవారీగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

జగన్ ట్వీట్‌లు అబద్ధాల పుట్ట: పల్లా

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ ట్వీట్ అబద్ధాల పుట్ట అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో అన్నారు. చేసిన తప్పులకు ఆత్మ విమర్శ చేసుకోవడం మానేసి... ఎదురు దాడికి దిగుతున్నారని విమర్శించారు. దోపిడీ దారుడే... నేర రాజకీయాలు చేస్తాడని పేర్కొన్నారు. తన తండ్రి రాజశేఖరరెడ్డి అధికారాన్ని అడ్డం పెట్టుకుని జగన్ పెద్దఎత్తున దోపిడి చేశాడని ఆరోపించారు. ఇదే విషయాన్ని సీబీఐ తన ఛార్జీషీట్‌లో స్పష్టం చేసిందని గుర్తు చేశారు. చట్టబద్ధ వ్యాపారం, పాలన చేసే సీఎం చంద్రబాబుకు వ్యవస్థీకృత నేర రాజకీయాలు చేసే అవసరం లేదని పల్లా స్పష్టం చేశారు. జగన్ ట్వీట్‌లో ఉన్నదంతా నేరాల సమర్థనేనన్నారు. పరనింద తప్ప జగన్‌లో మరొకటి లేదని చెప్పారు. అబద్ధాలతో ఎదురు దాడి చేసే నేతల రాజకీయ భవిత కనుమరుగు అవుతుందన్నది చారిత్రక సత్యమని పేర్కొన్నారు.

సిద్దిఖీ హంతకుడి అరెస్టు

ముంబై: ఎన్‌సీపీ నేత బాబా సిద్దిఖీని కాల్చి చంపిన శివ కుమార్ పట్టుబడ్డాడు. నేపాల్‌కు తప్పించుకునే ప్రయత్నంలో ఉత్తరప్రదేశ్ ప్రత్యేక టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్), ముంబై క్రైంబ్రాంచ్‌కు చిక్కాడు. ఆదివారం ఉత్తరప్రదేశ్‌లోని బహ్రెయిచ్‌లో అతనిని అరెస్టయ్యాడు. శివ కుమార్‌తో పాటు అతనికి ఆశ్రయమిచ్చి, నేపాల్ వెళ్లేందుకు సహకరించిన మరో నలుగురినీ అదుపులోకి తీసుకున్నారు. తాను లారెన్స్ బిష్ణోయ్ ముఠా సభ్యుడినని విచారణ సమయంలో శివకుమార్ అంగీకరించాడు. లారెన్స్ బిష్ణోయ్ సోదరుడు అన్మోల్ బిష్ణోయ్ ఆదేశాలతోనే సిద్దిఖీని హత్య చేసినట్లు వెల్లడించాడు. లారెన్స్ బిష్ణోయ్‌కు సన్నిహితుడైన శుభమ్ లోంకర్ ద్వారా అన్మోల్ బిష్ణోయ్‌తో అనేకమార్లు సంప్రదించినట్లు శివకుమార్ చెప్పాడు.

రాజస్థాన్‌లో కాషాయ రాజకీయం: కాంగ్రెస్

న్యూఢిల్లీ: కాయాకల్ప్ పథకం కింద రాష్ట్రంలోని 20 ప్రభుత్వ కళాశాలల భవనాలకు కాషాయ రంగ వేయాలంటూ రాజస్థాన్ కాలేజి విద్య కమిషనరేట్ ఆదేశాలివ్వడం రాజకీయంగా దుమారం రేపింది. ఈ ఆదేశాలను ప్రతిపక్ష కాంగ్రెస్ ఆక్షేపించింది. విద్య కాషాయికీకరణ, రాజకీయాకరణ జరుగుతోందని దుయ్యబట్టింది. విద్యా సంస్థల్లో సానుకూల వాతావరణం కోసమే రంగు వేయిస్తున్నట్లు కమిషనరేట్ ఉత్తర్వులు పేర్కొన్నాయి. తొలి దశలో ప్రతి డివిజన్‌లోని రెండు చొప్పున 20 కళాశాల భవనాలకు కాషాయ రంగులు వేయాలన్నాది. 'ఏషియన్ పెయింట్స్ వైట్ గోల్డ్ 8292, ఏషియన్ పెయింట్స్ ఆరెంజ్ క్రౌన్ 7974' షేడ్లనే వాడాలని కచ్చితంగా తెలిపాయి. బీజేపీ ప్రభుత్వం విద్యా సంస్థల రాజకీయాకరణకు యత్నిస్తోందని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు స్వర్ణిమ్ చతుర్వేది విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో విఫలమైందని దుయ్యబట్టారు. చెప్పుకోదగ్గ విజయాలు లేకపోవడంతో ప్రజల దృష్టి మళ్లించేందుకు ఇలాంటివి చేస్తోందని చతుర్వేది విమర్శించారు.

వైసీపీ ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలి

పోతుల బాలకోటయ్య

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అసెంబ్లీకి వెళ్లని వైసీపీ ఎమ్మెల్యేలు రాజీనామాలు చేసి, ప్రజాస్వామిక విలువలకు పట్టం కట్టాలని అమరావతి బహుజన ఐకాస అధ్యక్షులు పోతుల బాలకోటయ్య పేర్కొన్నారు. ఆదివారం ఆయన మీడియాకు ప్రకటన విడుదల చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఇచ్చిన తీర్పును ఎమ్మెల్యేలు గౌరవించాలని, నియోజకవర్గ సమస్యలను ఎత్తిచూపి న్యాయం చేయాలని, లేని పక్షంలో ప్రజలకు తీరని అన్యాయం చేసినట్టే అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో పాటు 11 మంది ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లాలని, లేని పక్షంలో 11 మంది ఎమ్మెల్యేలు రాజీనామాలు చేసి మళ్లీ ప్రజల్లోకి వెళ్లాలని హితవు పలికారు. ప్రతిపక్షం అంటే వీధి పోరాటాలు చేసే పార్టీ కాదని, చట్ట సభల్లో పోరాడే పార్టీ అని జగన్ మోహన్ రెడ్డికి బాలకోటయ్య సూచించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.